ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
4-8-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 184 పేజీలు: 8+16 వెల: 6.50



దేశవ్యాప్తంగా 35 మందుల ధరలు తగ్గింపు
కాలువలోకి దూసుకెళ్లిన కారు:11 మంది దుర్మరణం
5


## రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోడీ, అమిత్‌షాల భేటీ

### అమెరికా సుంకాల ప్రభావం, ఆపరేషన్ సిందూర్‌పై చర్చ

**న్యూఢిల్లీ,ఆగస్టు 3:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్‌షాలు భేటీ అయ్యారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో ప్రధానిమోడీ భేటీ అయితే కొన్ని గంటల వ్యవధిలోనే హోంమంత్రి అమిత్‌షా కూడా రాష్ట్రపతి ముర్మును కలుసుకున్నారు. ప్రస్తుత పార్లమెంటు వర్షాకాల సమావేశాలు కొనసాగుతున్న సమయంలో మోడీ, అమిత్‌షాలు తొలిసారి రాష్ట్రపతితో భేటీ అయ్యారు. అలాగే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ప్రకటించిన సుంకాల తర్వాత వీరి భేటీ ఇపుడు ప్రాధాన్యతను సంతరించుకుంది. అలాగే ఆపరేషన్ సింధూర్‌పై ఉభయసభల్లో జరిగిన చర్చలను కూడా రాష్ట్రపతి ముర్ముతో వీరిరువురూ పంచుకున్నట్లు సమాచారం. ఆగస్టు 12వరకూ జరిగే పార్లమెంటుసమావేశాల్లో చేపట్టే అజెండాపై కూడా వీరిమధ్య చర్చకు వచ్చినట్లు అధికార వర్గాల సమాచారం.



ఆదివారం రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయిన ప్రధాని మోడీ



## కెసిఆర్, హరీష్, ఈటలలపై
# క్రిమినల్ చర్యలు!

### ఘోష్ నివేదికపై సిఎస్ ఆధ్వర్యంలో సమావేశమైన అధికారుల కమిటీ

- కెసిఆర్, హరీష్ ఆదేశాలతోనే జరిగిన కాళేశ్వరం నిర్మాణం
- తప్పు చేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు
- ప్రత్యేక చర్చకోసం వచ్చేవారం అసెంబ్లీ సమావేశం?
- నేటి కేబినెట్ సమావేశంలో విస్తృతంగా చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు3:** కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ అందించిన నివేదికపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదివారం సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌పై అధికారుల కమిటీ అధ్యయనం చేసింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు అధికారుల దృష్టికి వచ్చాయి. సమగ్ర వివరాలతో నివేదికను కేబినెట్ ముందు అధికారుల కమిటీ ఉంచనున్నారు. కాళేశ్వరం బాధ్యులపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి కమిషన్ సూచించినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు అక్రమాలలో కెసిఆర్,హరీశ్‌రావు,ఈటల పాత్రపై నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇరిగేషన్ అధికారులు పంపిన అంచనాలకు గుడ్డిగా ఆమోదం తెలిపారని చెప్పినట్లు సమాచారం. అధ్యయన కమిటీ మంత్రివర్గానికి సోమవారం పూర్తి వివరాలను వెల్లడించనుంది. కమిషన్ ప్రభుత్వానికి పలు సూచనలు చేసినట్లు తెలుస్తోంది. కెసిఆర్ హరీశ్‌రావు ఆదేశాలతోనే ప్రాజెక్టు నిర్మాణం >>2

# లక్షకోట్లు లూటీ!




### సైబర్ నేరాలపై బ్యాంక్‌లకు ఆర్‌బిఐ హెచ్చరిక

### గతేడాది దేశంలో రూ. 22.845 కోట్ల దోపిడీ

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** దేశంలో ఏయేటికాయేడు పెరుగుతున్న సైబర్ నేరాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) దేశంలోని అన్ని జాతీయ, ప్రైవేటు, సహకార బ్యాంకులను అప్రమత్తం చేయడంతో పాటు జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించింది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో సైబర్ నేరాలు కొంత ఎక్కువగానే వుండడంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆర్‌బిఐ గత ఏడాది (2024)లో దేశంలో 22 వేల 845 కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన విషయాన్ని ఉదహరించింది. ఈ ఏడాది లక్ష కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్లు లూటీ చేసే ప్రమాదం వుందని, ఈ విషయంలో బ్యాంకుల యాజమాన్యాలు మరింత సమన్వయంతో వుంటూ పోలీసు విభాగాలతో కలిసి ముందుకు వెళ్లాలని కోరింది. ఈ సందర్భంగా డాటా లీడ్స్ సంస్థ వెల్లడించిన నివేదిక అంశాలను బ్యాంకులకు ఆర్‌బిఐ అందజేసింది. 2023లో సైబర్ నేరాల వల్ల బాధితులు పో గొట్టుకున్న సొమ్ము ఏడు వేల 465 కోట్ల రూపాయలు కాగా అంతకు ముందు ఏడాది అంటే 2022లో రెండు వేల 306 కోట్ల రూపాయలను సై బర్ నేరగాళ్లు దోచుకున్నారు. 2022 తో పోలిస్తే 2024లో సైబర్ నేరగాళ్లు దోచుకున్న సొమ్ము పదింతలు పెరిగింది. 2024లో సైబర్ నేరగాళ్లు కాజేసిన 22 వేల 845 కోట్ల రూపాయలు సైబర్ చరిత్రలోనే అత్యధికమని పోలీసులు చెబుతున్న విషయాన్ని ఆర్‌బిఐ ఉదహరించింది. ఇది వ్యక్తు లు, ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న సైబర్ నేరాల ప్రభావాన్ని చూపుతోందని ఆర్‌బిఐ వెల్లడించింది. ఇదే సమయంలో సైబర్ నేరాలపై ఫిర్యాదులు కూ డా గణనీయంగా పెరిగిన విషయాన్ని ఆర్‌బిఐ తెలిపింది. 2023లో 20 లక్ష లకు పైగా సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు అందగా 202 3లో ఈ సంఖ్య 15.60 లక్షలుగా వుందని, 2019తో పోలిస్తే తాజాగా నమోదైన ఫిర్యాదులు పదిరెట్లు పెరిగాయని ఆర్‌బిఐ వెల్లడించింది. 2024 లో నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం, సిటిజన్ ఫైనాన్సి యల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం వంటి ఫ్లా ట్ ఫాంలలోనే 36.37 లక్షల ఆర్థిక మోసాల కేసులు నమోదయ్యాయని, దీంతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ (ఎఐ) ఆధారిత స్కాంలు 20 24లో >>2



## 42% కోటాపై ఢిల్లీలో పోరు

- నేడు చర్లపల్లి నుంచి వాస్తినకు కాంగ్రెస్ నేతల రైలు
- రేపు పార్లమెంటులో తుఫాను
- 6న జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా
- 7న రాష్ట్రపతితో భేటీ
- సిఎం రేవంత్, పిసిసి చీఫ్ మూడు రోజులు అక్కడే

**హైదారబాద్,ఆగస్టు 3,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్రప్రభుత్వంపై సమరం తీవ్రతరం చేయడానికి ఢిల్లీ వేదిక ఎంచుకొంది. బిసి రిజర్వేషన్ బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి >>2

## వాటానీరు చుక్క వదలం

### కృష్ణ, గోదావరి జలాలను పూర్తిగా వినియోగించుకొంటాం

- 'బనకచర్ల'ను పూర్తిగా అడ్డుకుంటాం
- రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్లు
- 51 లక్షల కుటుంబాలకు 'గృహాజ్యోతి': డి. సిఎం భట్టి



ఆదివారం కమలాపురంలో గోదాముల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన డి.సిఎం భట్టి విక్రమార్క

**ముదిగొండ, ప్రభాతవార్త ఆగస్టు 3:** కృష్ణా, గోదావరి నదులలో నీటి చుక్క కూడా తెలంగాణ వాటా వదులుకునే ప్రసక్తే లేదనిడిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు.రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు ఆదివారం మధిర నియోజకవర్గం ముదిగొండ మండలంలో పర్యటించి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, వేర్ హౌసింగ్ కార్పోరేషన్ ఎం.డి. లక్ష్మీ ్మలతో కలిసి కమలాపురం గ్రామంలో 10 కోట్ల రూపాయలతో నిర్మించనున్న 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థం గల గోదాం నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రైతులు, ప్రజలనుద్దేశించి మాట్లాడారు.డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో 5 లక్షల 91 వేల మెట్రిక్ టన్నుల గోడౌన్ సామర్థం ఉంటే, గత 20 నెలల కాలంలో గిడ్డంగుల సంస్థ ద్వారా 10 లక్షల 75 వేల మెట్రిక్ టన్నుల సామర్థం గిడ్డంగుల నిర్మాణానికి కృషి చేస్తున్నామని అన్నారు. సకాలంలో సాగు నీటి సరఫరా, రుణమాఫీ, రైతు భరోసా వంటి అనేక కార్యక్రమాలు అమలు చేయడం వల్ల దేశంలోనే అత్యధికంగా వరి ఉత్పత్తి మన రైతులు సాధించారని అన్నారు. నాగార్జున సాగర్ టెయిల్ ఎండ్ ప్రాంతాలకు నీటి ఇబ్బంది వల్ల మనం నష్టపోతున్నామని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం వల్ల నాగార్జున సాగర్ నిండదని, దీని వల్ల ఖమ్మం జిల్లా రైతాంగం నష్ట పోతుందని అన్నారు. గత పాలకులు కృష్ణ, గోదావరి నదులపై ప్రాజెక్టు కట్టలేదని అన్నారు. కృష్ణాపై జూరాల, కల్వకుర్తి, బీమా, నెట్టంపాడు, కోయిల్ సాగర్ వంటి ప్రాజెక్టులను గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తి చేశాయని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయకుండా పెండింగ్ పెట్టారని డిప్యూటీ సీఎం విమర్శించారు. ప్రతి రోజూ 13 >>2



## నేటి నుండి సినిమా షూటింగ్‌లు బంద్

### తెలుగు ఫిల్మ్ ఫెడరేషన్ సంచలన నిర్ణయం

**హైదరాబాద్, అగస్టు 3, ప్రభాతవార్త:** తెలుగు చలన చిత్ర పరిశ్రమలో షూటింగ్‌లను బంద్ చేయాలని తెలుగు ఫిల్మ్ ఫెడరేషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. నిర్మాతలు, ఫెడరేషన్ నాయలకుల మధ్య వివిధ పర్యాయాలు జరిగిన చర్చలు విఫలం కావడంతో ఈ నెల 4వ తేదీ నుండి షూటింగ్‌లు బంద్ చేయాలని నిర్ణయించారు. సినిమాలకు పని చేసే వివిధ క్రాఫ్ట్స్‌లోని కార్మికుల రోజు వారి వేతనాల పెంపు విషయంలో ఫిలిం ఛాంబర్‌లో కీలక సమావేశం జరిగింది. ఇంటర్నల్‌గా జరిగిన సమావేశంలో నిర్మాతలు ఛాంబర్ సభ్యులు తో ఫెడరేషన్ నాయకుల భేటీ అయ్యారు. వేతనాలు పెంపు విషయంలో ఫిల్మ్ ఛాంబర్-తెలుగు ఫిల్మ్‌ఫెడరేషన్ నాయకులు మధ్య ఇరువురు మధ్య వాడి వేడిగ చర్చిలు జరిగాయి. కార్మికులకు ప్రతీ మూడేళ్లకోసారి 30 శాతం మేర వేతనాలు పెంచాలనే నిబంధన గత నెల జూన్ 30వ తేదీతో ముగిసింది. దాంతో నిబంధనలకు అనుగుణంగా వేతనం పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ >>2

### రేపు ఇసి సమావేశానికి
## బిఆర్ఎస్ హాజరు

### ఢిల్లీ వెళ్తున్న కెటిఆర్ బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు3:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఢిల్లీ పర్యటనకు సిద్ధమైంది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఏర్పాటు చేసిన కీలక సమావేశంలో పాల్గొనేందుకు ఈ బృందం ఢిల్లీకి వెళ్లనుంది. రాజకీయ పార్టీలతో ఈసీఐ నిర్వహించనున్న ఈ భేటీ ఆగస్టు 5వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో జరగనుంది. ఈ సమావేశానికి హాజరుకావాల్సిందిగా బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల సంఘం కార్యదర్శి అశ్వనీ కుమార్ మోహల్ అధికారికంగా లేఖ పంపారు. తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి ద్వారాకూడా బీఆర్ఎస్ అధ్యక్షుడికి సమాచారం అందించారు. కేటీఆర్ నాయకత్వంలోని ఈ బృందంలో పార్టీ సీనియర్ నేతలు, మాజీ పార్ల మెంట్ సభ్యులు ఉండనున్నారు. రాజ్యసభలో బీఆర్ఎస్ పక్ష నేత కేఆర్ సురేశ్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్ కుమార్, బాల్క సుమన్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఈబృందంలో సభ్యులుగా >>2




## కవితపై దుమ్మెత్తిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

### ఆమె గురించి మాట్లాడటమే వృథా అంటూ కామెంట్

### బిఆర్ఎస్‌లో దుమారం రేపిన కవిత వ్యాఖ్యలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు3:** బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిపై పరోక్షంగా విరుచుకుపడ్డారు. బిఆర్ఎస్ సూర్యపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని లిల్లిపుట్ అంటూ సంబోధించిన కవిత, కేసీఆర్ నీడలో బతికే ఆయనకు సొంత అస్తిత్వం లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీనిపై జగదీశ్ రెడ్డి కూడా అంతే స్థాయిలో స్పందిస్తూ సెటైరికల్ కౌంటర్ ఇచ్చారు తన ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి కవితకు ఉన్న జ్ఞానానికి జోహార్లు అని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు బద్ధ శత్రువులుగా ఉన్న వాళ్లు, బీఆర్ఎస్‌ను ఖతం చేయాలని చూస్తున్న వారు ఏం మాట్లాడుతున్నారో.. కవిత అదే మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ శత్రువులు ఉపయోగించిన పదాలను కవితవల్లె వేస్తున్నారని ఆక్షేపించారు. ఆదివారం >>2



## నేటి నుంచి కామన్ పిజి ఎంట్రన్స్ పరీక్షలు

### మూడు సెషన్లలో నిర్వహణ

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 2:** రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లోని పిజి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ కామన్ పిజి ఎంట్రన్స్ టెస్ట్(టిజిసిపిజిఈటి)-2025 పరీక్షల నేటి(సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 11 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్షలను ప్రతి రోజూ మూడు సెషన్‌లలో నిర్వహించనున్నారు. దరఖాస్తు గడువు ముగిసేనాటికి సుమారు 58 వేల దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.మొత్తం 44 సబ్జెక్టులకి సంబంధించి పరీక్షలను నిర్వహించనున్నారు. కామన్ పిజి ఎంట్రన్స్ పరీక్షలను నేటి(ఆగస్టు 4) నుంచి 11 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సబ్జెక్టు వారీ పరీక్షల షెడ్యూల్‌ను ఇప్పటికీ అధికారులు వెల్లడించారు. సిపిజి ఈటీ2025కి సంబంధించిన దరఖాస్తులను జూన్ 18 నుంచి స్వీకరించిన విషయం తెలిసిందే. పిజి కోర్సులైన ఎంఏ, ఎంఎస్సీ, ఎంకామ్, >>2

### ముఖం చాటేస్తున్న
# వాన మబ్బులు!



- మళ్లీ అడుగంటుతున్న నీటి జాడలు
- వాననీటిని ఒడిసిపట్టడంలో విఫలం
- మరమ్మతులు జరగని చెరువులు, కుంటలు

### నాట్లు వేసిన చోట ఎండుతున్న జలవనరులు

**హైదరాబాద్,ఆగస్టు3,ప్రభాతవార్త:** తెలంగాణలో వాననీటిని ఒడిసిపట్టడంలో విఫలమతున్నాం.చెరువులు కుంటలు నీటిని నిలుపుకోని దీనావస్థలో ఉండటం రైతుకుశాపంగా మారింది. భూగర్భజలాలపై ఆధారపడాల్సిన పరిస్థితినెలకొంటున్నది. నైరుతి రుతుపవనకాలంలో సాధారణ వర్షాపాతం 378.మిమికంటే తక్కువ సగటు వర్షాపాతం 343.2మి.మినమోదైనప్పటికి సాగు,తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జూలై మూడోవారం కురిసిన వర్షంతో ఐదుల జిల్లాలో అధికవర్షం నమోదైనా గత ఐదురోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతోమళ్ళీలోటు వర్షాపాతంలోకి పడిపోయింది. ములుగు,కొమురంభీం జిల్లాలోొద్దిగంటల్లోనే 200 ఎంఎం వర్షం కురిసినా ఆ క్యాచ్‌మెంట్ ఏరియాలోని చెరువులు కుంటలు, ఇతర జలాశయాలు వాననీటిని నిలుపుకోని దీనావస్థలో ఉన్నాయి. తెలంగాణ వ్యాప్తంగా చెరువులు కుంటలు మరమ్మతులు చేపట్టాలని రైతులు అధికారులకు విన్నవించినా స్పందన లేదు. గతంలో కట్టలు తెగిన బుంగలు పడినా తూములు దెబ్బతిన్న చెరువులు భారీ వర్షాలు కురిస్తే కట్ట మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. నైరుతి రుతుపవనాకాలం సగటున రాష్ట్రంలో 30 వర్షం రోజులు నమోదైనాయి. తెలంగాణలో 44వేల చెరువులు వుంటే అందులో అనేక చెరువులు నిర్వహణ లేక జలం నిలుపుకోని పరిస్థితిలో ఉన్నాయి. బుంగలుపడి, కట్టతెగినవి, ముళ్ళపొదలు పెరిగి పూడికచేరి,తూములు దెబ్బతిని షట్టర్లు విరిగిపోవడంతో నీరు వృథాగా బయటకు వెళుతోంది. నిర్వహణ >>2


దేవుడి దగ్గరికి వెళ్తున్నానంటూ ఐదో అంతస్తు నుంచి దూకి గృహిణి ఆత్మహత్య 3



కొలిక్కిరాని సాదా బైనామా దరఖాస్తులు క్రమబద్ధీకరిస్తే 20 లక్షల ఎకరాలకు పైగా పట్టాలు 6



గణేష్ చతుర్థి పండుగకు ముందు ముంబైలో శనివారం గణేష్ విగ్రహాన్ని మండపాలకు తీసుకెళ్లే ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

## కామన్ పిజి ఎంట్రన్స్ పరీక్షలు

>> ఎంఈడి, ఎంపిఈడి వంటి పోస్ట్ గ్రాడ్యుయేట్ (పిజి) ప్రోగ్రామ్‌లతోపాటు 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సిపిజిఈటీ పరీక్షను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శాతవాహన విశ్వవిద్యాలయం, తెలంగాణ విశ్వవిద్యాలయం, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం, పాలమూరు విశ్వవిద్యాలయం, వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జెఎన్‌టియుహెచ్)లో ప్రవేశాల కోసం సిపిజిఈటీను నిర్వహించనున్నారు. పరీక్షలను ఆగస్టు 4 నుంచి 11 వరకు ప్రతిరోజూ మూడు సెషన్‌లలో పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలకి సంబంధించిన హాల్ టికెట్లను జులై 31 నుంచే అందుబాటులో ఉంచారు.

## సినిమా షూటింగ్‌లు బంద్

>> చేస్తున్నాయి. వీటిపై జరిగిన సమావేశంలో కార్మికసంఘం ఫెడరేషన్ ప్రతినిధులతో 5 శాతం మాత్రమే పెంచుతామని నిర్మాతలు స్పష్టం చేయడంతో దానిపై అంగీకరించ లేదు. 5 శాతం తమకు సమ్మతం కాదని 30శాతం పెంచినవారికే ఆగస్టు ఫస్ట్ నుంచి షూటింగ్‌కి హాజరవుతామని ఫెడరేషన్ వారు తేల్చి చెప్పేసారు. దాంతో వేతనాలు పెంపు విషయంలో ఫిల్మ్ ఛాంబర్ - తెలుగు ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులు మధ్య చర్చలు విఫలం అయ్యాయి. ఇదే విషయమై మరోసారి కార్మిక సంఘాలు, ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులతో కార్మిక భవన్ లో జరిగిన చర్చల్లో సమస్య కొలిక్కి రాకపోవడంతో షూటింగ్‌లు బంద్‌కు ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయం తీసుకుంది.

## దుమ్మెత్తిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

>> సూర్యాపేటలోని తన కార్యాలయంలో జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. నల్గొండ జిల్లాలో జరిగిన 25 ఏళ్లల్లో జరిగిన ఉద్యమాలకు, గెలుపునకు తాను బాధ్యత అయితే ఓటమికి తాను బాధ్యుడనని.. పార్టీ అంతిమంగా ఫైనల్ అని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. వ్యక్తులుగా ఏదో చేస్తామని అంటే వారి భ్రమ అని ఎద్దేవా చేశారు. కొంతమంది ఏదో చేస్తామని ఊహించుకుంటున్నారని విమర్శించారు. తాను పార్టీకి సైనికుడనని ఉద్ఘాటించారు. తాను కేసీఆర్‌ను ఈ మధ్య కాలంలో 50సార్లు కలిశానని గుర్తుచేశారు. కవిత గురించి మాట్లాడటం వృథా అని విమర్శించారు. కేసీఆర్‌తో బనకచర్ల, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపైనే చర్చించామని క్లారిటీ ఇచ్చారు.
కేసీఆర్ లేకపోతే ఎవరూ లేమని, అందులో ఎలాంటి సందేహం లేదని తేల్చిచెప్పారు. తాను చావు తప్పి కన్నులొట్ట బోయినట్లు ఎమ్మెల్యేగా గెలిచానని.. కానీ కొంతమంది గెలవలేదు కదా అని ప్రశ్నించారు. కవితపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు తన దృష్టికి రాలేదని చెప్పుకొచ్చారు. తాను చూడలేదని, తాను చూసి ఉంటే స్పందించేవాడనని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ తనపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేస్తున్న అనుచిత వ్యాఖ్యల వెనుక బీఆర్ఎస్‌లోని కొందరు ముఖ్య నేతల హస్తం ఉందని సంచలన ఆరోపణలు చేశారు. పార్టీలోని ఒక అగ్రనేత ప్రోద్బలంతోనే నాపై ఇలాంటి వ్యాఖ్యలు చేయిస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ నేతలు ఎవరూ దీనిపై మాట్లాడటం లేదు అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జగదీశ్ రెడ్డిని ఉద్దేశిస్తూ, కేసీఆర్ అనే నీడ లేకపోతే మీరెవరు? నల్గొండ జిల్లాలో పార్టీని నాశనం చేశారు. తర్వాత పార్టీలో చేరిన ఓ చిన్న నేత కూడా నా విశ్వసనీయతను ప్రశ్నించే స్థాయికి వచ్చారు అని మండిపడ్డారు. తనను ఒంటరిని చేసి, పక్కన పెట్టాలని చూస్తున్నారని, అయితే కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతానని, చేసిన వారికి తగిన ఫలితం దక్కుతుందని కవిత అన్నారు. కొద్ది నెలల క్రితం కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ అయిన నాటి నుంచి కవిత అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. కేసీఆర్ ఒక దేవుడు, కానీ ఆయన చుట్టూ రాక్షసులు చేరారుఖిఖి అని ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఇంటి ఆడబిడ్డపై వ్యాఖ్యలు చేస్తే భారత రాష్ట్ర సమితి సోదరులు మాట్లాడలేదని అన్నారు.
తనపై కుట్ర చేస్తోంది బిఆర్ఎస్ పెద్ద నాయకుడు అని పేర్కొన్నారు. మా నాన్న కేసీఆర్‌కు రాసిన లేఖ బయటకు లీక్ చేసింది ఎవరు? ప్రశ్నించారు. భాజపా ఎంపీ సీఎం రమేశ్ ఎందుకు మాట్లాడారో నాకు తెలియదు. ఆయన నాకు తెలుసు కానీ, గత ఆరు నెలల్లో ఎప్పుడూ మాట్లాడలేదు. ప్రభుత్వం, కోర్టు అనుమతి లేకుంటే ఇంటి నుంచే బీసీ రిజర్వేషన్ల కోసం దీక్ష చేస్తా. మ్యాచ్ ఫిక్సింగ్ చేసే వారే.. నా వెనుక ప్రభుత్వం ఉందంటే ఎలా" అని కవిత అన్నారు.

## 42% కోటాపై ఢిల్లీలో పోరు

>> ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,టిపిసిసిఅధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో మంగళవారం మూడు రోజుల పాటు అన్ని అవకాశాలను ఉపయోగించుకోవడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేయబోతున్నారు. తెలంగాణలో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో చేపట్టిన ఉద్యమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేసి దేశం దృష్టిని ఆకర్షించే విధంగా కార్యచరణ రూపొందించారు. తెలంగాణ నుంచి సోమవారం ఉదయం ఒక ప్రత్యేకరైలులో కార్యకర్తలను ఢిల్లీకి పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. పార్లమెంట్‌లో వాయిదా తీర్మానంతో మంగళవారం ఒత్తిడి పెంచనున్నారు. తెలంగాణలో 42 శాతం బి.సి రిజర్వేషన్ల అమలు చేయాలని కాంగ్రెస్ వాయిదా తీర్మానం ఇవ్వడంతో దేశవ్యాప్తంగా "మేం ఎంతో మాకంత" అనే రాహుల్‌గాంధీనినాదం పై కూడా ఒక స్పష్టమైన సంకేతాలు పంపడానికి దోహదపడుతుంది .6న ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ ధర్నా చేపట్టనున్నారు. సామాజిక వెనుకబాటులో ముస్లింలు, హిందులువులు ఉండటంతో పదిశాతం ముస్లింలను బిసిలలో చేర్చారు.32శాతం హిందు బిసిలకు రిజర్వేషన్ కొత్తగా వర్తింపచేయనున్నారు.7న రాష్ట్రపతిని కలిసి వినతి పత్రం సమర్పిస్తారు.
అసెంబ్లీ లో తీర్మానం చేసి పంపిన 42 శాతం బిసి రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి ఆమోదం తెలపాలని కోరనున్నారు. జంతర్ మంతర్ వద్ద బుధవారం చేపట్టే ధర్నా కార్యక్రమంలో తెలంగాణ నుంచి పెద్దఎత్తున తరలివచ్చేందుకు టిపిసిసిఆధ్వర్యంలో ఒక ప్రత్యేక రైల్ ను ఏర్పాటు చేయడం జరిగింది. సోమవారం ఉదయం 9 గంటలకు చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక రైల్ ఢిల్లీకి ప్రయాణం అవుతుంది.అందుకోసం ప్రతి జిల్లా డిసిసి ల నుంచి 25 మంది పేర్లను లిస్ట్ చేసి టిపిసిసి కి సిఫార్సుచేశారు. ఢిల్లీ నుంచి రైల్ తిరిగి గురువారం సాయంత్రం ఢిల్లీ నుంచి తిరుగు ప్రయాణం అవుతుంది.

### ఐసియులో జెఎంఎం నేత
## శిబుసోరెన్
### ఆరోగ్య పరిస్థితి విషమం

**రాంచి,ఆగస్టు 3:** జార్ఖండ్ రాజకీయ కురువృద్ధుడు జార్ఖండ్‌ముక్తిమోర్చా వ్యవస్థాపకులు రాజ్యసభ ఎంపి శిబుసోరెన్ ఆరోగ్యం విషమంగా ఉంది. ఢిల్లీలోని సర్‌గంగారామ్ ఆసుపత్రిలోచేరిన శిబుసోరెన్ ఆరోగ్యంపై జెఎంఎం కూడా ఆందోలన వ్యక్తంచేస్తోంది. వైద్యులు నిరంతరం ఆయన్ను పర్యవేక్షణలో ఉంచారని, ప్రస్తుతం ఐసియులో ఉన్న సొరెన్‌ను పరిమిత వ్యక్తులను మాత్రమే కలిసేందుకు అనుమతి ఉందని చెపుతున్నారు. దిశోంగురుగాపిలుచుకునే తమ నేత సత్వరమే కోలుకుని జార్ఖండ్‌కు రావాలని ప్రజలంతా ప్రార్థిస్తున్నట్లు నాయకులు చెపుతున్నారు. న్యూరాలజీ, కారియాలజీ, నెఫ్రాలజీ నిపుణుల వైద్యబృందం ఆయన్ను పర్యవేక్షిస్తోంది. ఆయనకు బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిందని ఆకారణంగా ఆయన శరీరంలోని ఎడమభాగం పక్షవాతానికి గురయిందని వైద్యులు తెలిపారు. 81 ఏళ్ల శిబుసోరెన్ చాలాకాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నారు. ఏడాదిగా ఆయనకు డయాలసిస్ చేస్తున్నారు. డయాబెటిస్‌కూడా ఉన్న ఆయన గుండెకు బైపాస్ సర్జరీకూడా చేయించుకున్నారు.

## రేపు ఇసి సమావేశానికి బిఆర్‌ఎస్ హాజరు

>> ఉన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఎన్నికల సంస్కరణలు, వివిధ పార్టీలు సమర్పించిన వినతులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) వంటి కీలక అంశాలపై చర్చ జరగనుంది. బీఆర్ఎస్ పార్టీ గతంలో ఇచ్చిన వినతులు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశానికి రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. ముఖ్యంగా బిహార్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్) డ్రైవ్‌పై వివాదం నడుస్తున్న తరుణంలో ఈ భేటీ జరగడం గమనార్హం. ఇదే అంశంపై కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు పార్లమెంటు ఉభయ సభలను స్తంభింపజేస్తూ, చర్చకు పట్టుబడుతున్నాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ వ్యవహారంపై ఆగస్టు 5న బెంగళూరులో నిరసన చేపట్టనున్నారు. ఈ రాజకీయ పరిణామాల మధ్య బీఆర్ఎస్ బృందం ఈసీఐ సమావేశానికి హాజరుకావడం ఆసక్తికరంగా మారింది.

## వారం - వర్జ్యం

తేది : 04-08-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
దశమి ఉ.11.39
అనూరాధ ఉ.9.11
వర్జ్యం మ.3.17-5.01
దు.మ.12.40-1.31, 2)మ.3.14-4.05
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ఓర్పు, నేర్పులతో ముఖ్య వ్యవహారాలు సానుకూలపరచుకునే యత్నాలుచేస్తారు.

**వృషభం :** ఉద్యోగులకు బదిలీల సూచన. వ్యాపారాలలో స్వల్పమార్పులు ఉంటాయి.

**మిథునం:** స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి. నూతనవ్యక్తుల పరిచయమై మాట సహాయం అందిస్తారు.

**కర్కాటకం :** నూతన ప్రయత్నాలు నిదానంగా నెరవేరతాయి. ఆర్థికపరిస్థితి అనుకూలంగా ఉంటుంది.

**సింహం:**విలాసజీవితం సాగిస్తారు. పాతబాకీలు వసూలవుతాయి. ఆస్తివివాదాలు తీరి లబ్ధిఎందుతారు.

**కన్య :** ఇంటర్వ్యూలకు హాజరవుతారు. వివాహ, ఉద్యోగ యత్నాలు సాగిస్తారు. వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి

**తుల :** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి యోగదాయకంగా ఉంటుంది. కోపతాపాలకు దూరంగా ఉండండి.

**వృశ్చికం:**ఆర్థికపరమైన లావాదేవీలలో ఆటుపోట్లు తొలుగుతాయి. ఆరోగ్యపరమైన సమస్యలు తొలుగుతాయి.

**ధనుస్సు:** శత్రువులు సైతం మిత్రులుగా మారుతారు. గృహం, స్థలాలు కొనుగోలు చయ్యాలు సాగిస్తారు.

**మకరం:** కోర్టుకేసులు పరిష్కారదశకు చేరుకుంటాయి. కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కుంభం:** విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధిచెందుతాయి.

**మీనం :** భాగస్వామ్యవ్యాపారాలు అభివృద్ధిచెందుతాయి. అనుకోని అవకాశాలు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ముఖం చాటేస్తున్న వాన మబ్బులు!

>> కొరవడటంతో పంటల సాగుకు నీరందించడం ప్రశ్నార్థకంగా మారింది.వాగుల్లో ఎక్కడికక్కడ చెక్‌డ్యామ్ కట్టి నీటిని నిలుపుకోవాలనే ఆలోచన ప్రభుత్వంలో లేకపోవడం కూడా వర్షాదారంపై బ్రతుకులీడ్చాల్సిన పరిస్థితి నెలకొంది. నిజామాబాద్ జిల్లాలో 25 వర్షపురోజులు ఈ నైరుతి రుతుపవనకాలంలో నమోదైనాయి. అయినా వరుగా ఐదు రోజులు వర్షం కురవకపోవడంతో 25శాతం లోటు వర్షాపాతం ఎదుర్కొంటున్నది. జూలై మూడో వారంలో కురిసిన వర్షంతో జిల్లాలో మొత్తం 1,086 చెరువులకు గాను ప్రస్తుతం 34 పూర్తిగా నిండాయి.75శాతం చెరువుల్లో సగానికి పైగా నీరు వచ్చిచేరింది. బోధన్, బాల్కొండ, బాన్సువాడ, ఆర్మూర్ నియోజకవర్గాల్లో వర్షాలు కాస్త పర్వాలేదు. నిజామాబాద్ గ్రామీణం నియోజకవర్గంలోని వాగుల్లో పెద్దగా ప్రవాహం చేరలేదు. నాట్లు వేసిన చోట చెరువులు ఇంకా నిండకపోవడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన తప్పడం లేదు. రెండు రోజులుగా కురిసిన వర్షాలతో బోధన్ నియోజకవర్గంలో 5, ఆర్మూర్ 4. బాన్సువాడలో 6 చెరువులు అలుగులు పోస్తున్నాయి. నాలుగు రోజులుగా వర్షం ముఖం చాటేయడంతో మళ్ళీ అవి ఇప్పుడు జలకళ తప్పి యథాస్థితికి చేరుకొన్నాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం గొడిగార్పల్లి పెద్దవాగు(చెరువు) కింద 1100 ఎకరాల ఆయకట్టు ఉంది. తూములు దెబ్బతినడం,షట్టర్లు విరిగిపోవడంతో మొన్నటి వర్షాలకు నీరు వచ్చినా అదినిలుపుకొనే వ్యవస్థలు లేక వృథాగా బయటకు వెళ్ళిపోయింది. నిర్వహణ కొరవడటంతో పంటల సాగుకు నీరందించడం ప్రశ్నార్థకంగా మారింది. అదే జిల్లాలో గుమ్మడిదల, కల్హేర్, హత్నూర, మనూరులలో వారం రోజులుగా జిల్లాలో ముసురు వానలు కురిసినా చెరువులు, కుంటల్లోకి నీరు చేరినా కట్టలు తూములు గత కొద్ది సంవత్సరాలుగా దెబ్బతిన్న వాటికి మరమ్మతులు చేపట్టడానికి అధికారులు తాత్సారం చేయడంతో కొత్తగా చేరిన నీరు నిలువలేదని అన్నదాతలు ఆవేన వ్యక్తంచేశారు.సంగారెడ్డి జిల్లాలో 1769 జల వనరులు ఉన్నాయి వాటినిర్వహణ సరిగా లేదు. గతేడాది నుంచి ఈ నెల 17 వరకు 114 చెరువులు, కుంటల మరమ్మతులకు ప్రభుత్వం రూ.16.75 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులకు ఇప్పటికీ టెండర్ల ప్రక్రియ పూర్తిచేయలేదు. నీటిపారుదల శాఖలో కీలకమైన ఎస్ఈ పోస్టు ఖాళీగా ఉండటం పనులపై ప్రభావం చూపుతోంది.గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధి ఎర్రచెరువు కట్ట ఇది. రెండేళ్ల క్రితం కోతకు గురయింది.మనూరు మండలంలోని కమలాపూర్ చెరువు కట్ట బలోపేతం, కాల్వల్లో పూడికతీత, సుందరీకరణకు 2015లో రూ.3.58 కోట్లు మంజూరయ్యాయి. పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. చెరువులో నీరున్నాఆయకట్టుకు చేరని పరిస్థితి నెలకొంది.హత్నూర మండలం దౌలాపూర్ పెద్ద చెరువు తూము వద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. రైతులు అధికారులకు విన్నవించినా మరమ్మతులు కరవయ్యాయి. ప్రస్తుతం చెరువులోకి కొత్తనీరు చేరుతోంది. ఈ మండలంలోని ఇనాం కుంటదీ ఇదే పరిస్థితి. జిల్లాలోని చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. చెరువులు మాత్రమే కాదు వాగుల్లో నీటిని నిలుపుకొనేందుకు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం కూడా నిర్లక్ష్యంగా మారింది.సాగు, తాగునీటి సమస్యలు ఉత్పన్నం కావొద్దని వాగులు,గోదావరి,కృష్ణా ఉపనదులు వృథాగా పోతున్న నీటిని ఒడిసి పట్టుకోవడమే లక్ష్యంగా చెక్ డ్యాంలను నిర్మించడానికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయి. ఆదిలాబాద్,నిర్మల్, నిజామాబాద్,కామారెడ్డి, కరీంనగర్,పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, భూపాలపల్లి,ములుగు వరంగల్,హనుమకొండ కొమురంభీమ్ మంచిర్యాల జిల్లాలో చెక్ డ్యాంలకు ఐదేళ్ల కిందట నిధులు విడుదలయ్యాయి. అధికారుల ఉదాసీనత కాంట్రాక్టర్ల నిరక్ష్యంతో నాలుగేళ్లుగా పనులు సాగుతూనే ఉన్నాయి. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ఆరు చెక్ డ్యాంలకు ఐదేళ్ల కిందట నిధులు విడుదలయ్యాయి బాన్సువాడ, బీర్కూరు. కోటగిరి మండలంలో సుంకిని, కొడిచర్ల, బిచ్కుంద మండలంలో పుల్కల్, గుండెనెమ్లి శివారుల్లో చెక్ డ్యాంల నిర్మాణాలకు అనుమతులు వచ్చాయి. బాన్సువాడ శివారులో రెండేళ్ల కిందటే చెక్ డ్యాం పూర్తికావడంతో జలకళ సంతరించుకుంది. మిగతా చోట్ల పనులు ఇంకా పూర్తికాలేదు. నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయో అన్నీ కర్షకులు ఎదురుచూస్తున్నారు. బాన్సువాడ శివారులోని మంజీరలో నిర్మించాలనుకున్న చెక్ డ్యాంనకు రూ.15.98 కోట్లు మంజూరయ్యాయి. పనులూ పూర్తికావడంతో ప్రస్తుతం చెక్ డ్యాం పరిసరాల్లో జలకళ సంతరించుకుంది. వేసవిలో తాగు, సాగునీటి సమస్య రాకుండా ఉపయోగపడింది.బిచ్కుంద మండలంలోని గుండెనెమ్లి శివారులో నిర్మాణానికి రూ.21.81 కోట్లు మంజూరు కాగా.. సుమారు 90శాతం పనులు, పుల్కల్ చెక్ డ్యాంకు రూ.22కోట్లు మంజూరుకాగా 80శాతం పనులు పూర్తయ్యాయి.బీర్కూరు శివారులోని మంజీరలో చెక్ డ్యాం నిర్మాణానికి రూ.28.29 కోట్లు మంజూరు కాగా ఇప్పటి వరకు దాదాపుగా 80శాతం పనులు పూర్తయ్యాయి.కోటగిరి మండలంలోని సుంకిని, కొడిచర్లలో సైతం నిర్మాణాలకు అనుమతులు వచ్చాయి.
రెండో విడతలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కొడిచర్లకు రూ.75కోట్లు, సుంకినికి రూ.24కోట్లు మంజూరయ్యాయి. అధికారులు కొంత ఆలస్యంగా ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో రెండో విడతలోకి వెళ్లాయి. నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. ప్రభుత్వం మారడంతో పనులు ముందుకు సాగుతాయా లేదా అని అధికారులకే అయోమయంగా మారింది.

## కెసిఆర్, హారీష్, ఈటలపై క్రిమినల్ చర్యలు!

>> జరిగినట్లు కమిషన్ గుర్తించింది. ఇరిగేషన్ శాఖ పంపిన నివేదికలను పరిశీలించకుండానే ఆర్థిక శాఖ గుడ్డిగా ఆమోదం తెలిపిందని కమిషన్ పేర్కొంది. నీటిపారుదల శాఖ, ఆర్థికశాఖలో భారీగా లోపాలు ఉన్నట్లు కూడా గుర్తించింది. పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ బ్రీఫ్ రిపోర్ట్‌ను రాష్ట్ర కేబినెట్‌కు ఇవ్వనుంది. కేబినెట్‌లో చర్చించిన అనంతరం నివేదికను తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలను నిర్మించారు.అయితే 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లర్లు కుంగాయి. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటైంది. అనంతరం ఈ ప్రాజెక్ట్‌లో చోటు చేసుకున్న అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాదాపు 15 నెలలపాటు ఈ కమిషన్ విచారణ జరిపింది. చివరకు జులై 31వ తేదీన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. తన నివేదికను నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందజేసింది. ఆగస్టు 1వ తేదీన పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు ఈ నివేదికను సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. ఈ నివేదికపై ముగ్గురు అధికారులతో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ఈ కమిటీ ఈరోజు సమావేశమైంది. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా సోమవారం కేబినెట్ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది.
సుమారు 650 పేజీల నివేదికను పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలను ప్రస్తావించినట్లు సమాచారం. ఈ నివేదిక ఆధారంగా దోషులుగా తేలిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలా లేదా అనే దానిపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరగనుంది. అలాగే, తప్పు చేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కూడా ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.కేబినెట్‌లో పీసీ ఘోష్ నివేదికపై చర్చించిన అనంతరం అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి నివేదికలోని సిఫార్సులు,ప్రభుత్వం తీసుకునే చర్యలను చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది.గతంలో జరిగిన అసెంబ్లీ సమావేశాలు ముగిసి సెప్టెంబర్ 22 నాటికి ఆరు నెలలు పూర్తి కానున్నందున ఈ ఆరు నెలలలోగా సమావేశాలు నిర్వహించాలనే నిబంధన మేరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ఛలో ఢిల్లీ కార్యక్రమం 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఉన్నందున 11వ తేదీ తర్వాత అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది.



ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద గంగా నదికి భారీ వరద రావడంతో ఆదివారం రాజాపూర్ ప్రాంతంలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు పడవల్లో తరలిస్తున్న దృశ్యం

# వాటానీరు చుక్క వదలం

>> టీఎంసీల నీరు శ్రీశైలం ప్రాజెక్ట్ పై భాగం నుండి రాయలసీమకు లిఫ్ట్ చేసేలా వ్యవస్థను ఆంధ్రప్రదేశ్ తీసుకునేలా చేస్తుందని, ఈ దోపిడి ఇలాగే కొనసాగితే 30 రోజులలో శ్రీశైలం ఖాళీ అవుతుందని అన్నారు. గోదావరి నదిపై ఎస్సారెస్పీ, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల ప్రాజెక్టులను నిర్మించామని ఖమ్మం జిల్లాలో రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ ప్రాజెక్టుల పనులు చేపట్టామని అన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు క్రింద తుమ్మిడి హట్టి నుంచి ఎల్లంపల్లి నీళ్ళు తెచ్చేలా ప్రాజెక్టు డిజైన్ చేస్తే గత పాలకులు వాటిని నిరక్ష్యం చేశారని, కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఒక చుక్క నీళ్ళు ఇవ్వలేదని అన్నారు. గత బీఆర్ఎస్ హయంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తే నీళ్ళు క్రిందికి వెళ్ళేవి కాదని అన్నారు. రాజకీయ విమర్శలకు తావు లేకుండా బనకచర్ల ప్రాజెక్టును అందరం వ్యతిరేకించాలని అన్నారు. సముద్రంలో పోతున్నాయని ప్రాజెక్టు కట్టుకుంటే తర్వాత నీటి పంపిణి సమయంలో నీటి కేటాయింపులు లభిస్తాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని దశలలో బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకిస్తుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి బయటకు రాకుండా ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని అన్నారు. ప్రజల నీటి హక్కులు కాపాడే బాధ్యత పాలకులపై ఉందని, తెలంగాణ ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి సమర్థవంతంగా వాదనలు వినిపించడం వల్లే బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేక్ పడింది అని చెప్పారు.ఆంధ్రప్రదేశ్ నాయకులు, మంత్రి లోకేష్ తెలివిగా మాట్లాడుతున్నారని, మా ప్రాజెక్టులను పూర్తి చేసిన తర్వాత వరద నీటిలో తెలంగాణ నీటి నిల్వ అవసరాలు తీర్చిన తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ప్రాజెక్టుల నిర్మాణంలో ముందుకు వెళ్లాలని డిప్యూటీ సీఎం హితవు పలికారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఖమ్మం జిల్లాలో 7 మండలాలు లేకుండా విభజన చట్టం జరిగిందని, ఆర్డినెన్స్ ద్వారా 7 మండలాలను ఏ.పి. లో కలుపుతుంటే స్పందించలేదని అన్నారు.
చుక్క నీటి వాటాను కూడా తెలంగాణ రాష్ట్రం వదులుకోవడానికి సిద్ధంగా లేదని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. రాష్ట్రంలో 95 లక్షల పేద కుటుంబాలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, వీరికి పది లక్షల రూపాయల పరిమితి గల ఆరోగ్యశ్రీ కార్డు కూడా అందుబాటులోకి వచ్చిందని అన్నారు. 51 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అన్నారు. ముదిగొండ మండలంలో 84 శాతం ఇండ్లకు గృహ జ్యోతి పథకం అమలు అవుతుందని అన్నారు.మానవీయ కోణంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, 22 వేల 500 కోట్ల రూపాయలు ఖర్చు చేసి 4.5 లక్షల ఇండ్లు మంజూరు చేశామని, ప్రతి వారం ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు చెల్లిస్తున్నామని అన్నారు. ఎస్సి ఎస్టి, మైనారిటీ వర్గాల పిల్లలు ఒకే చోట చదువుకునేలా 104 యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణం చేస్తున్నామని అన్నారు. మహిళా సంఘాలకు 21 వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు అందించామని, 5 సంవత్సరాల్లో లక్ష కోట్ల రుణాలు మహిళలకు అందిస్తామని అన్నారు. కమలాపురం గ్రామంలో చేపట్టిన గోదాముల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశాల జారీ చేశారు.



ఆదివారం సిఎం రేవంత్‌తో భేటీ అయిన చిరంజీవి

## సిఎం రేవంత్‌తో చిరంజీవి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు3:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని మాజీ కేంద్ర మంత్రి, మెగాస్టార్ చిరంజీవి కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసానికి వెళ్లి ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన నివాసానికి వచ్చేసిన చిరంజీవిని సిఎం రేవంత్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. దీనికి సంబంధించిన వీడియోను సిఎంవో ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. ఇరువురూ కొంతసేపు వివిధ అంశాలపై చర్చించారు. రాజకీయ అంశాలపై కూడా చర్చించారని సమాచారం. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిస్థితులపై సిఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావన చేసినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

# లక్షకోట్లు లూటీ!

>> అత్యధికంగా జరిగినట్లు ఆర్‌బిఐ పేర్కొంది. సైబర్ నేరగాళ్లు ఫిషింగ్ ఈ మెయిల్స్, క్లోన్ వెబ్‌సైట్‌లను రూపొందించడానికి డీప్‌ఫేక్ ఆధారిత స్కాంలను సృష్టించడానికి ఎఐని వాడుతున్నారని సైబర్ నిపుణులు వెల్లడించిన విషయాన్ని ఆర్‌బిఐ ఉదహరించింది. మెజారిటీ సైబర్ నేరాలు ఈ తరహాలోనే జరిగినట్లు తేలిందని ఆర్‌బిఐ పేర్కొంది. డిజిటల్ చెల్లింపులు సైబర్ నేరగాళ్లకు బాగా కలిసి వస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలిన విషయాన్ని కూడా ఆర్‌బిఐ వెల్లడించింది. దీంతో పాటు టెలిగ్రాం, మెసేజింగ్ ప్లాట్‌ఫాంలలో ఆర్థిక వివరాలను షేర్ చేయడం నేరగాళ్లకు మరింతగా కలి సి వస్తుందని ఆర్‌బిఐ పేర్కొంది. ఆర్థిక సంబంధిత సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు వాట్సాప్ కారణమని పోలీసుల నివేదికలు చెబుతు న్నాయని, బ్యాంకు సంబంధిత మోసాలు ఇటీవల కాలంలో మరింత పెరిగినట్లు పోలీసు నివేదికలు చెబుతున్నాని ఆర్‌బిఐ వెల్లడించింది. బ్యాంకుల నుంచి భారతీయుల ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లు 21 వేల 367 కోట్ల రూపాయలను కొల్లగొట్టారని ఆర్‌బిఐ వెల్లడించింది. బ్యాంకుల్లో జరిగిన నేరాల్లో 60 శాతం ప్రైవేటు బ్యాంకుల్లోనే జరిగినట్లు ఆర్‌బిఐ తెలిపింది. సైబర్ నేరగాళ్లు ఫిషింగ్‌తో పాటు స్మిషింగ్ పద్ధతుల ద్వారా నేరాలు చేస్తు న్నారని, దీంతో పాటు సిం స్వాప్ నేరాలు కూడా ఇటీవల కాలంలో పెరిగాయని, సెల్‌ఫోన్లకు ఓటిపిలు పంపి నేరాలకు పాల్పడడం ఇటీవల బాగా పెరిగిందని ఆర్‌బిఐ పేర్కొంది. అయితే బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడం వల్ల గత ఏడాది ఐదు వేల 489 కోట్ల రూపాయలను పోలీసులు ఆయా బ్యాంకుల్లో జప్తు చేయడం ఊరట కలిగించే అంశంగా ఆర్‌బిఐ వెల్లడించింది. ఈ నేపథ్యంలో అన్ని బ్యాంకులు మరింత అప్రమత్తంగా వుండాలని ఆర్‌బిఐ హెచ్చరించింది.

## భారత్‌కు భారీగా పెరిగిన అమెరికా ముడిచమురు దిగుమతులు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** అమెరికా నుంచి భారత్‌కు ముడిచమురు దిగుమతులు గణనీయంగా పెరిగాయి. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక అగ్రరాజ్యంతో ముడిచమురు ఒప్పందాలు భారీగా పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలు చెపుతున్నాయి. 2024తో పోలిస్తే ఈ ఏడాదిలో ముడిచమురు దిగుమతులు 51శాతం పెరిగినట్లు తేలింది. 2024తో పోలిస్తే ఈ ఏడాది జనవరి-జూన్‌లో అమెరికా నుంచి ముడిచమురు దిగుమతి 51 శాతం పెరిగింది. అంటే 2024లో రోజుకు 0.18 మిలియన్ బ్యారెల్స్ కాగా, 2025లో 0.271 మిలియన్ బ్యారెల్స్‌కు పెరిగింది. ఇటీవల నెలల్లో ఈ పెరుగుదల స్పష్టంగా కనిపిస్తుంది. 2025 ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 114 శాతం అధికంగా దిగుమతులు నమోదయ్యాయి. అమెరికా నుంచి ముడి చమురు దిగుమతుల విలువ 1.73 బిలియన్ డాలర్ల నుంచి 3.7 బిలియన్ డాలర్లకు చేరింది. అంటే రెట్టింపు పెరుగుదల కనిపిస్తోందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

## దేవుడి దగ్గరికి వెళ్తున్నానంటూ.. ఐదో అంతస్తు నుంచి దూకి గృహిణి ఆత్మహత్య

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** మూఢనమ్మకంతో ఓ గృహిణి అయిదో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్‌నగర్ ఉర్దూహాల్ ఎదురుగా ఉన్న అపార్టుమెంట్ అయిదో అంతస్తులో నివసించే వ్యాపారి అరుణ్‌కుమార్ జైన్‌కి 2002లో పూజాజైన్ (43)తో వివాహమైంది. వీరికి ఒక అమ్మాయి. అబ్బాయి ఉన్నారు. గత అయిదేళ్లుగా పూజా మానసిక సమస్యతో చికిత్స పొందుతోంది. ఇటీవల ఆమె ఆధ్యాత్మికత వైపు అడుగులు వేశారు. శనివారం ఉదయం భర్త కార్యాలయానికి వెళ్లిపోయారు. కొడుకు, కూతురు, పని మనిషి ఇంట్లో ఉన్నారు. మధ్యాహ్నం వరకు ఒంటరిగానే కూర్చున్న పూజాజైన్ ఒక్కసారిగా అయిదో అంతస్తుపై నుంచి దూకేశారు. తీవ్ర గాయాలతో ఉన్న పూజాను హైదర్‌గూడలోని ఒక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె చనిపోయిందని వైద్యులు తెలిపారు. ఆత్మహత్యకు ముందు పూజ కూర్చున్న గదిలో ఉత్తరం కనిపించింది. అందులో 'అనునిత్యం దైవధ్యానంలో ఉంటూ.. ఆత్మార్పణ చేసుకుంటే దేవుడికి దగ్గరవు తాం.. స్వర్గం ప్రాప్తిస్తుంది' అనే అర్థం వచ్చేలా జైన గురువుల సూక్తి రాసుకుందని ఎస్సై నాగరాజు తెలిపారు.



పూజ (ఫైల్)

## 7 నెలల్లో 227 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు

### టిజిసిఎస్‌బి మరో ఘనత..

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) మరో ఘనతను అందుకుంది. ఈ యేడాది జనవరి నెల నుంచి జూలై నెలాఖరు వరకు 228 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసింది. ఇందులో 27 మంది మహిళలు కూడా ఉన్నారు. దీనికి సంబంధిం చిన వివరాలను టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతున్న టిజిసి ఎస్‌బి ఈ క్రమంలో సైబర్ నేరగాళ్ల భరతం పట్టేందుకు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో స్పెషల్ ఆపరేషన్లు చేబడుతున్న సంగతి తెలిసిందే. ఈ ఆ పరేషన్ల నేపథ్యంలో రాష్ట్రంలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న నేరగాళ్ల ఎపి, గుజరాత్, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్. పశ్చిమ బెంగాల్, ఝార్కండ్‌తో పాటు తెలంగాణకు చెందిన వారిని పట్టుకున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది బట్టబయలైన ముఖ్యమైన సైబర్ నేరాలలో హైటెక్ సిటీలో వెలుగు చూసిన ఫేక్ కాల్ సెంటర్ ఒకటి. అమెరికా సహా అనేక విదేశాలకు చెందిన వారిని సైబర్ నేరాలతో మోసం చేసి కోట్లాది రూపాయలను కాజేసిన ఈ ముఠాలో 20 మందిని పట్టుకున్నారు. ఈ కాల్ సెంటర్‌పై తెలంగాణ 60 కేసులు, విదేశాలలో 515 కేసులున్నాయి. దీంతో పా టు బాలలపై జరుగుతున్న ఆన్‌లైన్ లైంగిక వేధింపులు కూడా ముఖ్యమైనది. దీనికి సంబంధిం,ఇ 57 కేసులు నమోదయ్యాయి. సైబర్ నేరాలకు స ంబంధించి పట్టుబడ్డ వారిపై దేశ వ్యాప్తంగా 1313 కేసులు, తెలంగాణలో 189 కేసులున్నాయి. ఈ నేరగాళ్లు 92 కోట్ల రూపాయలను కొల్లగొట్టా రు. అరెస్టయిన నేరగాళ్లలో తెలంగాణకు చెందిన వారు 93 వుండగా నాగాలండ్‌కు చెందిన వారు 42, గుజరాత్ నుంచి 20, ఎపి నుంచి 17, ప శ్చిమ బెంగాల్ నుంచి ఆరుగురు, యుపి నుంచి ఆరుగురు, మణిపూర్, అస్సాం, మహారాష్ట్ర, ఒడిషాల నుంచి ఐదేసి నేరగాళ్లు, కర్నాటక, బిహార్‌ల నుంచి ముగ్గురు చొప్పున, మేఘాలయ నుంచి ఇద్దరు, త మిళనాడు, హరియాణ, ఝార్కండ్, మధ్యప్రదేశ్‌ల నుంచి ఒక్కొక్కరు వున్నారు. మొత్తం నేరగాళ్లలో 67 మంది ఫేక్ కాల్ సెంటర్లకు సంబంధించిన వారు, 77 మంది ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసులో వున్న వారు, 15 మంది సిఎస్‌ఈఎం, 18 మంది సైబర్ స్లావరే మాడ్యూల్స్, 13 మంది ఆన్‌లైన్ ట్రేడింగ్ ఫ్రాడ్స్ కేసులకు సంబంధించిన వారు. సైబర్ నేరాలపై ప్రజలు నిరంతరం అప్ర మత్తంగా వుండాలని ఎక్కడైనా మోసం జరిగితే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయాల్ కోరారు.

## ఆన్‌లైన్‌లో గుర్రపు పందేల బెట్టింగ్

### రూ.8.34 కోట్లు కాజేసిన ముఠా సభ్యులు

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఆన్‌లైన్‌లో గుర్రపు పందేల బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. తోకల నగేష్, వెంకయ్య చౌదరి, చల్లా రమేష్‌బాబు, సునీల్‌లు ఒక ముఠాగా ఏర్పడి ఆన్‌లైన్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఫైన్‌వెల్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో 105 మందితో వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసిన నిందితులు ఇప్పటివరకు పలువురి నుంచి దాదాపు రూ. 8.34 కోట్లు కాజేసినట్లు పోలీసులు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు జవహర్‌నగర్ పోలీసులు దమ్మాయిగూడలో సోదాలు నిర్వహించి నిందితులను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2 లక్షల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ముఠా సభ్యుల వెనక ఉన్న చైన్ లింక్‌ను త్వరలోనే చేధిస్తామని పోలీసులు తెలిపారు.

## అర్చకులు, పురోహితులు అనుమతి లేకుండా ఇతర కార్యక్రమాల్లో పాల్గొనకూడదు

### ఆదేశాలు జారీ చేసిన దేవాదాయ శాఖ

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ప్రభుత్వ అనుమతి లేకుండా దేశ, విదేశాలు, అంతర్ రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలో దేవాదాయ శాఖ పురోహితులు, అర్చకులు,వేద పండితులు పాల్గొన కూడదని ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇక నుంచి ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే ప్రత్యేక పూజలు, హోమాలు,శుభ కార్యాలలో దేవాదాయ శాఖకు చెందిన పురోహితులు, అర్చకులు, వేద పండితులు దూరంగా ఉండాలని సూచనలు చేసింది. స్వామి వారి పేరు ప్రతిష్టలు విశ్వవ్యాపం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం, అధికారిక కార్యక్రమాల్లో మాత్రమే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాలొనాలని రాష్ట్రదేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మొదటి వారం వరకు దరఖాస్తు గడువు

### రాష్ట్రంలో 48 లక్షల మంది అర్హులు

# కొత్త రైతులకు బీమా అవకాశం

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు బీమా పథకాన్ని అమలు చేస్తోంది. అయితే, గతేడాదికి (2024-25) బీమా గడువు ఈనెల 13వ తేదీతో ముగియనుంది. దీంతో 2025-26 సంవత్సరానికి సంబంధించిన బీమా ఈ నెల 14 నుంచి ప్రారంభమవుతుంది. అర్హులైన రైతులు కొత్తగా రైతు బీమా దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల మొదటి వారం వరకూ అవకాశం కల్పించారు. దీంతో ఈ యేడాది రైతు బీమా కోసం ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి అగ్రికల్చర్ అధికారులకు దరఖాస్తు చేసుకోగా, వారిలో అర్హులను ఈనెల 9వ తదీ వరకు గుర్తించి రైతు బీమా పోర్టల్ లో అధికారులు అప్లోడ్ చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తంగా 76 లక్షల మందికి పైగా పట్టాదారు పాస్ బుక్ ఉన్న రైతులు ఉండగా, వారిలో 18ఏండ్ల నుంచి 59 యేళ్ల మధ్య వయస్సు ఉన్న వారు బీమా పథకానికి అర్హులు.

అయితే, గతేడాది రైతు బీమా కలిగిన రైతుల రెన్యూవల్స్ కు సంబంధించి అధికారులు డేటాను పరిశీలించనున్నారు. నిరుడు రైతు బీమా అమలైన వారిలోనూ 60ఏండ్లు నిండిన వారిని తొలగించి మిగతా అర్హులైన రైతులకు బీమా రెన్యూవల్ చేయాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. వీరి పూర్తి వివరాలను ఏఈవోలు రైతు బీమా పోర్టల్లో రెన్యూవల్ అప్‌లోడ్ ప్రక్రియను పూర్తి చేస్తారు.

రాష్ట్రంలో గతంలో ఉన్న పట్టాదారుల్లో అర్హత ఉన్నా ఏడు లక్షలకుపైగా రైతులు బీమాకు దరఖాస్తు చేసుకోలేదు. వారికిసైతం ఈసారి కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి వ్యవసాయశాఖ అనుమతించనుంది. ఇదిలాఉంటే, గత జూన్ నెలాఖరు వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన రైతుల్లో బీమాకు అర్హులను ఏవోలు, వ్యవసాయశాఖ అధికారులు గుర్తించే ప్రక్రియ చేపట్టారు. క్షేత్ర స్థాయి వ్యవసాయశాఖ అధికారులు, ఏఈవోలు, ఏఓ స్థాయి, జిల్లా స్థాయిలో అధికారులు అప్లికేషన్లను పరిశీలించి అందులో అర్హులను గుర్తిస్తారు. రైతు బీమాకు సంబంధించి పాత రెన్యూవల్స్‌తో పాటు, కొత్తగా అర్హులైన వారివి కలిపి ఈ సంవత్సరం మొత్తం 48లక్షల మందికిపైగా రైతులకు బీమా చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇదిలాఉంటే.. గత ఏడాది ఒక్కో రైతుకు బీమా ప్రీమియం రూ.3,600 వరకు ప్రభుత్వం ఎల్ఐసీకి చెల్లించింది. ఈ సంవత్సరం ఎంత ప్రీమియం అనేది త్వరలో తేల్చనున్నారు.

# ఇతర దేశాల ఒత్తిడికి లొంగని ప్రభుత్వం

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఆగస్టు 3, ప్రభాతవార్త:** భారతదేశ ప్రభుత్వం ఎప్పటికీ మన దేశ పౌరుల కోసమే పనిచేస్తుందని, ఇతర దేశాల ఒత్తిడికి తలొగ్గదని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. ఎవరి పని వాళ్ల చేస్తే అదే దేశభక్తి అవుతుందని తెలిపారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో ఆదివారం 'సెల్యూటింగ్ అవర్ హీరోస్ – ఆపరే షన్ సిందూ ర్' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఆపరే షన్ సింధూర్‌లో భారత సైనికుల ధైర్యా నికి, దేశభక్తికి గుర్తుగా అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహా సంఘ్ (ఎబిఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, డిఆర్‌డిఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడిలో అమరులైన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లా డుతూ కులాన్ని, మతాన్ని, వర్గాన్ని ఉప యోగించి కొన్ని సంస్థలు దేశంలో గొడవలు స ృష్టిం చేందుకు ప్రయత్ని స్తున్నా యని అన్నారు. భారత దేశానికి ఈ దుష్టశక్తులపై పోరాడే సామర్థ్యం ఉందని, నీరు, నింగి, నేల ప్రతిదానికి శక్తి ఉందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్, మహాదేవ్ అపరేషన్లలో పాల్గొన్న సైనికులకు శుభాకాంక్షలు తెలిపారు. కేవలం మూడు దేశాలు మినహా ప్రపంచ దేశాలు మొత్తం భారత్‌కు మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. భారత దేశం కేవలం ఆత్మరక్షణ కోసం మాత్రమే దాడులు చేస్తుందన్నారు.డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ అపరేషన్ సింధూర్‌తో భారత సాంకేతిక పైపుణ్యం ప్రపంచానికి తెలిసిం దన్నారు. భారతదేశంలో అభివ ృద్ధి చేసిన డ్రోన్లు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, అడ్వాన్సుడ్ ఎయిర్ డిఫెన్స్ టెక్నాలజీలు అపరేషన్ సందూర్‌లో అద్భుతంగా పని చేశాయని అన్నారు. భారత సైన్యంలోని మూడు విభాగాలు ఆర్మీ, నేవి, ఎయిర్ ఫోర్సు లు సమన్వయంతో పనిచేశాయని పేర్కొన్నారు. ఎబిఆర్ఎస్ఎం జాతీయ సంయుక్త నిర్వాహక కార్యదర్శి గుంట లక్ష్మణ్ మాట్లాడుతూ తమ సంస్థ త్యాగ భావనను విద్యారంగంతో ముడిపెట్టి పనిచేస్తుందన్నారు.




కార్యక్రమంలో సైనిక అధికారులను సన్మానిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులు

## 'సృష్టి' కేసులో మరొకరి అరెస్ట్

### ఇప్పటివరకు 12కు పెరిగిన నిందితుల సంఖ్య

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** అక్రమ సరోగసీ, నవజాత శిశువుల విక్రయాలపై నమోదైన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో పోలీసులు మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. డాక్టర్ నమ్రతకు ఏజెంట్‌గా వ్యవహరించిన కృష్ణ అనే వ్యక్తిని ఆదివారం గోపాలపురం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ అరెస్ట్‌తో ఇప్పటి వరకు అరెస్టైన నిందితుల సంఖ్య 12కు చేరింది. శనివారం ఏజెంట్లు హర్షరాయ్, సంజయ్, రిసెప్షనిస్ట్ నందినిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కాగా, నవజాత శిశువుల విక్రయాల్లో ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతకు ఏజెంట్లుగా హర్షరాయ్, సంజయ్, కృష్ణ తదితరులు వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే పిల్లలను కొనుగోలు చేసేందుకు సహాయపడిన ఏజెంట్ల కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలుస్తోంది. అనైతిక సరోగసీ, మరోవైపు సరోగసీ పేరుతో శిశువుల అక్రమ రవాణాకు పాల్పడిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. అరెస్ట్ అయిన వారి నుంచి పోలీసులు కీలక విషయాలను రాబట్టే పనిలో ఉన్నట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా మరో నాలుగు రాష్ట్రాల్లో డాక్టర్ నమ్రతకు భారీ నెట్‌వర్క్ ఉన్నట్లు పోలీసులు గుర్తించిన విషయం విధితమే. డాక్టర్ నమ్రతను శుక్రవారం కస్టడీలోకి తీసుకున్న పోలీసులు ఆమె సృష్టించిన అక్రమాలపై కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది.



## ఆర్జేడి చీఫ్ తేజస్వికి ఎన్నికల కమిషన్ నోటీస్

**పాట్నా, ఆగస్టు 3:** బీహార్ ఎన్నికల జాబితా నుంచి తన పేరు తొలగించారంటూ ప్రకటించిన ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌కు ఎన్నికల కమిషన్ ఆదివారం నోటీసు జారీ చేసింది. తేజస్వి తన వాదనను నిరూపించుకోవాలని ఆ నోటీసులో కోరింది. శనివారం నాడు మీడియా సమావేశంలో ఆర్జేడీ నేత చూపించిన ఓటర్ ఐడీ అధికారికంగా జారీ చేసినది కాదని తెలిపింది. ఓటరు లిస్ట్‌లో తన పేరు చేర్చలేదని యాదవ్ చేసిన ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. నిజానికి ఆయన పేరు సీరియల్ నెంబర్ 416లో పోలింగ్ స్టేషన్ 204లో ఉందని తెలిపింది. పోలింగ్ బూత్ పాట్నాలోని బిహార్ యానిమల్ సైన్సెస్ యూనివర్శిటీ లైబ్రరీలో ఉందని, వోటర్ ఐడి నెంబరు ఆర్ఎబి0456228 అని పేర్కొంది. కాగా, పాట్నా జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఆదివారం నాడు రాసిన లేఖను కూడా ఈసీ ప్రస్తావించింది. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తేజస్వి చూపించిన ఓటర్ ఐడీ ఆర్ఎబి 2916120పై ప్రాథమిక విచారణ జరుపగా అది అధికారికంగా జారీ చేసిన కార్డు కాదని అధికారులు అభిప్రాయపడినట్టు తెలిపింది. ఆ దృష్ట్యా తేజస్వి మీడియా సమావేశంలో చూపించిన ఐడీ కార్డు, ఒరిజినల్ కార్డుతో సహా వివరాలు అందజేయాలని, తద్వారా విచారణ నిర్వహిస్తామని ఈసీ ఆ నోటీసులో పేర్కొంది. కాగా, ఈ వివాదానికి సంబంధించి తేజస్విపై బిజెపి విమర్శలు గుప్పించింది. రెండు ఓటర్ కార్డులు కలిగి ఉండటం ద్వారా తేజస్వి నేరానికి పాల్పడ్డారని ఆరోపించింది. 2020 పోల్ అఫిడవిట్‌లో తేజస్వి చూపించిన ఓటర్ ఐడీ, శనివారం నాడు చూపించిన ఓటర్ ఐడీ ఒకటి కాదని బిజెపి జాతీయ ప్రతినిధి సంబిత్ పాత్ర మీడియాకు తెలిపారు.

# గోదావరిలో వరద మిగులు జలాలు లేవు

### మా నీటి హక్కుల కోసం మాట్లాడటం.. ప్రాంతీయతత్వం రెచ్చగొట్టడం కాదు

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ బనకచర్ల కోసం వరద నీరు తీసుకుపోతే ప్రాంతీయతత్వం రెచ్చగొడుతున్నారని అనడం తగదని, గోదావరిలో వరద మిగులు జలాలు లేనవి మా నీటిహక్కుల కోసం మాట్లాడటం ప్రాంతీయతత్వం రెచ్చగొట్టడ కాదని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో లోకేష్ వ్యాఖ్యలపై అభ్యంతరం తెలుపుతూ నికర జలాలు, మిగులు జలాలు, వరద జలాలు గురించి ముందు తెలుసుకోండని ఆంధ్ర ప్రదేశ్ మంత్రికి హితవు చెప్పారు. తెలంగాణకు ఆనాడు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో నీటి లభ్యత దృష్ట్యా 968 టిఎంసి లు తెలంగాణకు, 531 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్ కి ఇచ్చిన తరువాత ఆ నికర జలాల మీద మిగులు జలాలు తీసుకున్న తర్వాత వరద జలాల గురించి ఆలోచించాలని ఆయన కోరారు. వరద జలాల లభ్యత పైన ప్రాజెక్టులు నీటి వినియోగం పూర్తి అయిన తరువాత వరద జలాలు లెక్కలోకి వస్తా యి. ఆది తెలవ కుండా ప్రజలను మభ్యపెట్టి ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేసే విధంగా ప్రయత్నం జరుగుతున్నదని ఆయన ఆరోపిం చారు.

తెలంగాణ ప్రజలకు సంబంధించిన హక్కు లు ఆనాడు ట్రిబ్యునల్‌లు కేంద్ర ప్రభు త్వాలు నిర్ణయించిన విధంగా మా నీటిని ఒక చుక్క కూడా వదులుకోమని ఆయన స్పష్టం చేశారు. నీటికి సంబంధించిన అంశాల పై ఇరు రాష్ట్రాలు ఘర్షణ వాతావరణం తెచ్చుకునే పరిస్థితి మంచిది కాదు అని ఆయన సూచించారు. మా కోటా మా వాట మా నీటి వినియోగం పూర్తికాకముందే మీరు వరద జలాల పేరు మీద ప్రాంతీయ అసమానతలు రెచ్చగొడుతున్నారని అనడం ఆయన స్థాయికి మంచిది కాదని హితవు చెప్పారు మా రాష్ట్ర ప్రయోజనాలు మా రైతుల హక్కుల కోసం బాజప్త మాట్లాడతామని తెలిపారు.

మా రాష్ట్ర హక్కులు మేము కాపాడుకుంటామని మీ రాష్ట్ర ప్రయో జనాలు కాపాడుకోండి కానీ ప్రజలను మోసం చేసే విధంగా తప్పుడు సమాచారం ఇవ్వద్దు అని పొన్నం లోకేష్‌కు తెలిపారు.

# అవయవదానంలో ఆలిండియా టాపర్‌గా తెలంగాణ

**గతేడాది 188 మంది డోనర్ల ద్వారా 725 మందికి అవయవ మార్పిడి**

**జీవన్‌దాన్‌కు అవార్డు అందజేసిన కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జెపి నడ్డా**

**మంత్రి దామోదర రాజనర్సింహా హర్షం**



**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** అవయవ దానంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది. 2024లో ప్రతి పది లక్షల జనాభాకు దేశంలో సగటున 0.8 ఆర్గాన్ డొనే షన్స్ జరిగితే.. తెలంగాణలో ప్రతి పది లక్షల జనాభాకు 4.88 డొనేషన్స్ జరిగాయని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. అవయవ దానంలో ప్రథమ స్థానంలో నిలిచిన తెలంగాణ రాష్ట్రానికి నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యు ట్రాన్స్ ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ (ఎన్‌వోటి టివో) అవార్డు ప్రకటించింది.

శనివారం ఢిల్లీలో జరిగిన జాతీయ అవ యవదాన దినోత్సవాల్లో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా జీవన్‌దాన్ ప్రతినిధులకు ఈ అవా ర్డును అందజేశారు. అవయవదానంలో తెలంగాణ టాపర్‌గా నిలవడం పట్ల రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సి ంహా హర్షం వ్యక్తం చేశారు. అవయవాలు పాడైపోయిన వ్యక్తుల ప్రాణాలు కాపాడే లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో 2012లో జీవన్‌దాన్ ప్రారంభించామని మంత్రి గుర్తు చేశారు. పేద, ధనిక తేడా లేకుండా అవసరమైన వారందరికీ అవయవాలు అందేలా ఇటీవలే తోట యాక్ట్‌ను అడాప్ట్ చేసుకున్నామని మంత్రి తెలిపారు.

బ్రెయిన్ డెడ్ కేసులలో అవయవాలు వృథా పోకుండా, దానం చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అవయవమార్పిడి చికిత్సను అందిస్తున్నామని మంత్రి తెలిపారు. 2024లో 188 మంది బ్రెయిన్ డెత్ డోనర్ల నుంచి.. 725 అవయవాలను ఇతరులకు అమర్చి, వారి ప్రాణాలు కాపాడ గలిగామని మంత్రి దామోదర రాజనర్సి ంహా తెలిపారు.

## 7న గోవాలో జరిగే జాతీయ ఒబిసి మహాసభలో

# బిసిల భవిష్యత్ కార్యాచరణ

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఈనెల 7న గోవాలో జరిగే జాతీయ ఓబిసి మహాసభలో బిసిల భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గోవాలో జరిగే జాతీయ ఓబిసి మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బిసి ఉద్యోగులు రూపొందించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్క రించారు. హైదరాబాదులోని బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డి రమ, బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం అద్యక్షులు తాటికొండ విక్రం గౌడ్, బిసి ఉద్యోగ సంఘాల నేతలు రాదరాణి, వారాల శ్రినివాస్, జ్ఞానేశ్వర్, మహేశ్ యాదవ్, అనురాద,షమీమ్ సుల్తాన, మహేంద్ర సాగర్, రాజేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈనెల ఆగస్టు 7న గోవా రాష్ట్రంలోని డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆడిటోరియంలో జరిగే జాతీయ ఓబిసి మహాసభకు దేశవ్యాప్తంగా ఓబిసి ఉద్యోగులు కదిలి వచ్చి విజయవంతం చేయాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఉన్న బిసిలు ఎదుర్కొంటున్న సమస్యలపై గోవాలో జరిగే జాతీయ మహాసభలో సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తమన్నారు. మహాసభకు దేశంలోని 29 రాష్ట్రాల నుండి 10వేల మంది ఓబిసి ప్రతినిదులు హాజరవుతారని.. అలాగే దేశంలోని అఖిలపక్ష రాజకీయ పార్టీలకు చెందిన బిసి నేతలు కూడ హాజరవుతున్నట్లు జాజుల తెలిపారు. రాష్ట్రీయ ఓబిసి మహాసంగ్ ప్రధాన కార్యదర్శి సచిన్ రాజోల్కర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఓబిసి రిజర్వేషన్లు అమలులోకి వచ్చినటువంటి రోజైనా ఆగస్టు 7న జాతీయ ఓబిసి మహాసభలను దేశంలోని అన్ని రాష్ట్రాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

## ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి సరఫరా అవుతున్న

# గంజాయి, మద్యంపై ఎక్సైజ్ అధికారుల దృష్టి

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** నగరంలోని ఎక్కడ గంజాయి, ఒపిఎం, మద్యం వంటి మత్తుపదార్థాలు దొరికినా వాటి మూలాలు మాత్రం ఇతర రాష్ట్రాల్లోనే ఉంటున్నాయి. గత కొద్ది కాలంగా వీటి సరఫరా ఒడిశా, అసోం, రాజస్థాన్, బీహార్, చత్తీస్‌గఢ్, గోవా, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలే కాకుండా పొరుగన ఉన్న ఏపీ నుంచి కూడా నగరానికి సరఫరా అవుతున్నట్లు అధికారులు గుర్తించారు. వీటిని అరి కట్టేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. ఇందులో భాగంగా ఎన్‌డి పిఎస్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. వీరు రోడ్లపై తనిఖీలు చేయడమే కాకుండా ర్వేల్వే ఎక్సైజ్ అధికా రులు సం యుక్త ఆధ్వర్యంలో రైళ్ళలో కూడా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఏవోబీ (ఆంధ్రా ఒడిశా బోర్డర్)నుంచి వచ్చే నగరానికి చేరుకునే మార్గాల్లో,ఏవోబీ హైదరాబాద్, ఓవోబీ విజయవాడ నుంచి సూర్యాపేట, ఏవోబీ భూపాల పట్నం, చెన్నూర్, నాగపూర్, అదేవిధంగా ఏవోబీ మార్గాలను కలిపే చెన్నూరు, మంచిర్యాల, రామ గుండం, మెట్‌పల్లి, ఆర్మూర్, కోల్‌కతా, విశాఖపట్నం, హైదరాబాద్ మార్గాల్లో రైలు, బస్సు మార్గాలను తనిఖీ నిర్వహిస్తున్నారు.

పగలు, రాత్రి అనే తేడా లేకుండా తెలంగాణ వ్యాప్తంగా స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు, జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్‌ల ఈ రోడ్లకు అనుసంధానంగా ఉండే ఎక్సైజ్, స్టేషన్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహిస్తున్నారు. ఈ దాడుల్లో ఇంత భారీ ఎత్తన గంజాయి, నల్లమందు పట్టుబడుతోంది. కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్ నుంచి వచ్చిన 6.150 కేజీలను గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ కొల్లాపూర్ నియోజకవర్గంలోని సత్తాపూర్ పెద్ద కొత్తపల్లి మార్గంలో అక్రమంగా తండాలకు సరఫరా అవుతున్న 4080 కేజీల బెల్లంను అధికారులు పట్టుకున్నారు.

అదేవిధంగా రాజస్థాన్ నుంచి నరగానికి సరఫరా అవుతున్న 755 గ్రాముల ఓపిఎం (నల్లమందు) అధికారులు స్వాధీనం చేసుకున్నారు.అదే విధంగా పొరుగునే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వంలో ఫ్యూరియస్ లిక్కర్ దందా నడిపి రూ.లక్షల్లో అక్రమార్జనకు పాల్పడిన టీమ్ ఏపీలో ప్రభుత్వం మారడంతో వచ్చిన కొత్త నిబంధనల మేరకు ఎపి ఎక్సైజ్ శాఖకు పలువురు పట్టు బడి కటాకటాల్లో ఊచలు లెక్కిస్తున్న వారితో చేతులు కలిసిన ముఠాలోని కొందరు సభ్యులు ఎన్టీఆర్ జిల్లా బార్డర్ రామాపురంలో ఎంసీ లిక్కర్ తయారు చేస్తున్న క్రమంలో స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్ లిక్కర్ తయారీని భగ్నం చేశారు.అదే విధంగా ఏపీ సరిహద్దు ప్రాంతమైన మేళ్ల చేరువు మండలం రామాపూరంలోని ఒక రైస్ మిల్లులో పెద్ద మొత్తంలో 38 ఎంసీ వీస్కీ క్వార్టర్స్ 38 కాటన్లను, 11,800 ఎంటీ బాటిళ్లను, 42.8 కేజీల వీస్కీ బాటిళ్ల క్యాప్స్ 56.3 కేజీల క్యాప్స్, 7814 లెబుల్స్‌ను 6 స్టీల్ వెజెలెస్ 200 లీటర్స్, ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా గోవా విహార యాత్ర నిమి త్తం నల్గొండ జిల్లా పెద్ద అడిశర్లపలి నుంచి వెళ్లిన ఒక బృందం తిరుగు ప్రయాణంలో పెద్ద ఎత్తున మద్యం బాటిళ్లు తీసుకు వస్తున్నారనే పక్కా సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకని వారి వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే.


**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీ చేయబడిన నోటీసు**

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)

తేది: 04.08.2025

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి జన గళం పార్టీ (పార్టీ పేరు) అధ్యక్షులు అయిన శ్రీ దాసరి నాగులు గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీ'గా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో 1) శ్రీ దాసరి నాగులు గారు అధ్యక్షులు, 2) శ్రీ కొండం శ్రీనివాస్ గౌడ్ గారు, ప్రధాన కార్యదర్శి, 3) శ్రీ అలిజాల వరుణ్ తేజ్ గారు కోశాధికారి ప్రధాన కార్యవర్గ సభ్యులు; మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము ఇంటి నెం.1-1-79, ఆర్‌టీసీ క్రాస్ రోడ్, జవహర్‌నగర్, ముషీరాబాద్, హైదరాబాద్, తెలంగాణ-500020. సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, టి.టి.సి.పి. భవనము, ఎ.సి. గార్డ్స్, హైదరాబాద్-500004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజులలోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు జన గళం పార్టీ ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

అధ్యక్షులు
దాసరి నాగులు
జన గళం పార్టీ

వార్త


మన జీవితానికి ఒక ఉద్దేశం, ఒక లక్ష్యం ఉంటేగాని
అది జీవితం అనిపించుకోదు.

-రాచెల్

# ట్రంప్ ప్రేలాపనలు!

కలిసొచ్చే వారితో ఒకలా కలిసిరాని వారితో మరోలా వ్యవహరించడం స్థితప్రజ్ఞత అనిపించుకోదు. సాధారణంగా సామ,దాన భేద దండోపాయాల తర్వాత కానీ ఆఖరి అస్త్రం తీయరు. అది తెలివైనవారి లక్షణం. కానీ శ్వేతసౌధాధినేత ట్రంప్ మాత్రం కేవలం బెదరింపుల ద్వారానే సాటి దేశాలనుతన వైపు లాక్కోవాలనుకుంటున్నారు. యూరోపియన్ దేశాలతో ఆయనకు వాణిజ్య డీల్స్ కొంతమాత్రం కుదిరినా రష్యా, భారత్ వంటి దేశాల శైలి ఆయనకు మింగుడుపడటం లేదు. ఇప్పుడాయన వ్యవహరిస్తున్న తీరును దేశాలన్నీ తప్పుపడుతున్నాయి. ట్రంప్‌కు లొంగని తప్పని పరిస్థితులలో కొన్ని దేశాలున్నాయి. జీ హుజూర్ అంటున్నాయి. ఆ కోవలోనే ట్రంప్ తలపోసినట్లుంది. రష్యా, భారత్‌ల మీద దుర్భాషలతో విరుచుకుపడుతున్నారు. అమెరికా అనగానే పాలకులెవరైనా ఆయుధ వ్యాపారం కోసం ఇతర దేశాలను తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటారని ప్రపంచ చరిత్ర తెలిసిన వారందరికీ విదితమే. తాజాగా అమెరికా సామ్రాజ్యాధినేత మాత్రం తన వాచాలతతో తమతో బంధమున్న వారితో బంధాన్ని బలోపేతం చేసుకోవడం మాని, తెగిపోయే వ్యూహాలను పన్నడం ఆత్మహత్యాసదృశ్యం. తాను వద్దనుకున్న, తనకు కలిసిరాని వ్యాపారాలు చేసుకుంటున్న వారిని పక్కన పెడుతున్నారు. ఏకంగా మాటల యుద్ధం ప్రకటించేశారు. అమెరికాతో భారత్ సంబంధాలు బాగుండేవని, ఒకరకంగా చెప్పాలంటే ఈ రెండు దేశాలు మిత్రదేశాలనీ, ప్రపంచానికంతకూ తెలుసు. అలాగే రష్యాతో కూడా అమెరికా అంటీ ముట్టనట్లుగా ఉంటూనే పరోక్షంగా స్నేహ పాత్రతో వ్యవహరిస్తుందన్నది కూడా నిజమే. ఉక్రెయిన్‌తో సంధి చేసే విషయంలో తొలుత రష్యాను అంటకాగారు. యుద్ధం పరిసమాప్తి కాదని, రష్యా ఆలోచనమరోలా ఉందని అర్థమయ్యాక ట్రంప్ రష్యాను దూరం పెట్టారు. ఆయుధాలిస్తే రష్యాపై దాడులు చేయగలవా? అని ఉక్రె యిన్‌ను ఊరించారు. ఆయుధాలివ్వడం విషయం ఎలాఉన్నా ఆ తర్వాత అమెరికా రష్యాతో మంతనాలు లేవు. కలిసిరాని రష్యా, భారత్‌లతో అమెరికాకు దాదాపు బెడిసి కొట్టినట్లే ఉంది. ట్రంప్ ఎన్నికైన నాటి నుంచి తమకన్నా చిన్న దేశాలను ఎగుమతి, దిగుమతులపై సుంకాల బేరంతో బెదరించడం మొదలుపెట్టారు. 20 రోజుల నాడు భారత్‌తో 'ట్రేడ్ డీల్' కుదురుతోందని ప్రపంచానికి ప్రక టించి సుకాలం బేరం ప్రారంభించారు. వ్యవసాయ,పాడి ఉత్పత్తుల విషయంలో భారత్ ససేమిరా అనడంతో ఆ 'డీల్' ముందుకు కదిలినట్లు లేదు. రష్యా, భారత్ దేశాల ఆర్థిక వ్యవస్థల్లో ఎలాంటి సంక్షోభమూ లేదు. కనుచూపు మేరలో అలాంటి భయాలు లేవని చెప్పాలి. భారత్‌ను ట్రంప్ అష్టదిగ్బంధం చేయాలనుకుంటున్నారో ఏమోకానీ నేరుగా కార్యాచరణలో దిగారు. ఇరాన్‌తో చమురు వ్యాపారం చేస్తోందన్న కారణంగా '6' భారతీయ కంపెనీలపై అమెరికా ఆంక్షలు విధించింది! ఇప్పటికే భారత్‌పై 25 శాతం సుంకాలతోపాటు పెనాల్టీ కూడా విధించింది. రష్యా,భారత్ దేశాలు ఎలాంటి ఆర్థిక దిగజారుడు ఉన్నా తాము ఆలోచించబోమనీ ట్రంప్ అంటున్నారు. ప్రపంచంలోని అన్ని దేశాలు ఉక్రెయిన్‌పై దాడులు ఆపాలని కోరుకుంటున్నా రష్యా, భారత్ దేశాలు మాత్రం ఈ విషయాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. భారత్, రష్యా నుంచి ఆయుధాలు కొనుగోలు చేయాలనుకుంటోంది. ఇదీ ఆయన ఆందోళన. రష్యా,భారత్ దేశాలు కలిసిపోయి తమ నిర్జీవ ఆర్థిక వ్యవస్థలను మరింత దిగజార్చుకోనివ్వదని విమర్శించారు. తనతో భారత్ ఇంకా వ్యాపారం 'డీల్' కుదరకపోవడంతోనే అమెరికా వ్యాఖ్యాలున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ట్రంప్ అమెరికా సుంకాల విషయంలో జాతీయ ప్రయోజనాలకు ఏమాత్రం భంగం వాటిల్లకుండాఅక్టోబరులోగా 'డీల్' కుదుర్చుకుంటామని కేంద్రప్రభుత్వం పార్లమెంటులో ప్రకటించింది. దాంతో తాను కోరగానే భారత్ ముందుకొచ్చేస్తుందని అనుకున్న ట్రంప్‌కు గొంతులో వెలక్కాయపడినట్లుంది. అందుకే రష్యా, భారత్‌లవి మృత ఆర్థిక వ్యవస్థలని శాపాలు పెడుతున్నారు. వాణిజ్య విధానాల్లో ఆలోచనలు విభిన్నంగా ఉన్నంత మాత్రాన దేశాలు శతృత్వ వ్యాఖ్యలు చేసుకోలేవు. కానీ అది 'ట్రంప్'కే చెల్లింది. వారెవరూ ఇంత అత్యల్పస్థాయికి దిగజారి మాట్లాడుకోరు. నోరు పారేసుకోవడం ట్రంప్‌కు కొత్తేమీకాదు. కాగా ఇరుదేశాల వాణిజ్యాన్ని తప్పుపడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేయడమే అభ్యంతరకరం. ఏదయినా ఆచరణాత్మకంగా ఉండాలన్న భారత్ ఆలోచనను గౌరవించడం ట్రంప్ విధి. కాని అతనికి ఆ స్థాయి విజ్ఞత కూడా కావాలి కదా! ఇదే సందర్భంలో భారత్ ఇతర దేశాల వాణిజ్యంతో తీవ్రస్థాయి సుంకాలతో దోచేస్తోందని సెలవిచ్చారు. తనసొంత సోషల్ మీడియా 'ట్రూత్'లో ఈ విషయాలన్నీ పోస్ట్ చేసి రష్యా, భారత్‌ల పరువు తీయాలనుకోవడం ట్రంప్‌కి ఉచితం కాదు. అయి నా ఆయన నోటికి, ఆలోచనలకు కళ్లెం వేసేవారు లేరు. రష్యాకు అమెరికాకు మధ్య ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవు. అయినా ఆ దేశాన్ని కూడా అమెరికా అధ్యక్షుడు వదిలిపెట్టడం లేదు. రష్యానుంచి ఏనాటి నుంచోవాణిజ్య సంబంధాలున్న భారత్ చమురు, ఆయుధాలు కొనుక్కోవ డమే అమెరికాకు రష్యా కంట్లో నలుసుగా తయారైందనిపిస్తోంది. అమెరికా ప్రధానం తన ఆయుధాలను ఇతర దేశాలకు అమ్మాలనిచూస్తుంది. అందుకుభారత్‌తో వాణిజ్యానికి అమెరికా అంగలారుస్తోంది. కాని ఎటూ తేలక పోయే సరికి ఆందోళనలో పడి, ట్రంప్‌వాచాలత ప్రదర్శిస్తున్నట్లు అర్థమౌతోంది. భారత్‌తో వాణిజ్యానికి అమెరికా కొత్త ప్రత్యామ్నాయాలను ఎదుర్కోవాల్సిందే.!

"తెలివిగల వ్యక్తి తన ఆర్థిక విషయాలను, మానసిక సంఘర్షణలను, గృహ సంబంధమైన విషయాలను ఎప్పుడూ రహస్యంగానే ఉంచుతాడు."




శామ్యూల్ జాన్సన్

"ధనవంతులుగా మారాలనుకునేవారు చెడు చేయడానికి కూడా పాల్పడే ప్రమాదం ఉంది."



బర్ట్రాండ్ రస్సెల్

## ప్రజావాక్కు



### కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలి

మన రైల్వేలు దేశ పౌరుల ఇంద్ర వాహనం కానీ తరచుగా ఇటీవల ప్రమాదాలు జరుగుతుండడం వలన రైల్వే ప్రయాణం అంటే భయభ్రాంతులను కలుగుచున్నవి. మొన్న ముంబైలో జరిగినలోకల్ రైళ్లప్రమాదంలో ప్రయాణికులు చనిపోవడం అత్యంతవిషాదకరమైన సంఘటన. రెండు రైళ్లప్రయాణికుల సంచులు ఒకదానికి ఒకటి తగిలి ప్రయాణికులు క్రింద పడి దుర్మరణం చెందడం భారత రైల్వే చరిత్రలో బహుశా మొదటిసారి కావచ్చు! ప్రయాణికుల రైళ్ళు పెరుగుతున్న జనాభా, అవసరాలకు తగ్గట్టు విస్తరించడం లేదు. ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లు గా మార్చడం కొన్ని స్టేషన్లలో ఉన్న హాల్ట్‌లను ఎత్తివేయడం జరుగుతున్న కథ. టాయిలెట్స్ శుభ్రంగా ఉండడం లేదు స్లీపర్ భోగిల సంఖ్య తక్కువగా ఉంటుంది.

- డి. రాంచందర్ రావు, హైదరాబాద్

### ఒక్కొక్క పార్టీకి ఒక్కో ఛానెల్

ఒక దశాబ్దనుండి మన తెలుగు చానెల్లో ఒక్క దూరదర్శన్ ఛానల్‌లో తప్ప మిగతా ప్రైవేట్ చానెల్స్ ఎలా మారిపోయాయంటే ఎదో ఒక రాజకీయ పార్టినోఎదో ఒక సామాజిక కులాన్నోమోస్తోన్న వ్యవస్థలుగా మారిపోయాయి. వాళ్ల వాళ్ల మీటింగులు, వారి వారి చెత్త దప్పులు కొట్టుకోవడం చేస్తే ఒకసందర్భంలో కొంతలోనైనా మంచిది. విర్నుద్ధంగా పగవారిని తిట్టించడంఎక్కువై పోయింది. డిబేట్లు అయితే తిట్టు కోవడమే పరామవధి. వక్తలు సహనంకోల్పోయి కొట్టుకోవడం వరకూవెళ్తే మరి వారిని ఫాలో అయ్యే జనాల పరిస్థితి రోడ్ల మీద చూస్తూనే ఉన్నా ము.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### తగ్గిన పేదరికం..

భారత్‌లో పేదరికం భారీగా తగ్గిపోయిందని ప్రపంచ బ్యాంకు గణాంకాలు పేర్కొన్నాయి. ఈ లెక్కలు చెప్పిన వారు పట్టణాల్లో గ్రామాల్లో సర్వేలు చేసే చెప్పాయా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రభుత్వ పథకానికి నోచుకోలేనివారు గంజి నీళ్లకు కష్టపడుతున్నారు. మన దేశం చాలా పేద దేశమని పూర్వ రిజర్వుబ్యాంకు గవర్నరు రఘురామ్ రాజన్ ఈ మధ్యనే అన్నారు. ఈ పేదరికంలోఉద్యోగం చేసి రిటైర్‌అయినవారు కూడా ఉన్నారు.

- ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### పెరుగుతున్న పబ్లిక్ న్యూసెన్స్‌లు

మన పురాణకాలంలో చెడుపై మంచి సాధించిన విజయంగా ప్రజలంతా భావించి దీపాలను వెలిగించి ఆనందంగా దీపావళి పండుగ చేసుకోవటం, అప్పటి నుండి ప్రతిసంవత్సరం పిల్లలు పెద్దలు దీపావళి రోజు టపాసులు కాలుస్తూ పండుగ జరుపుకోవటం ఆనవాయితీగా మారిందని పెద్దలు చెబుతారు. ఐతే ఈ రోజుల్లోఆ దీపావళి టపాసుల వినియోగం నానాటికి పెరిగిపోతూ ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి కూడా ముప్పుగా తయారైంది. ఊరేగింపులకూ, శుభకార్యాలకు, అశుభ కార్యాలకు సైతం సాంప్రదాయక వాయిద్యాల స్థానంలో ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో భారీశబ్దాలతో టపాసులు, బాంబులు పేలుస్తుంటే వాటి వలన వ్యాధిగ్రస్తులు, ముఖ్యంగా గుండె జబ్బు లున్న వారికి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇప్పుడు కొందరి వలన మరొక కొత్త జాడ్యం మొదలైంది

- టి. సాంబశివరావు, గుంటూరు

### నీటిపారుదల సౌకర్యాలు కల్పించాలి

రాష్ట్రంలోని పట్టా కలిగిన బీడు భూములను సాగు చేయడానికి ఉపాధి హామీ ద్వారా అవకాశం ఉంది. అయితే భూమి చదును కార్యక్రమాల కింద విస్తృత భూమి సాగులోకి వచ్చే అవకాశం ఉంది. దీనికి ప్రధాన కారణం ఉత్తర తెలంగాణలోనే కాదు దేశంలోనే వ్యవసాయ అవసరాల కోసమే నిర్మించిన శ్రీపాద సాగర్ ఎత్తిపోతల పథకంతో పాటు కరీంనగర్‌లో నిర్మించిన లోయర్ మానేరు డ్యాం ,అప్పర్ మానేరు లాంటి ప్రాజెక్ట్స్‌తో పాటు కాళేశ్వరం ద్వారా నిర్మించిన గొలుసుకట్టు డ్యాంలు తెలంగాణలో నీటి పారుదల సౌకర్యాలు పెరిగినవి. వీటితో పాటు గొలుసు కట్టు చెరువులు అదనం వీటి అన్నింటి మూలంగా భూమి అభివృద్ధి చేయడం చాలా ఉపయోగకరం.

- భారత అవినాష్, జనగామ

### యుద్ధాన్ని ఆపలేరా?

ఇజ్రాయెల్ ఇప్పటికీ గాజా మీద దాడులు చేస్తూనే ఉంది. అమెరికా ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌ను సమర్థిస్తూనే ఉంది. ఇండో-పాక్‌ల మధ్య జరిగిన యుద్ధాన్ని నాలుగు రోజు లలోనే ఆపివేశానని గొప్పలు చెప్పుకుంటున్న ట్రంప్ మహాశయుడు ఉక్రెయిన్ రష్యా మధ్య ఏడాది పైగా ఎడతెరిపి లేకుండా జరుగుతున్న యుద్ధాన్నిఆపలేకపోయాడు. ఇజ్రాయిల్‌ను అదుపు చేయలేక పోయాడు. అణుయుద్ధానికి ఏ దేశం ఒడి గట్టినా దాని మూల్యం ప్రపంచ దేశాలన్ని చెల్లించుకోవాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భారత్ స్వయం సమృద్ధి సాధించగలదా?

**భారతదేశ ఎరువుల సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే సాంకేతిక ఆవిష్కరణలు, విధాన స్థిరత్వం, అంతర్జాతీయ సహకారం కలగలిసిన ఒక దీర్ఘకాలిక వ్యూహాత్మక దృష్టి అవసరం. దేశీయ, విదేశీ పెట్టుబడిదారులలో విశ్వాసం కలిగించడానికి ఎరువుల ధరలు, రాయితీలపై స్పష్టమైన, స్థిరమైన విధానం తప్పనిసరి. కొత్త ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడం కూడా కీలకం. అదే సమయంలో ముడిసరుకులు దీర్ఘకాలం పాటు పోటీ ధరలకు స్థిరంగా లభించేలా వనరులు అధికంగా ఉన్న దేశాలతో దౌత్య, ఆర్థిక భాగస్వామ్యాలను భారతదేశం దూకుడుగా కొనసాగించాలి. ఎరువులు, వాటి ముడిసరుకుల ఉత్పత్తి కోసం ఇతర దేశాలలో జాయింట్ వెంచర్లలో పెట్టుబడులు పెట్టే వ్యూహాన్ని మరింతగా పెంచాలి. చివరగా, ఎరువుల రంగంలో నిజమైన ఆత్మనిర్భరత సాధించడం ఒక మారథాన్ లాంటిది, స్ప్రింట్ కాదు. సవాళ్లను అధిగమించి, భారత వ్యవసాయ భవిష్యత్తుకు శక్తినిచ్చే స్థితిస్థాపకమైన, స్వయం సమృద్ధమైన ఎరువుల రంగాన్ని నిర్మించడానికి ప్రభుత్వం, పరిశ్రమలు, రైతు సమాజం నుండి సమష్టి కృషి అవసరం.**

డి. జె మోహన రావు

భారతదేశ వ్యవసాయ రంగానికి ఎరువులు వెన్నెముక లాంటివి. అవి సరైన సమయంలో సరిపడినంతగా అందుబాటులో ఉండటం చాలా కీలకం. మన దేశ జనాభా మొత్తానికి ఆహార భద్రత కల్పించాలంటే ఎరువుల రంగం బలంగా ఉండటం కేవలం ఆర్థిక అవసరమే కాదు వ్యూహాత్మక అవసరం కూడా. అయితే ఈ విషయంలో మన దేశం చాలా సున్నితమైన పరిస్థితిలో ఉంది. ముఖ్యమైన వ్యవసాయ ముడిసరుకుల కోసం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. భారతదేశ ఎరువుల పరిశ్రమ స్థితిగతులను లోతుగా పరిశీలిస్తే, ఉత్పత్తి కొరత, దిగుమతులపై ఆధారపడటం,ఆత్మనిర్భరత లేదా స్వయం సమృద్ధికి ఆటంకం కలిగిస్తున్న సవాళ్ల వంటి సంక్లిష్టమైన విషయాలు మనకు కనిపిస్తాయి. మన దేశంలో అత్యధికంగా వాడే ఎరువు యూరియా అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇందులో నత్రజని అధికంగా ఉండటం, ప్రభుత్వం ఇచ్చే రాయితీల వల్ల రైతులకు చౌకగా లభించడమే దీనికి కారణం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో యూరియాకు ఏకంగా 356 లక్షల మెట్రిక్ టన్నుల డిమాండ్ ఉంది. దేశీయ ఉత్పత్తి గణనీయంగా పెరిగి 314 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకున్నప్పటికీ, డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి జరగడం లేదు. ఈ లోటును పూడ్చడానికి పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీనివల్ల ప్రపంచయూరియా మార్కెట్‌లో భారతదేశం ఒక పెద్ద కొనుగోలుదారుగా మారింది. అయితే యూరియాపై అతిగా ఆధారపడటం వల్ల భూమిలో పోషకాల సమతుల్యత దెబ్బతింటోంది. రైతులు ఫాస్ఫేట్, పొటాష్ వంటి ఇతర ముఖ్యమైన పోషకాలను విస్మరించడం వల్ల దీర్ఘకాలంలో భూసారం దెబ్బతిని, ఉత్పాదకత తగ్గుముఖం పడుతోంది. డైఅమోనియం ఫాస్ఫేట్ (డీఏపీ), మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంఓపీ) విషయంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. కీలకమైన ఫాస్ఫేట్ ఎరువైన డీఏపీ వినియోగం 2023-24లో సుమారు 92 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉండగా, దేశీయ ఉత్పత్తి కేవలం 42 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. అంటే, దాదాపు 50-60 శాతం దిగుమతులపైనే మనం ఆధారపడుతున్నాం. ఇక పొటాష్ ఎరువు విషయానికి వస్తే మన దేశంలో దీని ఉత్పత్తి దాదాపు శూన్యం. మొత్తం అవసరానికి దిగుమతే దిక్కు. ఇలాంటి కీలకమైన ఎరువుల కోసం అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధారపడటం వల్ల ప్రపంచంలో ధరలు పెరిగినా లేదా సరఫరాలో అంతరాయాలు ఏర్పడినా భారత వ్యవసాయం ప్రమాదంలో పడుతుంది. భారతదేశంలో ఎరువుల తయారీ కర్మాగారాలు గణనీయమైన సంఖ్యలోనే ఉన్నాయి. సుమారు 32 పెద్ద యూరియా ప్లాంట్లు, మొత్తం మీద 200 వివిధ స్థాయిల ఎరువుల యూనిట్లు దేశవ్యాప్తంగా పనిచేస్తున్నాయి. ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం నానో ఎరువుల ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే ఏడు నానో యూరియా, మూడు నానో డీఏపీ ప్లాంట్లు పనిచేస్తున్నాయి. వీటి లక్ష్యం పోషకాలను మొక్కలు సమర్థవంతంగా వాడుకునేలా చేయడం. ఇంతపెద్ద పారిశ్రామిక పునాది ఉన్నప్పటికీ, పెరుగుతున్న దేశీయ డిమాండ్‌ను తీర్చడానికి ప్రస్తుత సామర్థ్యం సరిపోవడం లేదు. ఉత్పత్తి వినియోగం మధ్య ఉన్న ఈ అంతరాన్ని పూడ్చడానికి భారతదేశం అనేక దేశాల నుండి ఎరువులను దిగుమతి చేసుకుంటోంది. యూరియా కోసం ఒమన్, ఖతార్,సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలపై



ఆధారపడుతుంటే, ఫాస్ఫేట్, పొటాష్ ఎరువుల కోసం చైనా, సౌదీ అరేబియా, మొరాకో, కెనడా వంటి దేశాల వైపు చూస్తున్నాం. ఈ దిగుమతుల వల్ల ప్రభుత్వ ఖజానాపై భారీ భారంపడుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మన ఎరువుల దిగుమతి బిల్లు సుమారు రూ. 86వేల కోట్లు. వస్తువులు,సేవల ఎగుమతులు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విదేశాల్లో పనిచేస్తున్న భారతీయులు పంపే డబ్బు ద్వారా ఈ విదేశీ మారక ద్రవ్యాన్ని సమకూర్చుకుంటున్నాం. అయితే ప్రపంచ ఎరువుల ధరలలో వచ్చే మార్పులు మన దేశ చెల్లింపుల శేషంపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయి. మన దేశంలో సరిపడినంత ఎరువులు తయారు చేయలేకపోవడానికి ప్రధానకారణం ముడిసరుకుల కొరతే. యూరియా ఉత్పత్తి సహజవాయువుపై ఆధారపడి ఉంటుంది. మన దేశంలో సహజవాయువు నిల్వలు చాలా తక్కువ. అందువల్ల ఖరీదైన దిగుమతి చేసుకున్న ద్రవీకృత సహజవాయువుపై ఆధారపడాల్సి వస్తోంది. ఫాస్ఫేట్ ఎరువుల కోసం అవసరమైన రాక్ ఫాస్ఫేట్ విషయంలో దాదాపు పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడి ఉన్నాం. పొటాష్ పరిస్థితికూడా ఇంతే. దేశంలో వాణిజ్యపరంగా లాభదాయకమైన నిల్వలు లేవు. ముడిసరుకుల కోసం ఇతర దేశాలపై ఇలా ఆధారపడటమే స్వయం సమృద్ధికి అతిపెద్ద అడ్డంకిగా మారింది. దేశీయంగా ఎరువుల ఉత్పత్తిని విస్తరించడం అనేక సవాళ్లతో కూడుకున్నది. కొత్తఎరువుల కర్మాగారాలను ఏర్పాటు చేయడానికి భారీగా పెట్టుబడులు పెట్టాలి. భూసేకరణ, పర్యావరణ అనుమతులు పొందడం వంటి ప్రక్రియలు చాలా సమయం తీసుకోవడంతో ప్రాజెక్టులు ఆలస్యం అవుతున్నాయి. అంతేకాకుండా ఎరువుల ధరలు, రాయితీలపై ప్రభుత్వానికి దీర్ఘకాలిక విధానం స్పష్టంగా లేకపోవడం ప్రైవేట్ పెట్టుబడులను నిరుత్సాహపరుస్తోంది. సహజవాయువు, ఫాస్ఫరిక్ యాసిడ్ వంటి ముడిసరుకుల అంతర్జాతీయ ధరలలో వచ్చే మార్పులు దేశీయ తయారీదారులకు మరో పెద్ద సవాలుగా మారాయి. భారతదేశ ఎరువుల సంక్షోభాన్ని పరిష్కరించడానికి బహుముఖ నిరంతర కృషి అవసరం. దేశీయ ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం అనేక చర్యలు ప్రారంభించింది. కొత్త పెట్టుబడులను ఆకర్షించడానికి 2012లో ప్రవేశపెట్టిన నూతన పెట్టుబడి విధానం, దాని సవరణలు దోహదపడుతున్నాయి. మూతపడిన గోరఖ్‌పూర్, బరౌని, సింద్రీ, తాల్చేర్,రామగుండం ఎరువుల కర్మాగారాలను పునరుద్ధరించడం ఈ దిశగా ఒక ముఖ్యమైన అడుగు. ప్రత్యామ్నాయ, దేశీయ వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడం ఒక కీలకమైన దీర్ఘకాలిక పరిష్కారం. మన దేశంలో పుష్కలంగా ఉన్న బొగ్గును గ్యాస్‌గా మార్చి దానిద్వారా యూరియాను ఉత్పత్తి చేయడం ఒక మంచి మార్గం. ప్రభుత్వం ఈ దిశగా చురుకుగా అడుగులు వేస్తోంది. తాల్చేర్ ఎరువుల కర్మాగారం దీనికి ఒక ఉదాహరణ. అంతేకాకుండా, సమతుల్యమైన, సమర్థవంతమైన ఎరువుల వాడకం వైపు రైతులను ప్రోత్సహించాలి. భూసార పరీక్ష కార్డుల ద్వారా పోషకాల ఆధారంగా ఎరువులు వాడటాన్ని ప్రోత్సహించడం, పోషకాలను సమర్థవంతంగా ఉపయోగించుకునే నానో యూరియా, నానో డీఏపీ వంటి వినూత్న ఉత్పత్తులను అభివృద్ధి చేయడం సరైన చర్యలు. సేంద్రియ, జీవన ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని కూడా తగ్గించవచ్చు. భారతదేశ ఎరువుల సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే సాంకేతిక ఆవిష్కరణలు, విధాన స్థిరత్వం, అంతర్జాతీయ సహకారం కలగలిసిన ఒక దీర్ఘకాలిక వ్యూహాత్మక దృష్టి అవసరం. దేశీయ, విదేశీ పెట్టుబడిదారులలో విశ్వాసం కలిగించడానికి ఎరువుల ధరలు, రాయితీలపై స్పష్టమైన, స్థిరమైన విధానం తప్పనిసరి. కొత్త ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడం కూడా కీలకం. అదే సమయంలో, ముడిసరుకులు దీర్ఘకాలం పాటు పోటీ ధరలకు స్థిరంగా లభించేలా వనరులు అధికంగా ఉన్న దేశాలతో దౌత్య,ఆర్థిక భాగస్వామ్యాలను భారతదేశం దూకుడుగా కొనసాగించాలి. ఎరువులు, వాటి ముడిసరుకుల ఉత్పత్తి కోసం ఇతర దేశాలలో జాయింట్ వెంచర్లలో పెట్టుబడులు పెట్టే వ్యూహాన్ని మరింతగా పెంచాలి. చివరగా, ఎరువుల రంగంలో నిజమైన ఆత్మనిర్భరత సాధించడం ఒక మారథాన్ లాంటిది, స్ప్రింట్ కాదు. సవాళ్లను అధిగమించి, భారత వ్యవసాయ భవిష్యత్తుకు శక్తినిచ్చే స్థితిస్థాపకమైన, స్వయం సమృద్ధమైన ఎరువుల రంగాన్ని నిర్మించడానికి ప్రభుత్వం, పరిశ్రమలు, రైతు సమాజం నుండి సమష్టి కృషి అవసరం. •

# హోంగార్డులు దీనస్థితిలో ఇంకెంతకాలం?

అనంతాత్మకుల కొండబాబు

అటెండర్‌కు ఎక్కువ పోలీసులకు తక్కువ అనే విధంగా మారింది రాష్ట్రంలోని హోమ్‌గార్డుల పరిస్థితి. మినీ పోలీసులుగా గుర్తింపు ఉన్నప్పటికీ కనీసం ఉద్యోగి అనే మర్యాద కూడా లేకుండా పోయింది. వెట్టిచాకిరి చేయించుకోవడం కోసమే హోంగార్డులు ఉన్నట్టుగా ఉంది పరిస్థితి. పోలీసుశాఖలో వీరిది కీలకపాత్ర. ఈ శాఖలోని అధికారులకు, వీరికి ఒకటే రంగుయూనిఫాం. అయితే చేసే పని మాత్రం వేరు. జీతం తక్కువైనా రెగ్యులర్ పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారు. హోంగార్డుల పని మాత్రం పోలీసు బాస్‌ల ఇళ్ల వద్దే. ఖాకీ యూనిఫాం సర్వీసులో అత్యంత అల్పజీవులుగా చులకన బతుకులు వీరివి. ఉపాధి హామీ కూలీలకైనా ఇన్ని గంటల పని అంటూ ఒక లెక్క ఉంటుంది. వీళ్ల కు అదేం లేదు. బాస్ చెబితే చేయాల్సిందే. లేదంటే అంతే. ఐపీఎస్ అధికారుల దగ్గర నుంచి డిఎస్పీలు, సీఐలు, ఎస్సైల వ్యక్తిగత సేవకు హోంగార్డుల జీవితం అంకితం కావల్సిందే. ఇంటికి కూరగాయలు తీసుకురావడం దగ్గర నుంచి పిల్లలు స్కూల్లో వదిలి రావడం తిరిగి స్కూల్ వదిలినప్పుడు ఇంటికి తీసుకెళ్ళడం వంటి పనులు చేయిస్తున్నారు. పోలీసు స్టేషన్లలో కూడా వీరిని వదిలిపెట్టడం లేదు. ఉదయం, సాయంత్రం సిఐ, ఎస్సైలకు టీ, టిఫిన్ తీసుకురావడానికి ఉపయోగిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. అధికారులు చెప్పినట్టు వినకపోయినా, పనులు చేయకపోయినా ఇబ్బందులు తప్పడంలేదు. ఒక వైపు పోలీసు శాఖలో ఆర్డర్లీ వ్యవస్థను రద్దు చేసినట్టు చెబుతున్నా మరోవైపు అధికారులు మాత్రం అనధికారికంగా ఆర్డర్లీ వ్యవస్థను కొనసాగిస్తున్నారు. సెలవులుంటాయా అంటే అదీ లేదు. జీతం అంతంత మాత్రమే. పోనీ ఉద్యోగ భద్రత ఉంటుందా అంటే అదీలేదు. ఒళ్లు వంచి ఏళ్ళ తరబడి పనిచేసినా రిటైర్‌మెంట్ రోజు ఒట్టి చేతులతో ఇంటికీ వెళ్లాల్సిన దుస్థితి వీరిది. అసలు హోంగార్డులు అనేది స్వచ్ఛంద దళం. 1946 డిసెంబర్‌లో భారతదేశంలో మొదటిసారిగా పౌర విఘాతం, మతపరమైన అల్లర్లను నియంత్రించడంలో పోలీసులకు సహాయం చేయడానికి ఈ దళం ఏర్పాటు చేశారు. ఈ స్వచ్ఛంద పౌరుల దళంను అనేక రాష్ట్రాలు ఆమోదించాయి. దేశంలోని హోంగార్డుల మొత్తం బలం 5,73,793. అయితేఇటీవల పెరిగిన బలం చూస్తే 4,33,803 గా నమోదైంది. నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోవడంతో డిగ్రీలు, పిజీలు చేసినవారు సైతం హోంగార్డులుగా పనిచేస్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నారు. పోలీసు కానిస్టేబుల్‌తో సమానంగా ఉద్యోగం చేస్తున్న కూడా వీరికి ఎటువంటి భద్రతా, భరోసాలేక చాలిచాలని జీతంతో సమాజంలో ఎటువంటి గుర్తింపులేని బతుకులు బతుకుతున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం హోంగార్డులకు జీతాలు, ఇతర అలవెన్సులు అమలుచేయాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. పోలీసుశాఖలో ఎన్నో ఏళ్లుగా హోంగార్డులుగా ఉద్యోగం చేస్తున్న కూడా ప్రభుత్వం నుంచి గుర్తింపేలేదు. వీరు రోజువారీ విధులునిర్వహిస్తే రూ.720లు ఇస్తారు. అదే తెలంగాణ రాష్ట్రంలోని హోంగార్డులకు రూ.వేయి ఇస్తున్నారు. వీరి సంవత్సర ఆదాయం రూ.27వేలకు పరిమితం చేసినాగాని వీరికీఎటువంటి సంక్షేమపథకాలు వర్తించడం లేదు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, అనారోగ్య సమస్యలు, నిత్యావసర ధరలు వీరి పాలిట శాపంగా మారా యి. హోంగార్డుల పరిస్థితి బానిస బతుకుల కంటేఘోరంగా ఉంటుంది. వీరికి గౌరవ వేతనం పేరుతో రోజువారీ వేతనాలు ఇస్తున్నారు. పనిచేస్తేనే వేతనం ఉంటుంది. లేకపోతే ఆరోజు వేతనం కట్, అందరిలాగే వీరికి బాధ్యతలుంటాయి. ప్రభుత్వ ఉద్యోగిగా నమోదు చేసినందున వారికిఎటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించడంలేదు. దీంతో అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నారు. రాష్ట్రంలో పదేళ్లకుపైగా హోంగార్డుల ఎంపిక జరగలేదు. ఇంకా 5వేల హోంగార్డు పోస్టులుభర్తీ చేయాల్సిఉంది. •

# 9వ షెడ్యూల్‌లో చేర్చితేనే రిజర్వేషన్లకు రక్షణ



అన్నవరపు బ్రహ్మయ్య

తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం స్థానాలు కేటాయిస్తూ ఆ మేరకు రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలంటూ పంపిన ప్రతిపాదన అమలు సాధ్యంకాదని బిజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రకటించారు. ఈ కారణంగానే తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఉద్యమ బాటపట్టారు. స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్ అమలు చేయాలన్న నిర్ణయాన్ని కూడా ఎవ్వరూ న్యాయస్థానంలో సవాలు చేసి నిలుపుదల చేయకుండా ఉండటం కోసం ఈ విధానాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో పొందుపరచాలని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించింది. ఈ సందర్భంగా అసలు 9వ షెడ్యూలు అంటే ఏమిటి అనే అంశం చాలామందిలో ప్రశ్న తలెత్తుతుంది. భారత రాజ్యాంగానికి 1951లో తొలిగా చేసిన రాజ్యాంగ సవరణ ద్వారా ఈ తొమ్మిదో షెడ్యూల్ ఏర్పడింది. ప్రజలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలు లేదా కేంద్ర ప్రభుత్వం తీసుకొనే కీలకమైన నిర్ణయాలను తొమ్మిదో షెడ్యూల్లో పొందుపరిచే పక్షంలో ఆయా నిర్ణయాలపై ఎవరు కోర్టులో సవాల్ చేయకుండా రక్షణ కలుగుతుంది. దేశంలో తొలిసారిగా బిసిలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లను కల్పించే విధంగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం. తీసుకుంది. ఈ నిర్ణయాన్ని ఇతరులు అభ్యంతరం పెట్టకుండా ఉండాలంటే రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో కచ్చితంగా పొందుపరచాల్సి ఉంటుంది. అయినా కీలకమైన అంశాలను 9వ షెడ్యూల్లో పొందుపరచటం కొత్తేమీ కాదు. 9వ షెడ్యూల్ ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు 284 అంశాలను పొందుపర్చారు. అందులో ఎక్కువ భాగం అగ్ర వర్ణాలకు చెందిన వ్యవసాయ భూములకు సంబంధించిన మినహాయింపులు వంటి అంశాలు రక్షణ పొందుతున్నాయి. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని న్యాయస్థానాలు ఆంక్షలు విధించిన నేపథ్యంలో తమిళనాడులో బిసిలకు సంబంధించి 69 శాతం రిజర్వేషన్లు అమలు కావడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల విధానాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో పొందుపరచటం వల్లనే సాధ్యమైంది. లేదంటే 69శాతం రిజర్వేషన్లు అమలు కాకుండాచాలామంది న్యాయస్థానాలలో అడ్డుపుల్లలు వేసి ఉండేవారు. అయితే తెలంగాణ ప్రభుత్వం పంపిన బీసీ రిజర్వేషన్ విధానాన్ని 9షెడ్యూల్లో పొందుపర్చడం సాధ్యంకాదని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడానికి ముందే తెలంగాణ బిజెపి అధ్యక్షులు రామచంద్రరావు సాధ్యం కాదని ప్రకటించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. సహజంగా అత్యంత కీలకమైన బిసి






బిల్లు అంశాలలో ఒక రాష్ట్ర అధ్యక్షులు ఆ పార్టీ కేంద్రనాయకులతో సంప్రదించకుండా బిసి బిల్లు ఆమోదించడంసాధ్యం కాదని ప్రకటించే అవకాశం వుండదు. అందువల్ల రామచంద్రరావు ప్రకటనను బట్టి తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్ విధానాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో పొందుపరచడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని అర్థం అవుతోంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ బిసి వర్గానికి చెందినవారని, వెనుకబడిన తరగతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామంటూ నిత్యం బిసిల నామజపం చేసే బిజెపి నేతలు ఆచరణకు వచ్చేసరికి తమ అసలుబుద్ధి ప్రదర్శిస్తున్నారు. బిజెపి చరిత్ర గమనిస్తే అడుగడునా బిసిల పట్ల ద్వేషమే కనిపిస్తుంది. గతంలో మండల కమిషన్ సిఫార్సుల మేరకు విద్యా ఉద్యోగాలలో బిసిలకు 27శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు నాటి ప్రధాని వీపీ సింగ్ ప్రకటించినప్పుడు కూడా మండల సిఫార్సులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో బిజెపి తమ పార్టీ అనుబంధమైన విద్యార్థి సంస్థ అఖిలభారత విద్యార్థి పరిషత్ రూపంలో వ్యతిరేకించింది. ఎట్టకేలకు మండల్ కమిషన్ సిఫార్సులకు సుప్రీంకోర్టు ఆమోదం తెలపటం వల్ల ఆనాడు సమస్య పరిష్కారమైంది. బిసి కులాలను వర్గీకరణ చేయడం ద్వారా బిసిలలో అత్యంత వెనుకబడిన కులాలకు మేలు చేస్తామంటూ ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన జస్టిస్ రోహిణీ కమిషన్ దేశవ్యాప్తంగా పర్యటించి దేశంలో మొత్తం 3000 బిసి కులాలలో దాదాపు 90శాతం కులాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోక ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి వున్నాయని నివేదిక సమర్పించింది. ఆ నివేదిక సమర్పించి రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఆ నివేదిక ఊసే ఎత్తడం లేదు. తెలంగాణాలో ప్రతిపాదించిన స్థానిక సంస్థలలో42శాతం మండల కమిషన్ బిసిలకు కూడా ఎస్సీ ఎస్టీ వర్గాల మాదిరిగానే చట్టసభలలో రిజర్వేషన్ కల్పించాలని కూడా సూచన చేసింది. అయితే చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్ బిల్లు విషయంలో ఎంతో శ్రద్ధ వహించిన బిజెపి ప్రభుత్వం మహిళలకు కేటాయించిన సీట్లలో బిసి మహిళలకు కూడా రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్‌ను బిజెపి ఖాతరు చేయలేదు. ఈ స్థితిలో చట్టసభలలో బిసిలకు రిజర్వేషన్‌కల్పించాలన్న మండల కమిషన్ సిఫార్సులను బిజెపి అధికారంలో ఉన్నంతకాలం చట్టసభలలో బిసిలకురిజర్వేషన్ అమలు కాదని అర్థమవుతుంది. ఇదేసమయంలో ఆర్థికంగా కులాలకు ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని ఏ రాజకీయపార్టీ కోరలేదు, ఎవరూ ఉద్యమాలు చేయలేదు. కానీ కేంద్ర ప్రభుత్వం దేశంలో కనీసం 15శాతం కూడా లేని అగ్రకులాలు వారికి పేదరికం పేరుతో పదిశాతం రిజర్వేషన్లు అమలుచేస్తోంది. రిజర్వేషన్లు 50శాతం పెంచకూడదని సన్నాయి నొక్కులు నొక్కిన న్యాయస్థానాలు ఈ అంశంపై అభ్యంతరం చెప్పకపోగా ఆమోదం తెలిపాయి. సనాతన ధర్మం ప్రకారం బిసి కులాలకు చెందిన ప్రజలు అగ్ర వర్ణాలకు సేవలు చేయటం మినహా అగ్రవర్ణాలతో సమానంగా అధికారంలో పాలుపంచుకోవడం బిజెపికి ఇష్టం లేదనిపిస్తోంది. కావాలంటే మీకు ఉచితంగా బియ్యమో, గ్యాస్ బండో ఇస్తాం కానీ అధికారం ఎలా ఇస్తాం అనేది ధోరణి బిజెపి నాయకులలో కనిపిస్తోంది. •

# 35 మందుల ధరలు తగ్గింపు

### దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఊరట



**న్యూఢిల్లీ,ఆగస్టు 3:** దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కేంద్రం భారీ ఊరట కల్పించింది. దేశవ్యాప్తంగా 35 రకాల మందుల ధంలను తగ్గించింది. దేశ ప్రజలకు ప్రజలకు మందులను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో, జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీలు విక్రయిస్తున్న 35 ఔషధాల రిటైల్ ధరలను తగ్గించింది. ఈ ఒంటినొప్పులు, గుండె సంబంధిత, మధుమేహం, మానసిక వ్యాధుల చికిత్సకు ఉపయోగించే ఔషధాలపై తగ్గింపు వర్తించనున్నది. దాంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఊరట కలుగుతున్నది. రసాయనాలుఎరువుల మంత్రిత్వశాఖ ఈ ఉత్తర్వులను జారీ చేసింది. యేసిలోఫెనాక్, పారాసెటమాల్, ట్రిప్సిన్ కైమోట్రిప్సిన్ ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్, అమోక్సిసిలిన్‌పొటాషియం క్లావ్యులానేట్, అటోర్వాస్టాటిన్, ఎంపాగ్లిఫ్లోజిన్, సిటాగ్లిప్టిన్, మెట్‌ఫార్మిన్ వంటి మందులున్నాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ విక్రయించే యేసిలోఫెనాక్,పారాసెటమాల్, ట్రిప్సిన్ కైమోట్రిప్సిన్ మాత్రధరను రూ.13గా నిర్ణయించింది. క్యాడిలా ఫార్మాస్యూటికల్స్ విక్రయించే అదే ఫార్ములేషన్ ధరను 15.01గా పేర్కొంది. గుండె సంబంధిత వ్యాధులున్న వారు విస్తృతంగా వాడే మెడిసిన్ అయిన అటోర్వాస్టాటిన్ 40 క్లోపిడొగ్రెల్ 75 మాత్రల ధరలను రూ.25.61గా నిర్ణయించింది. చిన్నపిల్లలకు ఉపయోగించే సెఫిక్సిమ్, పారాసెటమాల్ ఓరల్ సస్పెన్షన్స్, విటామిన్ డీ లోపం ఉన్న వారిలో వాడే కోలికాల్సిఫెరాల్ డ్రాప్స్, డైక్లోఫెనాక్ ఇంజెక్షన్ ధర రూ.31.77కి తగ్గించింది. రిటైర్లు, డీలర్లు అందరూ మెడికల్ షాపుల్లో తాజా ధరల జాబితాను స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించింది. ఎక్కువకు ధరకు ఆయా మందులను విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఔషధ ధరల నియంత్రణ ఆర్డినెన్స్ 2013, ఎసెన్షియల్ కమెడిటీస్ యాక్ట్ 1955 ప్రకారం జరిమానాలు విధించనున్నట్లు తెలిపింది. ఆయా మెడిసిన్ల ధరలు మినహాయించామని అదనంగా జీఎస్టీని చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. ఔషధ తయారీ కంపెనీలు కొత్త ధరల జాబితాను ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అప్‌డేట్ చేసి ఎన్‌పీపీఏ, రాష్ట్రాల డ్రగ్ కంట్రోలర్స్‌కు సమర్పించాలని ఆదేశించింది. తాజా ఆదేశాలతో ఆయా ఔషధాలపై ఇప్పటికే ఉన్న ధరల ఉత్తర్వులు రద్దయినట్లు స్పష్టం చేసింది.

# ఇజ్రాయెల్ దాడిలో 18 మంది గాజా పౌరులు మృతి



**టెల్‌అవీవ్, ఆగస్టు 3:** గాజా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం ఇంకా కొనసాగుతోంది. యుద్ధంలో ఎంతోమంది అమాయకుల ప్రాణాలు పోతున్నా యుద్ధం మాత్రం ఇరు దేశాలు ఆపడం లేదు. తాజాగా గాజాపై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. ఈ దాడిలో 18 మంది సామాన్య ప్రజలు మరణించినట్లు అక్కడి వైద్య అధికారులు తెలిపారు. మృతుల్లో ఎనిమిది మంది సహాయ కేంద్రం వద్ద ఆహారం కోసం పడిగాపులు కాస్తూ ఇజ్రాయెల్ తూటాలకు బలైన వారే కావడం బాధాకరం.

మిగిలిన 10 మంది మధ్య, దక్షిణ గాజా ప్రాంతంలో ఇజ్రా యెల్ నిర్వహించిన వైమానిక దాడుల్లో మర ణించారు. శరణార్థుల కోసం గాజా హ్యూమాని టేరియన్ ఫౌండేషన్ (జిహెచ్‌ఎఫ్) సహాయ కేంద్రం నిర్వహిస్తున్నది. అయితే ఆహారం కోసం సహాయ కేంద్రం వద్దకు ఎక్కువ సంఖ్యలో జనాలు రావడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అదే సమయంలో ఇజ్రాయెల్ సేనలు కాల్పులు జరపడంతో అమాయక ప్రజలు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. అయితే తాము నిర్వహిస్తోన్న సహాయ కేంద్రాల వద్ద అలాంటిదేదీ జరగలేదని జిహెచ్‌ఎఫ్ పేర్కొంది. కాల్పులకు గుర్కై మరణించే అవకాశాలుండీ సహాయ కేంద్రాల వద్ద పెద్దసంఖ్యలో గాజా వాసులు గుమిగూడటం ఆ ప్రాంతంలో నెలకొన్న తీవ్ర క్షామ పరిస్థితులకు నిదర్శనమని అంతర్జాతీయ సంస్థలు అంటున్నాయి. మరోవైపు పౌష్టి కాహార లోపం కారణంగా ఏడుగురు పాలస్తీనీయులు గడచిన 24 గంటల్లో మరణించారని స్థానిక ఆరోగ్య శాఖ తెలిపింది.

జనవరిలో ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినప్పటికి ఇజ్రాయెల్ విరమణకు విరుద్ధంగా గాజాపై మళ్లీ దాడులకు తెగబడింది. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. గాజాబెల్ట్‌లో ఉన్న హమాస్ అనేది ఇజ్రాయెల్‌కు విరుద్ధంగా పోరాటం చేసే ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ. గాజాలో హమాస్ అధికారంలోకి రావడం, ఇజ్రాయెల్‌తో హింసాత్మక సంబంధాలను మరింత పెంచింది. హమాస్ తరచూ ఇజ్రాయెల్ మీద రాకెట్ దాడులు చేసింది. దీంతో తనని తాను రక్షించుకోవడానికి ఇజ్రాయెల్ తిరిగి గాజాపై దాడులు చేస్తోంది.

# వరదలతో వారణాసి, ప్రయాగరాజ్‌లు అతలాకుతలం



**వారణాసి,ఆగస్టు 3:** ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల కురిసిన వర్షాలతో వారణాసి, ప్రయాగ్‌రాజ్‌లో అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రస్తుతం పరిస్థితి చాలా దారుణంగాఉంది. వరదల తాకిడికి వారణాసి ప్రయాగ్‌రాజ్ అతలాకుతలం అయింది. పవిత్ర నగరాలైన వారణాసి, ప్రయాగ్‌రాజ్ వరదల తీవ్రతకు చిగురుటాకుల్లా వణుకుతున్నాయి. గంగా, యమునా నదులు ఉప్పొంగి పొర్లుతూ తీరప్రాంతాల్లోని జనజీవితాన్ని ముంచెత్తుతున్నాయి. రహదారులు జలమయమై, ఇళ్లలోకి నీరు ప్రవేశించి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రక్షణ బృందాలు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది పునరావాస పనుల్లో నిమగ్నమవుతున్నారు. నదుల ఉధృతి తగ్గకపోతే పరిస్థితి మరింత విషమించవచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు. వారణాసిలో గంగా నది ప్రమాద స్థాయిని దాటి అనేక ప్రాంతాల్లోకి నీరు చొచ్చుకొచ్చింది. ప్రయాగ్‌రాజ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నదీ జలాలు పెరిగి, నగరంలోని పలు ప్రాంతాలు నీటిలో మునిగాయి. రోడ్లన్నీ నీటితో నిండిపోవడంతో, ప్రజలు పడవల్లో ప్రయాణిస్తూ పలు ఇళ్లు, ఆఫీసులకు వెళ్తున్నారు. రోడ్డు మీద కారు కాదు, పడవల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రయాగ్‌రాజ్‌లోని కరేలా బాగ్ ప్రాంతంలో ఉదయం 8 గంటల నుంచే నీరు నిలిచిపోయింది. ససూర్ దేరీ నది ఉప్పొంగడంతో ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు తెలిపారు. ఇంకా వర్షం కూడా కురుస్తోందని, చాలా ఇబ్బందిగా ఉందన్నారు. ఉత్తరప్రదేశ్ మంత్రి స్వతంత్ర దేవ్ సింగ్ ఆదివారం హమీర్‌పూర్‌లో వరద ప్రభావిత ప్రాంతాలను హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు. వరదల వల్ల ఇళ్లు కోల్పోయిన వారి కోసం చేసిన ఏర్పాట్లను కూడా సమీక్షించారు. ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రయాగ్‌రాజ్‌లో స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ కోసం 20 వేల కోట్లు ఖర్చు చేసినా, నీటి నిల్వ తప్ప ఏం సాధించారని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. స్మార్ట్ సిటీ అనే ఆలోచనను నీళ్లలో కలిపేసిన బిజెపి వాళ్లు ఎక్కడికి పడవలు తీసుకొని పారిపోయారని తనదైన శైలిలో ప్రశ్నించారు. రాష్ట్రంలో మరో 24 గంటలపాటు ఈదురు గాలులతోకూడిన వర్షం కురిసే అవకాశం ఉందని ఐఎండి హెచ్చరించింది. లక్నో, వారణాసి, గోరఖ్‌పూర్, మో, బలియా, సోన్‌భద్ర, మీర్జాపూర్, జౌన్‌పూర్, ఘాజీపూర్, కుషీనగర్, సీతాపూర్, బరాబంకీ, బహ్రైచ్, గోండా, లఖింపూర్ ఖేరీ, మొరాదాబాద్ వంటి 55 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో బహ్రైచ్, బలరాంపూర్, లఖింపూర్ ఖేరీ, సీతాపూర్, గోండా, శ్రావస్తి లాంటి ఉత్తర జిల్లాల్లో కూడా వరద పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని ముందస్తు హెచ్చరికలు జారీచేసింది.

# అన్ని నేరాలకు షేక్ హసీనాయే మూలం

### బంగ్లాదేశ్ మాజీ పిఎంపై విచారణ మొదలు



**ఢాకా, ఆగస్టు 3:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మానవాళికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినట్లు 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్' (ఐసిటి) అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆదివారం ఆయా కేసుల్లో హసీనాపై విచారణను ప్రారంభించింది. తాత్కాలిక ప్రభుత్వం నియమించిన చీఫ్ ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం.. హసీనాను అన్ని నేరాలకు మూలకేంద్రంగా పేర్కొన్నారు. ఆమెకు గరిష్ఠ శిక్ష విధించాలన్నారు. ఈ కేసుల్లో మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్, మాజీ ఐజిపి చౌదరీ అబ్దుల్లా అల్ మామున్‌లు సహ నిందితులుగా ఉన్నారు. విద్యార్థుల ఆధ్వర్యంలో గత యేడాది జులై–ఆగస్టులో జరిగిన ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నాలు చేసినట్లు హసీనా ఆరోపణలు ఎదుర్కొంటు న్నారు. భారీ సంఖ్యలో ఉద్యమకారులను చంపించడం, హింసించడం వంటి నేరాభియోగాలను ఆమెపై మోపారు. వీటిపై ఐసిటి ఆదివారం విచారణ ప్రారంభించింది. హసీనా, అసదుజ్జమాన్ ఇప్పటికే దేశాన్ని వీడారు. మామున్ ఒక్కరే కస్టడీలో ఉన్నారు. ఈ కేసులో సాక్షిగా మారేందుకు ఆయన అంగీకరించినట్లు తెలుస్తోంది. నిరసనల సమయంలో గాయపడిన వ్యక్తులు, ప్రత్యక్షసాక్షుల నుంచి ఆధారాలు సమర్పిస్తామని ప్రాసిక్యూషన్ తెలిపింది. గత యేడాది రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని పదవి కోల్పోయి, దేశం వీడిన షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు హోంశాఖ మాజీ మంత్రి కూడా బంగ్లాదేశ్‌ను వీడారు. ఈ క్రమంలోనే స్థానికంగా నోబెల్ పురస్కార గ్రహీత యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. ఆయా కేసుల్లో విచారణ కోసం హసీనాను అప్పగించాలని భారత్‌ను అభ్యర్థిస్తోంది. ఇదిలా ఉండగా జూలై 10న హసీనా, కమల్, మామున్‌లపై ఐసిటి అభియోగాలు మోపింది. అంతకుముందు కోర్టు ధిక్కరణ కేసులో ఆమె ఆరు నెలల జైలు శిక్ష విధించింది.

# కాలువలోకి దూసుకెళ్లిన కారు: 11 మంది మృతి, మరో నలుగురికి గాయాలు



**గోండా(యూపి),ఆగస్టు 3:** ఉత్తరప్రదేశ్‌లో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భక్తులతో వెళుతున్న ఒక వాహనం అదుపుతప్పి కాలువలో పడటంతో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయ విదారక ఘటన యూపిలోని గోండా జిల్లాలో జరిగింది. ఈ ప్రమాదంలో మరో నలుగురు గాయపడ్డారు. మోతిగంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిహాగావ్ గ్రామానికి చెందిన 14 మంది ఒక బొలెరో వాహనంలో ఖర్గుపూర్‌లోని పృథ్వీనాథ్ ఆలయానికి పూజల కోసం బయలుదేరారు. మార్గమధ్యంలో వీరి వాహనం సరయూ కాలువలోకి దూసుకెళ్లింది. వాహనం నీటిలో మునిగిపోవడాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కొందరు గ్రామ పెద్దకు విషయం చేరవేశారు. సమాచారం అందుకున్న ఇటియాథోక్ పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నీటిలో మునిగిపోయిన వాహనం నుంచి మృతదేహాలను వెలికితీశారు. మృతులలో పురుషులు, మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. ఈ దుర్ఘటనపై జిల్లా ఎస్పీ వినీత్ జైస్వాల్ మాట్లాడుతూ, ఆలయానికి వెళుతుండగా బొలెరో వాహనం కాలువలో పడిపోవడంతో 11 మంది మరణించారు. స్వల్ప గాయాలతో బయటపడిన నలుగురిని రక్షించి జిల్లా ఆసుపత్రికి తరలించామని తెలిపారు. ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు తలా రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి పీఎంఎన్ఆర్‌ఎఫ్‌నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం అందిస్తామని ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



# తొలిరోజు జైలులో దీనంగా ప్రజ్వల్ రేవణ్ణ

**బెంగళూరు,ఆగస్టు 3:** మాజీ ప్రధాని దేవగౌడ మనవడు, మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు ప్రజాప్రతినిధుల కోర్టు శాశ్వత జైలు శిక్ష విధించిన నేపథ్యంలో అతడిని బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలుకు శనివారం పోలీసులు తరలించారు. అనంతరం అతడికి ఖైదీ నెంబర్ 15528ను కేటాయించారు. అయితే అతడు గత రాత్రి అంటే శనివారం రాత్రి చాలా విచారంతోపాటు కొంత ఒత్తిడితో కనిపించారని జైలు అధికారులు ఆదివారం తెలిపారు. ఇక శనివారం రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత ప్రజ్వల్ ఆరోగ్యాన్ని వైద్యులు పరీక్షించారని చెప్పారు. అతడి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వెల్లడించారన్నారు. వైద్యుల పరీక్షిస్తున్న సమయంలో సైతం అతడు ధీనంగా ఉన్నడని అలాగే తన బాధను వారికి వ్యక్తం చేశాడని చెప్పారు. మరోవైపు ప్రజా ప్రతినిధుల కోర్టు ఇచ్చిన తీర్పుపై తాను హైకోర్టుకు వెళ్తానని సిబ్బందికి తెలియజేసినట్లు తెలుస్తోంది. ఇంకోవైపు అతడిని భారీ భద్రత ఉన్న సెల్‌లో ఉంచామన్నారు.

# ధర్మస్థలిలో బయటపడుతున్న మరిన్ని మానవ అవశేషాలు

### బెల్తంగడి స్టేషన్‌లో మొత్తం రికార్డులు ధ్వంసం



**ధర్మస్థలి(కర్ణాటక),ఆగస్టు 3:** కర్ణాటకలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మస్థలంలో జరుగుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తవ్వకాలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. రెండు దశాబ్దాలుగా వందలాది మందిని హత్య చేసి పూడ్చిపెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో, అధికారులు తవ్విన కొద్దీ పుర్రెలు, మానవ ఎముకలు బయటపడటం తీవ్ర కలకలం రేపుతోంది. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే 2000–2005మధ్య సంభవించిన అసహజ మరణాల రికార్డులను ఒక పద్ధతిప్రకారం తొలగించినట్లు తేలింది. ఆర్టీఐ దరఖాస్తుతో మొత్తం వెలుగులోకి వచ్చింది. ఇదే అంశాన్ని ఆర్టీఐ కార్యకర్త జయంత్ సిట్‌కు ఫిర్యాదు చేసారు.తమ వద్ద ఉన్న పత్రాలు, రికార్డులు, రిపోర్టులు, వాల్‌పోస్టర్లు, నోటీసులు, ఫోటోగ్రాఫ్‌లు సాధారణపరిపాలన ఆదేశాలమేరకు నాశనంచేసినట్లు బెల్తంగడిపోలీసులు చెప్పారని జయంత్ ఫిర్యాదులో వివరించాడు. దీనితో మొత్తం సమగ్ర తవ్వకాల్లో ఒకచోట చిరిగిన ఎరుపు రంగు జాకెట్‌తో పాటు లక్ష్మి అనే మహిళకు చెందిన పాన్ కార్డు కూడా దొరకడం దర్యాప్తులో కీలక ఆధారంగా మారింది. ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే, నేడు జయన్ టి. అనే మరో సాక్షిముందుకొచ్చాడు. 15 ఏళ్ల క్రితం 15 ఏళ్ల బాలిక మృతదేహాన్ని రహస్యంగా పూడ్చిపెట్టడం తాను చూశానని ఆయన చెప్పడంతో సిట్ అధికారులు ఆ దిశగా కూడా దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, ఈ కేసులో మీడియా కవరేజీని నిలుపుదల చేస్తూ గతంలో జారీ అయిన గ్యాగ్ ఆర్డర్‌ను కర్ణాటక హైకోర్టు రద్దు చేసింది. 19952014 మధ్య కాలంలో ధర్మస్థల పరిసరాల్లో దాదాపు 250 మిస్సింగ్ కేసులు నమోదైనట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. 2013 నాటి సౌజన్య అనే విద్యార్థిని హత్య కేసు అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తాజా ఆరోపణల నేపథ్యంలో పాత కేసుల దస్త్రాలు మళ్లీ తెరుచు కుంటున్నాయి. ధర్మస్థల దేవాలయం శ్మశాన వాటికగా మారిపోయిందని సిపిఐ నేత నారాయణ తీవ్రంగా ఆరోపించారు. ఆలయ ట్రస్ట్ సభ్యులను వెంటనే అరెస్ట్ చేసి విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. సిట్ దర్యాప్తు ముమ్మరంగా సాగుతుండటంతో, ఈ హత్యల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనేది త్వరలోనే తెలుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## సంక్షిప్తంగా..

# కేరళలో 'రెండు రూపాయల డాక్టర్' ఇక లేరు




**తిరువనంతపురం, ఆగస్టు 3:** పేదల జీవితాల్లో వెలుగులు నింపిన నిస్వార్థ సేవకుడు. డాక్టర్ ఎకె రైరూగోపాల్ అలియాస్ 'రెండు రూపాయల డాక్టర్' ఆదివారం కన్నుమూసారు. ఉత్తర కేరళలోని కన్నూర్‌లో వేలాది మంది జీవితాల్లో నిస్వార్థ సేవ చేసిన డాక్టర్ గోపాల్ పేదలు, అణగారిన ప్రజలకు దశాబ్దాలుగా రెండు రూపాయలకే వైద్యం అందించారు. డాక్టర్ ఎకె రైరూ గోపాల్ 50 యేళ్లపాటు అతి తక్కువకే రూ. 2కే వైద్యం చేసేవారు. అందుకే ఆయనను అందరూ 'రెండు రూపాయల డాక్టర్.. రెండు రూపాయల డాక్టర్' అని పిలుస్తుంటారు. ఇతర డాక్టర్లు ఒక్క ఒపికి వందల్లో ఛార్జ్ చేస్తుంటే డాక్టర్ గోపాల్ మాత్రం పేషంట్ స్తోమతను బట్టి రూ. 40, రూ. 50 మాత్రమే తీసుకునేవారు. అలా వైద్యం ఖరీదైన తరుణంలో డాక్టర్ గోపాల్ మాత్రం వైద్యంలో దాతృత్వం, నీతికి చిహ్నంగా నిలిచారు. వైద్యుడిగా సేవలందిస్తుండగా.. ఓ రోగి దారుణమైన పరిస్థితిని చూసి చలించిపోయారు. అలా ఆయన ప్రయాణం స్వచ్ఛంద సేవతో ప్రారంభమైంది. నాటి నుంచి రోజువారి దినసరి కూలీలు, విద్యార్థులకు, పేదలకు అందుబాటులో సరసమైన వైద్యాన్ని అందించేందుక తనను తాను అంకితం చేసుకున్నారు.

# ఓటరు సరళిని మార్చేందుకు ఎన్నికల సంఘం కుట్రలు

### కేంద్ర మాజీ మంత్రి చిదంబరం ధ్వజం



**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** రాష్ట్రాల ఎన్నికల నిర్మాణం, ఓటరు సరళిని మార్చేందుకు ఈసీ ప్రయత్నిస్తోందని ఇది అధికార దుర్వినియోగం అవుతుందని కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ఆరోపించారు. దీన్ని రాజకీయంగా, చట్టబద్ధంగా వ్యతిరేకించాలన్నారు. బీహార్‌లో 65లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కునే కోల్పోయే ప్రమాదం ఉందని తమిళనాడులో 6.5లక్షల మంది ఓటర్లు పెరగడం ఆందోళనకరమైన చర్యఅని, చట్టవిరుద్ధమని సోషల్ మీడి యా పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రజలు శాశ్వ తంగా వలస వచ్చా రని చెప్పడం వలన కార్మికులను అవమానించడమేనని తమిళనాడు ప్రజలు ప్రతినిధులను ఎన్నుకునే హక్కులో ప్రత్యక్ష జోక్యమన్నారు. ఛత్‌పూజ వంటి పండుగల సమయాల్లో వసల కార్మికులు తమ సొంత రాష్ట్రానికి తిరిగి రాగలిగినప్పుడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో తిరిగి రాలేరా అన్న ప్రశ్నను ఆయన లేవనెత్తారు.



# రష్యాలో బద్దలైన అగ్నిపర్వతం

### పరుగులు తీసిన ప్రజానీకం

**మాస్కో,ఆగస్టు 3:** రష్యాలో ప్రకృతి ప్రకోపం కొనసాగుతోంది. ఒకవైపు భారీ భూకంపం, మరోవైపు అగ్నిపర్వతాల విస్ఫోటనంతో అటుడుకుతోంది. ఆదివారం కురిల్ దీవుల్లో శక్తివంతమైన భూకంపం సంభవించగా, సమీపంలోని కమ్చట్కా ద్వీపకల్పంలో అగ్నిపర్వతాలు లావాను వెదజల్లుతున్నాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.0గా నమోదైనట్లు యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే, జపాన్ వాతావరణ శాఖ ధృవీకరించాయి. భూకంపం ధాటికి భవనాలు తీవ్రంగా కంపించడంతో, ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. దీని తీవ్రత దృష్ట్యా రష్యా అత్యవసర సేవల మంత్రిత్వ శాఖ కొన్ని ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలను జారీ చేసింది. ఇప్పటివరకు ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. దాదాపు 600 సంవత్సరాలుగానిద్రాణంగా ఉన్న క్రాషెన్నినికోవ్ అగ్నిపర్వతం ఒక్కసారిగా విస్ఫోటనం చెందింది. ఈ విస్ఫోటనంతో సుమారు 6,000 మీటర్ల ఎత్తు వరకు బూడిద ఎగసిపడినట్లు రష్యా అధికారులు తెలిపారు. దీనితో పాటు, అత్యంత చురుగ్గా ఉండే క్ల్యుచెస్కో అగ్నిపర్వతం కూడా బద్దలైనట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# అమెరికా జైలులో తెలుగు యువకుడి ఆత్మహత్య



**ఎడ్మండ్ (యుఎస్ఎ), ఆగస్టు 3:** అత్యాచారం కేసులో అమెరికా జైలు లో శిక్ష అనుభవిస్తున్న తెలుగు యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ముగ్గురు బాలికలపై అత్యాచారానికి పాల్పడిన కేసులో జైలులో ఉన్న జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం నెల్లుట్లకు చెందిన కుర్రె ముల సాయికుమార్ (31) జులై 26న కారాగారంలోనే ఆత్మ హత్య చేసుకున్నాడు. నెల్లుట్లకు చెందిన ఉప్పలయ్య, శోభ దంపతుల కుమా రుడు సాయికుమార్ పదేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. అక్కడే ఉద్యోగం చేస్తూ ఒక్లహామా రాష్ట్రంలోని ఎడ్మండ్‌లో భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో 15 ఏళ్ల బాలుడిగా నటిస్తూ ముగ్గురు బాలికలపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అలాగే తనతో శారీరక సంబం ధానికి అంగీకరించని మరో 19 మంది బాలికల అసభ్య చిత్రాలను సోషల్ మీడియాలో పోస్టు చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితులు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు 2023 అక్టోబర్‌లో సాయికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులదర్యాప్తులో సాయి కుమార్‌పై ఆరోపణలు నిజమేనని తేలింది. ఈ కేసులో దోషిగా తేలిన అతనికి ఈ ఏడాది మార్చి 27న అమెరికా కోర్టు 35 ఏళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో మానసిక వేదనకు గురైన సాయికుమార్ గతనెల 26న జైలులోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో అతని కుటుంబసభ్యులు అమెరికాకు వెళ్లి, అక్కడే అంత్యక్రియలు పూర్తి చేసినట్లు సమాచారం.

# ఆలయదర్శనానికి వెళుతూ నలుగురు వృద్ధులు దుర్మరణం




**న్యూయార్క్,ఆగస్టు 3:**అమెరికాలో నాలుగు రోజుల కిందట అదృశ్యమైన భారత సంతతికి చెందిన కుటుంబం కథ విషాదంతమయ్యింది. గతనెల 29న ఓ ఆధ్యాత్మిక కేంద్రానికి వెళ్తూ వీరు కనిపించకుండాపోయారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైలోయలోకి దూసుకెళ్లినట్టు గుర్తించారు. న్యూయార్క్‌లో నివాసం ఉండే భారత సంతతికి చెందిన ఆశా దివాన్ (85),కిషోర్ దివాన్ (89), శైలేష్ దివాన్ (86), గీతాదివాన్(84)లు వెస్ట్ వెర్జీనియాలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం ప్రభుపాద ప్యాలెస్ ఆఫ్‌గోల్డ్‌కు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమా దంలో మృత్యువాతపడ్డారు. శనివారం రాత్రి నలుగురు వృద్ధుల మృతదేహాలను గుర్తించినట్టు మార్షల్ కౌంటీ షెరీఫ్ మైక్ డౌగర్టీ ఆదివారం వెల్లడించారు.

# లేట్‌నైట్ పార్టీలకు వెళ్లొద్దంటూ పోస్టర్ల కలకలం




**అహ్మదాబాద్, ఆగస్టు 3:** లేట్ నైట్ పార్టీలకు హాజరు కావద్దని, అలా వెళ్తే, రేప్ లేదా గ్యాంగ్ రేప్‌కు గురయ్యే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తూ కొన్ని పోస్టర్లు అహ్మదాబాద్ నగరంలో దర్శనమిచ్చాయి. మరికొన్ని పోస్టర్లలో నిర్జన ప్రాంతాల్లోకి మీ స్నేహితునితో కలిసి వెళ్లకండి, అలా వెళ్లేవారిపై రేప్ లేదా గ్యాంగ్ రేప్ జరిగితే అన్న హెచ్చరికలు కనిపించాయి. ఈ పోస్టర్లను అహ్మదాబాద్ నగర ట్రాఫిక్ పోలీసులు స్పాన్సర్ చేసినట్లు వార్తలు రావడంతో బీజేపీ పాలిత గుజరాత్‌లోని ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీంతో వీటిని తొలగించారు. దీనిపై ట్రాఫిక్ విభాగం డీసీపీ (వెస్ట్) నీతా దేశాయ్ మాట్లాడుతూ, తాము రోడ్డు భద్రతకు సంబంధించిన పోస్టర్లను మాత్రమే స్పాన్సర్ చేశామని, మహిళల భద్రతపై కాదని చెప్పారు. ట్రాఫిక్ పోలీసుల అనుమతి లేకుండా సతర్క గ్రూప్ అనే ఎన్‌జీవో ఈ వివాదాస్పద పోస్టర్లను తయారు చేసిందన్నారు. దీనిపై ఆమ్ ఆద్మీ పార్టీ స్పందిస్తూ గడచిన మూడేండ్లలో రాష్ట్రంలో 6,500 రేప్‌లు, 36 గ్యాంగ్ రేప్‌లు జరిగాయని ధ్వజమెత్తింది.

# భారీ వర్షాలతో ముందుగానే ముగిసిన అమర్‌నాథ్ యాత్ర!



**రుద్రప్రయాగ్, ఆగస్టు 3:** ప్రతియేటా అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగే అమర్‌నాథ్ యాత్ర ఈ ఏడాది అనుకున్న దానికంటే ముందుగానే ముగిసింది. ప్రతికూల వాతావరణం, భారీ వర్షాల కారణంగా యాత్రా మార్గాలు తీవ్రంగా దెబ్బతినడంతో, యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని యాత్రను నిలిపివేస్తున్నట్లు జమ్మూకశ్మీర్ అధికార యంత్రాంగం ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 9న రక్షాబంధన్ రోజున ముగియాల్సిన యాత్రను, ఆగస్టు 3 నుంచే నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది.

# 'గృహాజ్యోతి'కి సాంకేతిక ఇబ్బందులు

## వెబ్‌సైట్‌లో ఓపెన్‌కాని గ్యాస్ ఆప్షన్!

### కొత్త రేషన్‌కార్డుదారుల ఉత్సాహంపై నీళ్లు

### రాష్ట్రంలో ఏకకాలంలో

### 5.61 లక్షల కొత్తరేషన్‌కార్డులు మంజూరు

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** తెల్లరేషన్‌కార్డులు కొత్తగా పొందినవారు గృహజ్యోతి, రాయితీగ్యాస్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఉత్సాహ పడుతున్నా వెబ్‌సైట్‌లో గ్యాస్ ఆప్షన్ ఓపెన్ కాకపోవడంతో దిగాలు పడుతు న్నారు. గృహజ్యోతితో జీరో బిల్లు పొందాలనుకొనే వారికి కూడా సాంకేతిక ˆపరమైన ఇబ్బందులు తలెత్తున్నాయి. తెల్ల రేషన్‌కార్డులు కొత్తగా పొందిన వారికి ఉచిత విద్యుత్తు, రాయితీపై గ్యాస్ సిలిండర్ తదితర సంక్షేమ పథకాలు వర్తించనున్నాయి.కొత్త రేషన్‌కార్డుల జారీతో జిల్లాలో గృహజ్యోతి లబ్దిదారుల సంఖ్య పెరగనుంది.ఈ పథకం నిరుపేదలు, బలహీనవర్గాల ప్రజలకు వరంగా మారింది. ప్రభుత్వం నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించుకున్న వారికి జీరో బిల్లు ఇస్తున్నారు. పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం తాజాగా అవకాశం కల్పించింది. పదేళ్లుగా రేషన్‌కార్డులు మంజూరు కాకపోవడంతో అర్హతలు ఉన్నప్పటికి ప్రభుత్వంలో వివిధ పథకాలకు చాలా మంది అర్హులు దూరమయ్యారు. ప్రస్తుతం రేషన్‌కార్డులు మంజూరు చేయడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. వీరితోపాటు గతంలో రేషన్‌కార్డులు కలిగి ఉండి పథకాలు పొందనివారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు దరఖాస్తుల స్వీకరణకు మున్సిపల్ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

తెలంగాణ వ్యాప్తంగా నూతనంగా 5.61లక్ష రేషన్ కార్డులను అందజేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా పలు పథకాలను అమలుచేస్తోంది. వీటిలో ముఖ్యంగా మహాలక్ష్మి ృ పథకంలో భాగంగా రూ.500లకే వంటగ్యాస్, గృహజ్యోతిలో 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు వంటి వాటికి రేషన్‌కార్డులు తప్పనిసరి చేసింది. దీంతో కార్డులేని కుటుంబాలు పథకాలు పొందలేకపోయారు. ప్రభుత్వ నిర్ణయంతో ఈ సమస్య తీరనుంది.గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన మండల పరిషత్తు కార్యాలయాల్లో,పట్టణాల్లోని లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయాల్లో సం ప్రదించాలి. రాయితీ గ్యాస్ కోసం లబ్ధిదారులు తమ ఆధార్‌కార్డు, తెల్లరేషన్ కార్డు జిరాక్స్ కాపీలతోపాటు గ్యాస్ కనెక్షన్ ధ్రువీకరణ పత్రాలు కౌంటర్లతో సమర్పించాలి. ప్రస్తుతం వెబ్‌సైట్లో రాయితీ గ్యాస్ ఆప్షన్ ఓపెన్ కావడం లేదని గృహజ్యోతి పథకం ఆప్షన్ మాత్రమే సెలక్ట్ అవుతుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం కొత్తగా తెల్లరేషన్ కార్డులు అందజేస్తుండగా ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యా యలంలో ప్రభుత్వం నమోదుకు ఆదేశాలు జారీ చేస్తే జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో గృహజ్యోతి లబ్ధిదారులు పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే లబ్ధిదారులకు అవకాశం కల్పిస్తామని విద్యుత్తు అధికారులు కు తెలిపారు.



ఆదివారం బిఆర్‌కె భవన్‌లో ఏర్పాటైన పోలీసు కంప్లయింట్ అథారిటీని ప్రారంభిస్తున్న విశ్రాంత జడ్జి జస్టిస్ శివశంకర్‌రావు

## రాష్ట్ర పోలీసు కంప్లయింట్ అథారిటీ ప్రారంభం

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పోలీసు అధికారులపై వచ్చే ఫిర్యాదులపై చర్యలు తీసుకునేందుకు ఎట్టకేలకు పోలీసు కంప్లయింట్ అథా రిటీ ఏర్పాటయింది. బిఆర్‌కె భవన్‌లో ఇంతకు ముందు కాళేశ్వరం కమిటీ కార్యాలయం వున్న ఛాంబర్‌లో ఏర్పాటయిన పోలీసు కంప్లయింట్ అథారిటీని ఛైర్మన్‌గా నియమితులైన విశ్రాంత జడ్జి జస్టిస్ శివశంకర్‌రావు ఆదివారం ప్రారంభించారు. డిఎస్‌పి అంతకు పైస్థాయి అధికారులపై వచ్చే ఫిర్యాదులను ఈ విభాగం స్వతంత్రంగా విచారిస్తుందని ఈ సందర్భంగా జస్టిస్ శివశంకర్‌రావు తెలిపారు. పోలీసు కంప్లయింట్ అథారిటి ప్ర జలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. పోలీసు అధికారులపై వచ్చే ఫిర్యాదులను తమ సంస్థ నిస్పక్షపాతంగా విచారించి తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీసు కంప్లయింట్ అథారిటి ఎంతో కీలకమైనదని ఆయన వెల్లడించారు. ఇటువంటి విభాగాల వల్ల ప్రజలకు ప్రభుత్వంపై, ప్రజా స్వామ్యంపై మరింత నమ్మకం కలుగుతుందని ఆయన తెలిపారు. పోలీసు అధికారులు తప్పిదాలకు, అక్రమాలకు పాల్పడితే ప్రజలు ధైర్యంగా ముం దుకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదిదారుల వివరాలను గోప్యంగా వుంచుతామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పోలీసు కంప్ల యింట్ అథారిటిలో సభ్యులుగా వున్న విశ్రాంత ఐజి ప్రమోద్ కుమార్, విశ్రాంత జిల్లాజడ్జి వర్నే వెంకటేశ్వర్లు, వై.అరవింద్‌రెడ్డి, రాంనరసింహా రెడ్డి, రాజేందర్, శాంతిభద్రతల ఎఐజి రమణకుమార్ కూడా పాల్గొన్నారు.

## పదోన్నతుల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు

# న్యాయం చేయాలి

### 'సెటా' అసోసియేషన్ విజప్తి

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉపాధ్యాయులకి పదోన్నతులు కల్పిస్తున్న నేపథ్యంలో స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జిటిలకి న్యాయం చేయాలని స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (సెటా) రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాజేంద్రప్రసాద్ ప్రధాన కార్యదర్శి అట్ల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పదోన్నతుల్లో ఎస్‌జిటి స్పెషల్ ఎడ్యుకేషన్ వారికి అవకాశం కల్పించాలన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పిఆర్‌టియు తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులుగా స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ గత సంవత్సర కాలంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నప్పటికీ జాబ్ చార్ట్ ప్రభుత్వము విడుదల చేయటంలో జాప్యం జరుగుచున్నదని రాజేంద్రప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పదోన్నతులలో దాదాపుగా 50 శాతం పైగా పాఠశాలలో ఖాళీగా ఉన్న దృష్ట్యా ప్రస్తుతం పని చేస్తున్న ఎస్‌జిటి స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు కనీస సర్వీసును మినహాయింపు చేస్తూ పదోన్నతుల సీనియార్టీ లిస్టులలో చేర్చుటకు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని పిఆర్‌టియు తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు గాల్‌రెడ్డి హార్షవర్ధన్‌రెడ్డికి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జిటిలకి న్యాయం చేసేలా చూడాలని కోరారు.

## కాంప్లెక్స్‌కు యూరియా లింక్

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని ఈ రెంటికీ కంపెనీలు లింక్ పెడుతున్నారు. అంతే కాకుండా ఎరువుల విక్రయాల్లో కొత్త కొత్త నిబంధనలు తీసుకొస్తూ రైతులపై భారం మోపుతుండటంతో ఇక వాటిని అడ్డం పెట్టుకుని కొందరు వ్యాపారులు రైతులపై అదనపు భారాలు మోపుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. రవాణా చార్జీలు ప్రయివేటు డీలర్లపై రవాణా చార్జీలు పడుతుం డటంతో ఆ భారాన్ని వారు రైతులపై వేస్తున్నారు. మరోవైపు లింకు ఎరువుల పరిమాణం పెంపుతోనూ సతమతం అవుతున్నారు. దీనిలో భాగంగా ద్రవ రూపంలో ఉండే నానో యూరియా, డీఏపీల వాడకాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నాయి.

రూ.6 లక్షల విలువైన కాంప్లెక్స్ ఎరువులు విక్రయిస్తేనే రూ.లక్ష యూరియా సరఫరా చేస్తామని షరతు పెడుతున్నట్లు తెలుస్తోంది. మరోపక్క రవాణా చార్జీల భారాన్ని వేస్తున్నాయి. ఫలితంగా డీలర్లు బస్తా ఎరువుపై రూ.30కు పైగా అదనపు చార్జీని రైతుల నుంచి వసూలు చేస్తుండటం వివాదాస్పదమవుతోంది.

## జడ్చర్లలో నకిలీ ఆటోమొబైల్ పరికరాల గుర్తింపు

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** నకిలీ ఆటోమొబైల్ పరికరాలను విక్రయి స్తూ వాహనదారులను మోసగిస్తున్న అక్రమార్కుడిని ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జడ్చర్లలోని బాబా రాందేవ్ ఆటోమొబైల్ దుకా ణంలో పలు బ్రాండ్ల వస్తువులను లేబుల్ స్టిక్కర్లతో కొంతకాలంగా అమ్మకాలు చేపడుతున్నాడు. హీరో, షైన్, యూనికాన్, బజాజ్, తదితర వాహనాల స్పేర్‌పార్ట్‌లు విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇన్‌స్పెక్టర్, సిబ్బంది తనిఖీలకు వెళ్లి గోదాంను పరిశీలించగా పెద్ద ఎత్తున నకిలీ విడిభాగాలు బయటపడ్డాయి. సుమారు 3.50లక్షల విలువ ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు సైతం తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుజరాత్ రాష్ట్రానికి చెందిన జై ఇండస్ట్రీస్ సాయి జెన్యూన్ పార్ట్స్ బిల్లులను దిగుమతి చేసుకొని కలాపాలు సాగిస్తున్నారని గుర్తించారు.



## విద్యార్థుల సమస్యలు పరిష్కరించే దాకా పోరాడుతాం

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 3, ప్రభాతవార్త:** హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్య క్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బీసీ యువజన సంఘం అధ్యక్షుడు జి.అంజిల ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్టళ్లు, గురు కులాలకు స్వంత భవనాలు నిర్మించాలని, అద్దె బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో విద్యార్థులతో కలసి భారీ ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ మన రాష్ట్రంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గత 27 యేళ్లుగా నిర్వహిస్తున్న బీసీ హాస్ట ళ్లల్లో ఒక్క దానికి కూడా స్వంత భవనం లేక పోవటం అన్యాయమన్నారు. మంత్రుల కోసం ఇళ్లు కట్టిస్తారు, మంత్రులు కారుల్లో తిరిగేందుకు ప్లైఓవర్స్ నిర్మిస్తారు, కానీ బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు చదువుకునే హాస్టల్ భవనాలు నిర్మాణం చేయటానికి మాత్రం నిధులు లేవా అని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను వేలం వేసి, అమ్మా లని ప్రభుత్వం చూస్తోందని, ఈ ఆలోచనను తక్షణమే విరమించుకొని, ఆ భూములలో హాస్టళ్లు, గురుకులాలకు స్వంత భవనాలు కట్టాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థుల వ్యక్తిగత ఖర్చుల నిమిత్తం బాలికలకు 1,000 రూపాయలు, బాలురకు 800 రూపా యలు పాకెట్ మనీ మంజూరు చేయాలని, ప్రతి హాస్టల్‌లో విద్యార్థుల అవస రాలను బట్టి కంప్యూటర్‌లు ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నమ్మకం ఉందని, త్వరలోనే హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ధర్నా కార్యక్రమంలో నాయకులు శివ, పగిళ్ల సతీష్, అనంతయ్య, రాజేందర్, జి.మల్లేష్‌యాదవ్, పృధ్వీగౌడ్, రవికుమార్ యాదవ్, మణికంఠ, నిఖిల్, ఆశిష్‌గౌడ్, వివిధ ప్రాంతాల నుండి భారీగా తరలి వచ్చిన హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం

# బిజెపి ఎంపిలు రాజీనామా చేయాలి

### రేపు ఇందిరాపార్కు వద్ద మహాధర్నా

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపిలు పార్లమెంటులో ఒత్తిడి చేయాలని.. లేకపోతే తమ పదవు లకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5న ఇందిరాపార్కు దగ్గర మహాధర్నాను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో కులగణన జరిపి దాని ఆధారంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు జరపడానికి అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపిస్తే, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బిసిల రిజర్వేషన్లలను అడ్డుకుంటుందని జాన్ వెస్లీ విమర్శించారు. రాష్ట్ర సర్కార్ ఆర్డినెన్స్ తీసుకొచ్చి గవర్నర్‌కు పంపిస్తే .. గవర్నర్ కూడా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. దాంతో స్థానిక సంస్థల ఎన్నికలు కాలయాపన జరుపుతూ, కేంద్రం నుండి గ్రామ పంచాయితీలకు రావాల్సిన నిధులు కూడా రాకుండా బిజెపి ఆటంకం కలిగిస్తుందన్నారు. అసెం బ్లీ సమావేశాల్లో అన్ని పార్టీలు మద్ధతు ఇచ్చాయని... బిజెపి మాత్రం బిసి రిజర్వేషన్లలో ముస్లిం లను తొలగించాలనే కుటిల డిమాండ్‌ను తీసు కొస్తుందన్నారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజ స్థాన్ బిజెపి పాలిత రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వే షన్లు అమలు చేస్తూ, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం అమలు చేయకూడదని చెప్పి అడ్డుపడు తుందని జాన్‌వెస్లీ విమ ర్శించారు. ఈ అంశంపై సామాజిక న్యాయం కోరే శక్తులన్నీ ఆలోచిం చాలన్నారు.

ముస్లింలలో దూదేకుల, అత్తర్‌సాహెబ్‌లు, రాళ్లు కొట్టుకుని బతికేవాళ్లు, పకీర్లు లాంటి చిన్నచిన్న వృత్తులవారు, కూలి చేసుకుంటున్న వారికి బిసి రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయన్నారు. డబ్బున్న ధనిక వర్గాలకు కాదని.. హిందూ బిసిలకు రిజర్వేషన్లు అమలు చేసి, ఇస్లాం స్వీకరించిన బిసిలకు రిజర్వేషన్లు ఉండకూడదన్నది ఎట్లాంటి న్యాయమని ప్రశ్నించారు. ఇదెట్లా సామాజిక న్యాయం అవుతుందన్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైందన్నారు. ప్రభుత్వరంగాన్ని ప్రయివేటుపరం చేస్తూ రిజర్వేషన్లను, రాజ్యాంగాన్ని నిరుపయోగంగా చేస్తుందన్నారు. బిసిలకు అనుకూలంగా ఉంటామని, రిజర్వేషన్లను బిజెపి ఎంపిలైన బండి సంజయ్, కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎనిమిది మంది బిజెపి ఎంపిలున్నారని .. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు జరపడానికి కేంద్రం మీద ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అది చేయకుండా రిజర్వేషన్లకు అడ్డుపడే చర్యలకు కేంద్రంలోని బిజెపి అడ్డు పడుతోందన్నారు. రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపిలు పార్లమెంటులో రిజర్వేషన్లకు అనుకూలంగా వ్యవహరించకపోతే వారి రాజీనామాకు ఒత్తిడి చేస్తూ ఆందోళనా కార్యక్రమాలకు చేయాల్సి వస్తుందని జాన్ వెస్లీ హెచ్చరించారు. సిపిఎం ఆధ్వర్యంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఆందోళనా కార్యక్రమాలను నిర్వ హిస్తుందని.. పార్లమెంటులో బిల్లును ఆమోదించి చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న ఇందిరాపార్కు దగ్గర మహాధర్నాను నిర్వహి స్తున్నట్టు తెలిపారు.

## రాష్ట్ర శిశు హక్కుల కమిషన్‌తో దివ్యాంగుల అభివృద్ధి బృందం భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** బౌద్ధిక, అభివృద్ధిపరమైన దివ్యాంగుల రంగంలో దేశస్థాయి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి ఒక నిపుణులు బృందం రాష్ట్ర శిశు హక్కుల సంరక్షణ కమిషన్‌ను ఆదివారం మర్యాద పూర్వకంగా కలి సింది. ఈ బృదం పునరావాసం, విద్య, దివ్యాం గుల శక్తికి అంకితమైన ఈ నిపుణుల బృందం, కమిషన్ ఛైర్‌పర్సన్ సీత దయాకర్ రెడ్డి, కమిషన్ సభ్యులు వందనగౌడ్, అపర్ణ, చందన, సరితతో కలిసి ముచ్చటించింది ఈ సమావేశంలో వికలాంగ పిల్లల హక్కుల పరిరక్షణ, ప్రోత్సా హంపై కమిషన్ చేస్తున్న కృషిలో భాగస్వామ్యం కావాలన్న ఆసక్తిని బృందం వ్యక్తం చేసింది.పిల్లల పునరావాసం, సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్న కార్యక్రమాలలో తమ సహకారాన్ని అందిం చేందుకు వారు సిద్ధమన్నారు. ఛైర్‌పర్సన్, సభ్యులు, బాల హక్కుల పరిరక్షణ, పునరావాసం, సమగ్ర అభివృద్ధి కోసం ఈ నిపుణులు జాతీయ స్థాయిలో అందిస్తున్న విలువైన సేవలను ప్రశంసించి అభినందించారు.ప్రతిపిల్లవాడు సమా నంగా అభివృద్ధి చెందడానికి న్యాయమైన అవకా శాలను పొందేందుకు రాష్ట్రంలో ఇలాంటి జాతీయ స్థాయి సంస్థలతో సహకారాన్ని కొనసాగిం చాలన్న దృఢ సంకల్పాన్ని కమిషన్ వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో బృందం సభ్యులు శిల్పమణగోమ, కనివన్నన్, దత్తాత్రేయ, మమత అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రియుడి కోసం భర్తను హత్య చేసిన భార్య

### యేడాది తరువాత ఫోన్ సిగ్నల్‌తో వీడిన మిస్టరీ

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** కొంతకాలంగా భర్తలను భార్యలు హత్య చేస్తున్న ఉదంతాలు పెరుగుతుండడం తెలిసిందే. ఈ తరహా హత్య ల్లో స్వల్ప వ్యవధిలోనే నిందితులను పోలీసులు అరెస్టు చేస్తున్నారు. అయితే దేశ రాజధాని ఢిల్లీలో ప్రియుడి కోసం ఓ మహిళ తాళి కట్టిన భర్తను హత్య చేయగా ఏడాది తరువాత ఫోన్ సిగ్నల్ కారణంగా ఈ హత్యోదంతం వెలుగుచూసింది. దీంతో పోలీసులు నిందితులను కటకటాల్లోకి నెట్టారు. వివరాలు ఇలావున్నాయి. ఢిల్లీలోని అలీపూర్‌కు చెందిన ప్రీతం ప్రకాష్ (42) ఒక రౌడీషీటర్. అతడిపై మాదకద్రవ్యాలు, ఆయుధాల చట్టం సహా ఇ తర కేసులు పదికిపైగా వున్నాయి. ఇతనికి భార్య సోనియా (38)తో పాటు ఇద్దరు పిల్లలు వున్నారు. అయితే కొన్నేళ్లుగా సోనియా హరియాణాలోని సోనిపట్‌కు చెందిన రోహిత్ (40) అనే మరో నేరగాడితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్త తరచూ జైలుకు వెళుతుండడం, పోలీసు కేసుల్లో అరెస్టవుతుండడంతో సోనియా భర్తను శాశ్వతంగా దూరం చేయాలనుకుంది. ఇందులో భాగంగా 2024 జూలై ఐదవ తేదీన భర్త ప్రీతంతో సోనియా గొడవ పడింది. అదే రోజు రాత్రి నిద్ర పోయిన ప్రీతంను సోనియా బంధువు అయిన విజయ్ సహకారంతో తలపై ఇనుపరాడ్‌తో కొట్టి చంపేసింది. దీని తరువాత భర్త శవాన్ని ప్రియుడు రోహిత్‌తో కలిసి సమీపంలోని అగ్వాన్‌పూర్ డ్రైనేజిలో పడవేశారు. ఈ తతంగాన్ని నిందితులు వీడియో తీశా రు. ఇక భర్తను హత్య చేసిన తరువాత సోనియా గత ఏడాది జూలై 20వ తేదీన అలీపూర్ పోలీసు స్టేషన్‌లో తన భర్త కనిపించడం లేదని అమా యకంగా నటించి ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు. అయితే నెలలు గడిచినా ప్రీతంకు సంబంధి ంచిన ఎలాంటి ఆధారాలు లభించక పోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది.

ఈ కేసును మూసివేయాలని అనుకుంటున్న దశలో ఏడాది త రువాత అంటే జూలై మూడవ వారంలో ప్రీతం మొబైల్ నంబర్ సోనిపట్‌లో యాక్టివ్ అయినట్లు పోలీసులు గుర్తించారు. ప్రీతం ఫోన్ సోనియా ప్రి యుడు రోహిత్ వద్ద వుండడంతో అతన్ని అనుమానించి విచారించగా మొత్తం బండారం రట్టయ్యింది. తాను సోనియా ప్రియుడినని, ఆమె భర్తను హత్య చేశామని, శవాన్ని డ్రైనేజిలో పడవేసినట్లు రోహిత్ పోలీసులకు తెలిపాడు. ప్రీతం హత్యకు సోనియా నాలుగున్నర లక్షల రూపాయలను ఇచ్చి ందని, ఈ డబ్బులు ఇంట్లో ప్రీతంకు సంబంధించిన ఆటోను అమ్మితే వచ్చిందని రోహిత్ పోలీసులకు తెలిపాడు. ప్రీతం హత్య తరువాత అతని ఫోన్‌ను సోనియా తనకు ఇచ్చి కొంతకాలం స్విచ్ ఆఫ్ చేయమని చెప్పిందని, ఏడాది తరువాత తాను దీనిని ఆన్ చేశానని రోహిత్ తెలిపాడు.

కాగా ప్రీతం శవాన్ని అంతకు ముందు ఢిల్లీ పోలీసులు గుర్తు తెలియని శవాంగా గుర్తించి పోస్టుమార్టం చేయించి అనాథ శవంగా అంత్య క్రియలు నిర్వహి ంచారు. అయితే ఫోరెన్సిక్ లాబ్‌లో వున్న కొన్ని అవయవాల నమూనాలకు డిఎన్ఎ పరీక్ష చేయించగా ఈ మృతదేహం ప్రీతందేనని తేలింది. కాగా ప్రీతం హత్య కేసులో ప్రధాన నిందితుడు విజయ్ పరారీలో వుండగా ఇతర నిందితులు సోనియా, రోహిత్‌లను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. రో హిత్‌పై హత్య, ఆయుధాల చట్టం సహా నాలుగు కేసులున్నాయని పోలీసులు గుర్తించారు.

# కొలిక్కిరాని సాదాబైనామా దరఖాస్తులు

### రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల్లో 40 శాతం సాదాబైనామావే

### క్రమబద్ధీకరిస్తే 20 లక్షల ఎకరాలకుపైగా పట్టాలు

### ఉత్తుర్వుల కోసం ఎదురుచూస్తున్న రెవెన్యూ శాఖ అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** తెల్ల కాగి తాలపై చేసుకున్న భూకొనుగోలు ఒప్పందాల (సాదాబైనామాల)ను క్రమబద్ధీకరిం చాలంటూ సామాన్యుల నుంచి పెద్దఎత్తున డిమాండ్ ఉంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల్లో 40 శాతం వీటిపైనే ఉన్నాయి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 8.90 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. కొత్త రెవెన్యూ చట్టం భూభారతిలో క్రమబద్ధీ కరణకు పలు సెక్షన్లను చేర్చడంతో బాధితులు ఆశతో ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో 2016లో తొలిసారి సాదాబైనామాల క్రమబద్ధీక రణ చేపట్టారు. 2014 జూను ముందు జరిగిన ఒప్పందాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం నాడు ఉత్తర్వులు జారీ చేసింది.11.19 లక్షల మంది రైతులు దరఖాస్తు చేయగా 6.18 లక్షల మందిని అర్హులుగా గుర్తించి పట్టాలు పంపిణీ చేశారు.2020లో మరోసారి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆ ఏడాది అక్టోబరు 12 నుంచి 30 వరకు ఇచ్చిన గడువులో 2.24 లక్షల దరఖాస్తులు వచ్చాయి. గడువును నవంబరు 10 వరకు పొడిగించగా 6.66 లక్షలు వచ్చాయి. మొత్తం 8.90 లక్షల మంది దరఖాస్తుదారులు దాదాపు 20 లక్షల ఎకరాల క్రమబద్ధీకరణకు క్రమబద్ధీకరణకు ఎదురు చూస్తున్నారు.గత ప్రభుత్వ హయాంలో అందిన సాదాబైనామా దరఖాస్తులన్నీ రెవెన్యూశాఖకు చెందిన ఆన్‌లైన్‌లో ఉన్నాయా లేదా అనే సందేహాలు తలెత్తుతు న్నాయి. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా గతంలో ఒక దఫా దరఖాస్తుల పరిశీలన చేపట్టారు.అదే సమయంలో దరఖాస్తులేవీ పెండింగ్‌లో ఉండొ ద్దంటూ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశా లతో కొన్ని జిల్లాల కలెక్టర్లు ఎడాపెడా ఆన్‌లైన్‌లో తిరస్కరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 22,509 దరఖాస్తులు రాగా, 12,947 తిర్కరించారు. మహబూ బాద్‌లో 37,129 దరఖాస్తులు రాగా 20792 తిరస్కరించారు.అదే విధంగా నిజామా బాద్‌లో 10,122కి 9504 తిరస్కరించగా వనపర్తిలో 3654కి 3408, నల్గొండలో 14,409కి 14,166, సంగారెడ్డిలో 3669 దరఖాస్తులు రాగా 2726 దరఖాస్తులను తిరస్క రించారు.

రాజన్న సిరిసిల్లలో వచ్చిన 5842 సాదా బైనామా దరఖాస్తులన్నింటిని తిరస్క రించడం గమనార్హం.ప్రస్తుతం ఈ రైతుల్లో అనేక మంది రైతులు తాజాగా నిర్వహించిన రెవెన్యూ సదుస్సుల్లో దరఖాస్తు చేసి ప్రభుత్వం నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు.భూ దస్త్రాల యాజమాన్య హక్కుల చట్టం ఆర్వోఆర్ 1971 సాదాబైనామాల క్రమబద్ధీకరణకు వీలు కల్పిస్తోంది.ఆ చట్టాన్ని 2020 అక్టోబరు 29న ప్రభుత్వం రద్దు చేసింది. కొత్తగా ఖితెలంగాణ పాసుపుస్తకాలు, యాజమాన్య హక్కుల చట్టంఖి ఆర్వోఆర్ 2020ను అమల్లోకి తెచ్చింది. సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేయడం లేదంటూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయిం చారు. ఆర్వోఆర్ 2020లో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు వీలుకల్పించే సెక్షన్లు ఏవీ లేవని న్యాయస్థానం పేర్కొంది. ఆర్వోఆర్ 1971 చట్టం అమల్లో ఉన్న సమయంలో ప్రభుత్వానికి వచ్చిన దరఖాస్తులకు మాత్రం అవకాశం కల్పించింది. దాని ప్రకారం 2020 అక్టోబర్బు 29కి ముందు అందిన 2.24 లక్షల దరఖాస్తుల క్రమబద్ధీ కరణకు వీలు ఏర్పడింది.కానీ అన్ని అర్జీలను దృష్టిలో పెట్టుకుని చట్ట సవరణ చేయడానికి వీలుగా ఆర్డినెన్స్ తీసుకురావాలని నాటి ప్రభు త్వం భావించినా ముందడుగు పడలేదు. ఈ కేసు కోర్టులో కొనసాగుతూనే ఉంది. కోర్టు నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా క్రమబద్ధీకరణ విష యంలో ముందుకు వెళ్లాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది.

# రూ.5 వేల కోట్ల రుణం

### రిజర్వ్ బ్యాంక్‌కు సర్కార్ ఇండెంట్!

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** తెలంగాణలో గ్యారంటీ పథకాలు, ఇతర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతోపాటు, పెండింగ్ బిల్లుల తదితర అవసరాల కోసం రాష్ట్ర సర్కార్ రుణాన్ని సమీకరించాలని నిర్ణయించింది. ఇందుకు గాను రిజర్వ్ బ్యాంకు నుంచి రూ.5 వేల కోట్లు తీసుకునేందుకు కసరత్తులు చేస్తోంది. దీనికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్‌కు ఇండెంట్ పెట్టింది. ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టడం ద్వారా ఈ మొత్తాన్ని సేకరించనుంది. 19 ఏళ్ల కాలపరిమితితో రూ.1,000 కోట్లు, 22 ఏళ్ల కాలపరిమితితో రూ.1,000 కోట్లు, 23 ఏళ్ల కాలపరిమితితో రూ.2 వేల కోట్లు, 24 ఏళ్ల కాలపరిమితితో మరో రూ. 1,000 కోట్లు రుణం తీసుకోనున్నట్లు ఆర్థిక శాఖ అధికవర్గాల ద్వారా తెలియవచ్చింది. కాగా తెలంగాణ సర్కార్ గత నెలాఖరులో రూ.3,500 కోట్ల రుణం తీసుకుంది. దీంతో ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి జూన్ నెలాఖరు వరకూ తొలి త్రైమాసికంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.17,400 కోట్ల రుణ సమీకరణ చేసింది. రెండో త్రైమాసికం జూలై నుండి సెప్టెంబరు వరకూ రూ.12,000 కోట్లు రుణం తీసుకుంటామని రిజర్వ్ బ్యాంక్‌కు ప్రతిపాదనలు పంపించింది. అయితే, ఒక్క జూలైలోనే రూ.8.500 కోట్లు సేకరించింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ నుంచి ఇప్పటి వరకూ రూ.25,900 కోట్లు రుణాన్ని సేకరించింది.

## 1,817 ఎకరాల భూములను స్వాధీనం చేసుకున్న దేవాదాయ శాఖ

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎండోమెంట్ భూముల రక్షణ కోసం ప్రభుత్వం నిర్మాణాత్మకచర్యలు తీసుకుందని రాష్ట్ర దేవాదాయశాఖ పేర్కొన్నది.ఇప్పటి వరకు 1,817.01 ఎకరాల భూమని స్వాధీనం చేసుకున్నటు ఈ శాఖ ప్రకటించింది.ఎండోమెంట్ భూముల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకొని అక్కడి సలంలో బోరులు ఏర్పాటు చేసినటు తెలిపింది.సంబంధిత ఆలయానికి చెందినది అంటూ సమగ్ర వివరాలు వెలడించామని తెలిపింది. వివాదాల నేపథ్యంలో రెవెన్యూ శాఖ పరిధిలో, కోరు పరిధిలో కొనసాగుతున్న కేసులతో పోరాడి 560.23 ఎకరాల భూమిని స్వాదీనం చేసుకున్నామని,వీటికి సంబంధించిన తీర్పులు తమకు అనుకూలంగా వచ్చాయని, రక్షణ చర్యలో భాగంగా రెవెన్యూ,సర్వే అధికారుల సమన్వయంతో సర్వే నిర్వహించి కంచె వేసి సరిహద్దులు గుర్తించామని అధికారులు తెలిపారు.సాగు చేయలేని ఖాళీ భూములను రక్షించేందుకు ఆలయానికి ఆదాయ వనరులను ఉత్పత్తి చేయడానికి సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ఐదు జిల్లాలో 231.05ఎకరాల భూమిని గుర్తించామన్నారు.

మహిళా స్వయం సహాయక బృందాలకు,టిజి రెడ్కోద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు కోసం గుర్తించిన 231.05 ఎకరాలు లీజుకు ఇచ్చేందుకు ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు.ఎండోమెంట్ భూముల జియోట్యాగింగ్ అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు.జిఐఎస్ ఉపయోగించి ఎండోమెంట్ ఆస్తుల జాబితా, వాటికి సంబంధించిన మ్యాప్ లను రూపొందించామన్నారు. ఎండోమెంట్ భూముల డిజిటలైజేషన్ చేసినట్లు పేర్కొన్నారు. రక్షణ కోసం రాష్ట్రంలోని ఎండోమెంట్ భూములు, ఇతర ఆస్తుల వివరాలను డిజిటల్ డేటా బేస్‌లోపొందు పరిచినట్లు వివరించారు. చాలా ప్రాంతాలకు సంబంధించిన మ్యాప్ లు లేకపోవడంతో టిజిఆర్ఏసి దగ్గర అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డుల ద్వారా సమాచారం సేకరించి జియో ట్యాగింగ్ అనుసంధానం చేశామన్నారు. దేవాదాయ శాఖకు చెందిన 91,827.35 ఎకరాల భూమికి, ఇప్పటి వరకు 34,092.00 ఎకరాలకు జియోట్యాగ్ చేసినట్లు తెలిపారు.

## సంక్షేమ గురుకులాల్లో క్యాటరింగ్‌కు టెండర్ల ఆహ్వానం

### ఆహార నాణ్యతపై ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సాంఘిక, గిరిజన, వెనుకబడిన, మైనార్టీ గురుకుల విద్యాలయాల్లో కేటరింగ్‌కు సంబంధించి సర్కార్ టెండర్లను అహ్వానించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1,023 గురుకుల పాఠశాలలు, కళాశాలలకు అవసరమైన నిత్యావసరాల సరఫరా, క్యాటరింగ్ కాంట్రాక్టులకు సంబంధించి టెండర్లు కోరింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌లో ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునే వీలును కల్పించింది. తదుపరి అధికారులు ఈ నెల 23న టెండర్ల కేటాయింపు చేసి 28న వర్క్ ఆర్డర్లు ఇస్తారు. వర్క్ ఆర్డర్ పొందిన కాంట్రాక్టర్లు సెప్టెంబరు 1 నుంచి సేవలను అందించాల్సి ఉంటుంది. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి జిల్లా, మండల స్థాయిల్లో మూడు విభాగాలుగా టెండర్లు నిర్వహించేలా విభజించారు. ఈ టెండర్లలో పాల్గొనే వారు ఆసక్తి ఉన్న ప్రతి విభాగానికి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, కాంట్రాక్టు ఏజెన్సీలు ఒకే టెండర్ ఫారమ్ ద్వారా వేర్వేరు విద్యాసంస్థలకు సేవలందించడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఈ విధానం వల్ల మండల మహిళా సమాఖ్యలు, యువజన సంఘాలు, స్థానిక వ్యాపారులకు విస్తృత అవకాశాలు కల్పిస్తుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇక కాంట్రాక్టర్ల ఎంపిక ప్రక్రియ జిల్లా కొనుగోలు కమిటీ (డీపీసీ)ల ఆధ్వర్యంలో జరగనుంది. కాగా ఆహార పదార్థాల సేకరణ, నాణ్యతకు సంబంధించి రాష్ట్రంలోని అన్ని సంక్షేమ గురుకుల సొసైటీల్లో ఒకే విధమైన వ్యవస్థ ఉండేలా చూసుకునేందుకు ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి నేతృత్వంలో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

## ఉద్దండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు
# రూ.250 కోట్లు మంజూరు
### నిర్వాసితులతో సహపంక్తి భోజనం చేసిన ఎమ్మెల్యే అనిరుధ్‌ను అభినందించిన సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 3:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉద్ధండాపూర్ రిజర్వాయర్ పరిధిలో నిర్వాసితులుగా మారి.. గత ప్రభుత్వ నిర్లక్ష్యాయానికి కన్నీళ్ల సాక్ష్యంగా మిగిలిన బాధితులకు అండగా నిలిచామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ట్విట్టర్ ద్వారా తెలిపారు.. అధికారంలోకి వస్తే.. పరిహారం ఇచ్చి కన్నీళ్లు తుడుస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని ఆదివారం ప్రకటించారు. ఏడాదిన్నరలో రూ.250 కోట్ల పరిహారం మంజూరు చేశామని, ఇందులో రూ.25 కోట్లు గత నెలలో విడుదల చేశాం.ఈ నెలలో మరో రూ.175 కోట్లు విడుదల చేశామని తెలిపారు. ఈ నేపథ్యంలో.. నిర్వాసితులతో సహపంక్తి భోజనం చేసి, డిసెంబర్ 9లోపు పూర్తి పరిహారం అందిస్తామని నా మాటగా చెప్పాల్సిందిగా స్థానిక శాసన సభ్యుడు అనిరుధ్ రెడ్డికి సూచించాను. 6 వేల మందితో సహపంక్తి భోజనం చేసి నా హామీ మేరకు వారికి భరోసా ఇచ్చినందుకు సిఎం రేవంత్‌రెడ్డి... అనిరుధ్‌కు అభినందనలు తెలిపారు.



### భారీ వర్షాలతో ముందుగానే ముగిసిన
# అమర్‌నాథ్ యాత్ర!

**రుద్రప్రయాగ్, ఆగస్టు 3:** ప్రతి ఏటా అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగే అమర్‌నాథ్ యాత్ర ఈ ఏడాది అనుకున్న దానికంటే ముందుగానే ముగిసింది. ప్రతికూల వాతావరణం, భారీ వర్షాల కారణంగా యాత్రా మార్గాలు తీవ్రంగా దెబ్బతినడంతో, యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని యాత్రను నిలిపివేస్తున్నట్లు జమ్మూకశ్మీర్ అధికార యంత్రాంగం ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 9న రక్షాబంధన్ రోజున ముగియాల్సిన యాత్రను, ఆగస్టు 3 నుంచే నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది. గత వారం రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాల వల్ల అమర్‌నాథ్ పుణ్యక్షేత్రానికి వెళ్లే బల్తాల్, పహల్గామ్ రెండు ప్రధాన మార్గాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో ఈ మార్గాల్లో ప్రయాణం సురక్షితం కాదని అధికారులు నిర్ధారించారు. ఈ విషయంపై కశ్మీర్ డివిజనల్ కమిషనర్ విజయ్ కుమార్ బిధురి మాట్లాడుతూ, భారీ వర్షాల వల్ల రెండు మార్గాల్లోనూ మరమ్మతులు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ప్రస్తుతం మరమ్మతు పనులు చురుగ్గా జరుగుతున్నందున యాత్రను కొనసాగించడం సాధ్యం కాదు. అందుకే యాత్రను నిలిపివేయాలని నిర్ణయించామని తెలిపారు. ఈ ఏడాది జులై 3న ప్రారంభమైన ఈ యాత్రలో ఇప్పటివరకు 4.10 లక్షల మందికి పైగా భక్తులు మంచులింగాన్ని దర్శించుకున్నారు. కాగా, గతేడాది 5.10 లక్షల మంది భక్తులు యాత్రలో పాల్గొన్నారు.ఈ ఏడాది యాత్ర ప్రారంభానికి ముందు ఏప్రిల్‌లో పహల్గామ్‌లో ఉగ్రదాడి జరిగిన నేపథ్యంలో ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. యాత్రా మార్గాల పొడవునా అదనపు బలగాలను మోహరించి, భక్తులకు పూర్తి భద్రత కల్పించింది. అయితే, ప్రకృతి వైపరీత్యం కారణంగా యాత్రను ముందుగానే ముగించక తప్పలేదని అధికారులు వెల్లడించారు. మార్గాలకు మరమ్మతులు పూర్తిచేసి, అవి సురక్షితమని నిర్ధారించుకున్న తర్వాతే భవిష్యత్తులో యాత్రను పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు.

# వెల్టూర్ గుందిమల్లతో బనకచర్లకు చెక్!
### 60 టీఎంసీల వాటా నీరు, మరో 60 టీఎంసీల వరద జలాలు వాడుకుందాం
### ఆంధ్ర కుట్రలకు తగిన బుద్ధి చెబుదాం
### ఆనకట్ట నిర్మాణంపై డి.సిఎం భట్టితో చర్చించిన మంత్రి జూపల్లి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 3, ప్రభాతవార్త :** కృష్ణ గోదావరి నదులపై అక్రమ ప్రాజెక్టుల నిర్మాణానికి ఆంధ్ర ప్రభుత్వం అనుమతి లేని ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతుందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలుకొని పది సంవత్సరాల ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆంధ్ర పాలకుల కుట్రలకు తెలంగాణ పాలకులు బలవుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు రావు అన్నారు. కృష్ణ, గోదావరి నదులపై తెలంగాణ నీటి వాటా తేల్చాలని దాని కోసం తెలంగాణ ప్రభుత్వం కృష్ణా నదిపై జోగులాంబ గద్వాల జిల్లా అ్లలపూర్ మండలం గుందిమల్ల గ్రామం ఒకవైపు, మరోవైపు వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం వెల్టూరు గ్రామం దగ్గర వెల్టూరు గుందిమల్ల ఆనకట్ట నిర్మాణంతో కృష్ణా నదిలో ప్రస్తుతం ఉన్న శ్రీశైలం నీటి లెవెల్ 885 అడుగుల మేరకే ఆనకట్ట నిర్మించి సుమారు 60 టీఎంసీల వాటా నీటిని, మరో 60 టీఎంసీల వరద జలాలను వాడుకునే వెసులుబాటు వెల్టూరు గుందిమల్ల ప్రాజెక్టు తో సాధ్యమవుతుందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు సూచించారు. శనివారం చిన్నంబావి మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో 33/11 సబ్ స్టేషన్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఉపముఖ్యమంత్రికి మంత్రి జూపల్లి కృష్ణారావు కృష్ణానదిని చూపిస్తూ ప్రాజెక్టు వివరాలను తెలియజేశారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో 65 గ్రామాలను, 40 వేల సారవంతమైన భూములను, ఇండ్లు సర్వం కోల్పోయామని, నాడు అరకొర పరిహారాలతో రైతులకు పరిహారం అందించడంలో అన్యాయం జరిగిందని, అలాగే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పించడంలో గత ప్రభుత్వాలు 11వేల కుటుంబాలకు విద్యా, ఉద్యోగ, గృహ నిర్మాణాలలో నిర్వాసితుల కుటుంబాలకు జీవో 98 ద్వారా ఉద్యోగాలు కల్పించడంలో కూడా అన్యాయం జరిగిందని మంత్రి జూపల్లి సూచించారు. గతంలో జరిగిన పలు నష్టాల నుండి తేరుకోవడానికి వాటాగా సబ్మర్చ్ గ్రామాలకు దక్కాల్సిన జూరాల నీరు సైతం రాకపోవడం వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని అందుకే ఆంధ్రప్రదేశ్ కృష్ణా, గోదావరి నదులపై అక్రమ ప్రాజెక్టులకు బుద్ధి చెప్పడానికి వెల్టూరు గుందిమల్ల బ్యారేజ్ నిర్మాణం చేపట్టి తగిన బుద్ధి చెప్పాలని మంత్రి జూపల్లి సూచించారు. దీంతో స్పందించిన ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కొల్లాపూర్ సభలో మాట్లాడుతూ గత టిఆర్ఎస్ పాలకుల తప్పిదాల వల్లే 10 ఏళ్లు వాటా నీటిని కోల్పోయామని, తాత్కాలిక ఒప్పందాలతో 299 టీఎంసీలతో ఒప్పందాలను చేసుకోవడం సిగ్గుచేటని ఉపముఖ్యమంత్రి అన్నారు. ఆంధ్ర ప్రభుత్వం బనకచర్ల ఎలా కడుతుందో చూస్తామని, తెలంగాణ సాగునీటి వాటా తేల్చాకే ఏ నిర్మాణాలైనా చేపట్టాలని ఆంధ్రను హెచ్చరించారు. వెల్టూరు గుందిమల్ల ప్రాజెక్టుతో తెలంగాణ నీటి వాడా కోసం కృషి చేస్తామని ఉప ముఖ్యమంత్రి అన్నారు. శనివారం వెల్టూరు గ్రామంలో బ్యారేజ్ సాధన సమితి నాయకుల విన్నపం మేరకు కాంగ్రెస్ నాయకులు కళ్యాణ్ రావు, మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాజెక్టు పూర్తి వివరాలను ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సూచించారు. త్వరలోనే తెలంగాణ వాటా నీటి వినియోగం కోసం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు చేపడతామని అన్నారు. ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేర్చాలని వారు కోరారు. త్వరలోనే మంత్రివర్గ సమావేశంలో ప్రాజెక్టు వివరాలపై పూర్తి వివరాలు సేకరించి నిర్ణయం తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కొత్త కళ్యాణ్ కుమార్, జూపల్లి అరుణ్, బ్యారేజ్ సాధన సమితి నాయకులు పెరుమాల శ్రీనివాస్, పెద్ద మల్లయ్య, వెంకటేశ్, తిరుపతయ్య, మద్దూరు నాగరాజు యాదవ్, కాశన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణానదిని వీక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

## ఫేస్ రికగ్నిషన్ దుర్వినియోగంపై పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** తెలంగాణ పంచాయతీరాజ్ శాఖలో నకిలీ హాజరు వ్యవహారం కలకలం రేపిండంతో పంచాయితీరాజ్‌శాఖ అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను ఉపయోగించి వందల మంది కార్యదర్శులు తప్పుడు హాజరు నమోదు చేయడంతో మంత్రి సీతక్క సీరియస్‌గా స్పందించడంతో 553 మంది కార్యదర్శులను గుర్తించి చర్యలు తీసుకున్నారు. కొందరిని సస్పెండ్ చేయగా, ఎంపీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.తెలంగాణ పంచాయతీరాజ్ శాఖలో ప్రస్తుతం నకిలీ అటెండెన్స్ వ్యవహారం పెద్ద దుమారాన్ని రేపుతోంది. పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను కొందరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు మోసం చేయడానికి ఉపయోగించడం అధికారులను విస్మయానికి గురిచేసింది.విధులు సరిగా నిర్వర్తించకుండా.. గ్రామాలకు వెళ్లకుండానే,తప్పుడు ఫోటోలు, ఫేక్ వివరాలు సమర్పించడం వాటిలో ఏకంగా సీఎం ఫోటోలు,ఖాళీ కుర్చీల చిత్రాలను అప్‌లోడ్ చేసి అటెండెన్స్ వేసుకున్న వందల మంది కార్యదర్శులు అభాసుపాలయ్యారు.వందల సంఖ్యలో నకిలీ హాజరు నమోదవ్వడంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఈ ఘటనపై విచారణ చేపట్టిన అధికారులు, ఇప్పటివరకు 553 మంది పంచాయతీ సెక్రెటరీలు ఫేక్ అటెండెన్స్ వేసినట్లు గుర్తించారు. అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఒక పంచాయతీ కార్యదర్శిని వెంటనే సర్వీస్ నుంచి తొలగించారు.

మరో 15 మందిని సస్పెండ్ చేశారు. మిగిలిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.అంతేకాకుండా..సెక్రెటరీల హాజరును పర్యవేక్షించాల్సిన ఎంపీఓలు (మండల పంచాయతీ అధికారులు) కూడా విధుల్లో నిర్లక్ష్యం వహించారని ప్రభుత్వం గుర్తించింది. మొత్తం 47 మంది ఎంపీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు, వారిపై శాఖాపరమైన చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ప్రజలకు మెరుగైన పారిశుద్ధం, సేవలు అందాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతి గ్రామానికి పంచాయతీ కార్యదర్శులను నియమించింది. గత ప్రభుత్వ హయాంలో దాదాపు 9 వేలకు పైగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించగా.అందులో చాలా మంది రెగ్యులర్ అయ్యారు. అయితే.. చాలా మంది కార్యదర్శులు తమ గ్రామాల్లో అందుబాటులో ఉండట్లేదని ఫిర్యాదులు రావడంతో. వారి హాజరును పారదర్శకంగా పర్యవేక్షించడానికి ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను ప్రవేశపెట్టారు. కానీ.. కొందరు కార్యదర్శులు ఈ సాంకేతికతను కూడా తమ నిర్లక్ష్యానికి అనువుగా మార్చుకున్నారు. తాజాగా వీరి హాజరుపై ఫిర్యాదులు అందడంతో అధికారులు క్షుణ్ణంగా పరిశీలించగా, ఈ ఫేక్ అటెండెన్స్ వ్యవహారం బయటపడింది.అత్యధికంగా నకిలీ హాజరు నమోదు చేసిన జిల్లాల వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లాలో 70 మంది, నల్గొండ జిల్లాలో 69 మంది, వికారాబాద్ జిల్లాలో 63 మంది, సూర్యాపేట జిల్లాలో 48 మంది, కామారెడ్డి జిల్లాలో 43 మంది, కొత్తగూడెం జిల్లాలో 42 మంది ఉన్నారు. సస్పెండ్ అయిన కార్యదర్శులు ఎక్కువగా వనపర్తి జిల్లాలో ఉండగా.. ఏడుగురు కార్యదర్శులు సస్పెండ్ అయ్యారు. నిర్లక్ష్యం వహించిన ఎంపీఓలు ఎక్కువ ఉన్న జిల్లాల విషయానికి వస్తే.. సరైన పర్యవేక్షణ చేయని ఎంపీఓలలో కొత్తగూడెంలో 17 మంది, నల్గొండ జిల్లాలో 15 మంది ఉన్నారు. ఆశ్చర్యకరంగా.. అత్యధికంగా ఫేక్ అటెండెన్స్ నమోదైన సిద్దిపేట జిల్లాలో మాత్రం కేవలం ఒక ఎంపీవోది మాత్రమే నిర్లక్ష్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ చర్యల ద్వారా పంచాయతీ వ్యవస్థలో క్రమశిక్షణ, ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

## పాకిస్థాన్‌ను వణికిస్తున్న భూకంపాలు

**రావల్పిండి, ఆగస్టు 3:** పాకిస్థాన్‌ను వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. 24 గంటల వ్యవధిలోనే రెండోసారి భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12:10 గంటల సమయంలో ఉత్తర పాకిస్థాన్‌లో 5.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. రాజధాని ఇస్లామాబాద్, రావల్పిండితో పాటు పలు నగరాల్లో బలమైన ప్రకంపనలు రావడంతో, నిద్రలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడి ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పాకిస్థాన్ వాతావరణ శాఖకు చెందిన నేషనల్ సీస్మిక్ మానిటరింగ్ సెంటర్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ భూకంప కేంద్రం రావల్పిండి సమీపంలోని రావత్‌కు ఆగ్నేయంగా 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. భూ ఉపరితలానికి కేవలం 10 కిలోమీటర్ల లోతులోనే ఇది సంభవించడంతో ప్రకంపనల ప్రభావం ఎక్కువగా కనిపించింది. ఇస్లామాబాద్, రావల్పిండితో పాటు అటక్, స్వాబి, స్వాత్, ముర్రీ, జీలం, మలకండ్, మన్సెహ్రా, ఆజాద్ జమ్మూకశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో కూడా భూమి కంపించింది. 24 గంటల్లో ఇది రెండో భూకంపం కావడం గమనార్హం. రెండురోజులముందు కూడా ఆఫ్ఘనిస్థాన్‌లోని హిందూకుష్ పర్వత ప్రాంతాల్లో కేంద్రీకృతమైన 5.4 తీవ్రతతో భూకంపం వచ్చింది. ఆ ప్రకంపనల ప్రభావం కూడా పాకిస్థాన్‌పై పడింది. అయితే, తాజా భూకంపం వల్ల ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం అందలేదని అధికారులు తెలిపారు. హిందూకుష్ పర్వత ప్రాంతాల్లో భూమిలో టెక్టానిక్ ప్లేట్ల కదలికల వల్లే ఈ ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## గడ్కరీ నివాసం పేల్చేస్తామని బెదరింపు: దుండగుడి అరెస్ట్

**నాగపూర్, ఆగస్టు 3:** కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి నాగపూర్ నివాసాన్ని పేల్చేస్తామంటూ అజ్ఞాత వ్యక్తి నుంచి ఆదివారం ఉదయం 8.46 గంటలకు ఫోన్ కాల్ వచ్చింది. వార్దా రోడ్డులోని గడ్కరి ఇల్లు పేల్చేస్తామని సమాచారం రావడంతో పోలీసులు స్థానిక ప్రతాప్ నగర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఆ తర్వాత కొద్దిసేపటికే బెదిరింపు



కాల్ చేసిన అనుమానితుని అరెస్టు చేశారు. అతనిని ఉమేష్ విష్ణు రౌత్‌గా గుర్తించారు. మెడికల్ చౌక్ సమీపంలోని స్థానిక సారాదుకాణంలో పనిచేస్తున్నట్టు గుర్తించారు. తన మొబైల్ నెంబర్ నుంచి అతను ఫోన్ చేశాడు. పది నిమిషాల్లో గడ్కరి నివాసం పేల్చేస్తామని బెదరించాడు. నాగపూర్‌లోని బీమా దవాఖానా సమీపంలో అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. తదుపరి విచారణ జరుగుతోంది. అజ్ఞాత వ్యక్తి నుంచి బెదిరింపు కాల్ వచ్చినప్పుడు గడ్కరి నాగపూర్‌లోనే ఉన్నారు. ఆయన క్షేమంగానే ఉన్నారని, అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. మంత్రి నివాసం వద్ద గట్టి బందోబస్తును కూడా ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు 112 ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్‌కు గడ్కరీ ఇంటివద్ద బాంబు పెట్టామని, అది పేలడానికి సిద్ధంగా ఉందని ఒక ఫోన్ వచ్చిందని, వెంటనే బాంబు స్క్వాడ్‌ను అక్కడికి పంపడంతో పాటు మంత్రి వ్యక్తిగత భద్రతా సిబ్బందిని కూడా అప్రమత్తం చేశామని జోన్1 డీసీపీ రిషీకేష్ రెడ్డి తెలిపారు. గడ్కరి నివాసంలో ఎలాంటి బాంబు కనిపించకపోవడంతో అది ఉత్తుత్తి బెదిరింపేనని తేలినట్టు చెప్పారు. పట్టుబడిన నిందితుడికి ఎలాంటి క్రిమినల్ రికార్డు లేదని, అతని ఫోన్ నుంచి కాల్ రావడంతో అరెస్టు చేసి మరింత సమాచారం రాబడుతున్నామని వివరించారు.

### సన్నబియ్యంతో 94 శాతానికి పెరిగిన లబ్ధిదారులు
### డిఎస్‌ఓ విక్రయ ధ్రువీకరణల జాప్యంతో డీలర్ల వెతలు
# రేషన్ డీలర్లు కమీషన్ బకాయిలతో పరేషాన్

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఉచితంగా బియ్యం పంపిణీ చేసి పేదల కడుపు నింపుతున్న రేషన్ డీలర్లు ఆరునెలలుగా కమీషన్ అందక పస్తులు ఉండాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.రేషన్ డీలర్లు లబ్దిదారులకు విక్రయించిన మొత్తం జిల్లా డిఎస్‌వోలు దృవీకరణ చేయడం జాప్యం చేస్తుండటంతో నెలలు గడిచినా కమీషన్ రాని పరిస్థితి నెలకొంది. ప్రతి నెల కమీషన్ రావాలంటే తహసీల్దార్లు డీలర్లు ఎంత బియ్యం విక్రయించారో ధ్రువీకరిస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి పంపాలి. వారు కమిషనర్ కార్యాలయానికి పంపాలనే మెలిక కూడా కమీషన్ విడుదలలో జాప్యానికి కారణమవుతోందని డీలర్లు చెబుతున్నారు. విక్రయాలన్నీ ఎప్పటికప్పుడు ఆన్లైన్లో కనిపిస్తున్నా.. ధ్రువీకరణకు ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు . పంపిణీ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోద్వారా జరుగుతున్నా తహసీల్దార్లు. పౌరసరఫరాల శాఖవారి పట్టింపులేనితనం డీలర్లకు శాపంగా మారుతోంది. తెలంగాణలోని 33 జిల్లాలలో దాదాపు 94.72 లక్షల కుటుంబాలకు ఆహార భద్రతకార్డులు ఉన్నాయి ఆయా కార్డుదారులకు 17255 రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెల ఉచిత బియ్యం పంపిణీ జరుగుతోంది.ఫిబ్రవరిలో 161006.16 మెట్రిక్ టన్నుల బియ్యం 89.59శాతం లబ్దిదారులకు పంపిణీ చేశారు. మార్చిలో 159918. 290 ఎంటిల బియ్యం సుమారు 88.84శాతం మందికి పంపిణీ చేశారు. ఏప్రిల్‌లో 1670096 మెట్రిక్ టన్నులు, మేలో 170211.895 మెట్రిక్ టన్నులు, జూన్‌నెల 30వరకు 541439.333ఎంటిల బియ్యం 94శాతం మందికి పంపిణీచేశారు డీలర్లకు క్వింటాకు రూ. 140 చొప్పున ప్రభుత్వం కమీషన్ రూపేణా చెల్లిస్తోంది. మార్చి వరకు కమీషన్ జమ కాగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు బకాయిలు రావాల్సి ఉంది. జూన్లో ఒకేసారి మూడు నెలల కోటాను ఆగస్టు వరకు కార్డుదారులకు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. దుకాణ అద్దెలు, హమాలీ, కూలీ డబ్బులతో పాటు సొంతంగా కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు పదరాని పాట్లు పడుతున్నారు. సన్నబియ్యం ఇస్తుండటంతో ఏప్రిల్ నుంచి 91.96శాతం లబ్దిదారులు బియ్యం కోసం రేషన్ వస్తున్నారు. మేనెలలో 170211.89 మె.ట 91శాతం మందికి పంపిణీ చేశారు. ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పంపిణీ ప్రారంభం కాగా అప్పటి నుంచి కమీషన్ లేదని, గతం కంటే స్టాక్ ఎక్కువ తీసుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు.?దొడ్డు బియ్యం సమయంలో తక్కువ సంఖ్యలో లబ్దిదారులు బియ్యం తీసుకునే వారి సంఖ్య పెరిగింది. దీంతో ఇప్పటి వరకు ఒక రూమ్ అద్దెకు తీసుకుని పంపిణీ చేయగా, సన్నబియ్యం నుంచి రెండు గదులు అద్దెకు తీసుకుంటున్నారు. బియ్యం తీసుకునేందుకు లబ్దిదారులు పెద్ద సంఖ్యలో రావడంతో రోజంతా సమయం కేటాయించడంతో పాటు ఒక సహాయకుడిని నియమించుకోవాల్సి వస్తోంది. అతనికి దినసరి కూలితో పాటు అదనంగా గది తీసుకోవడంతో ఖర్చులు గతం కంటే రెండింతలు పెరిగాయని పలువురు డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు 5 నెలలకు సంబంధించిన కమీషన్ పెండింగ్ ఉందని, ఒక్కొక్క డీలరుకు రూ.60 వేల నుంచి రూ.90వేలు రావాల్సి ఉందని చెబుతున్నారు. నెలకు రాష్ట్రవ్యాప్తంగా రూ.23 కోట్లు చెల్లించాలని, ఈ లెక్కన ఇప్పటివరకు రేషన్ డీల ర్లకు రూ.115 కోట్లు బకాయి ఉన్నట్లు తెలుస్తోంది.



సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో ఊడిపడిన బండ

## బల్లికురవ క్వారీలో ఘోర ప్రమాదం
# బండ పైనపడడంతో ఆరుగురు కూలీలు దుర్మరణం
### వెంటిలేటర్‌పై మరో ముగ్గురు
### ఒకరికి తెగిపోయిన కాలు
### మరో 8 మందికి తీవ్ర గాయాలు
### అంతా ఒడిశా వలస కార్మికులే
### ఎపి సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

**బల్లికురవ, ఆగష్టు 3, ప్రభాతవార్త :** రెక్కాడితే డొక్కాడని బ్రతుకులు వాళ్లవి. ఒరిస్సా రాష్ట్రం నుండి వలస వచ్చి గ్రానైట్ క్వారీలలో అనుక్షణం ప్రమాదంతో సహవాసం చేస్తూ అదృష్టం వెనకడుగు వేస్తే మృత్యు కౌగిలి చేరుతుంటారు. అదే తరహాలో ఆదివారం ఉదయం 10గంటల ప్రాంతంలో సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో కింద భాగంలో ఆరు జాకీలతో డ్రిల్లింగ్ చేస్తున్న కార్మికులపై పైనుండి పది టన్నులకు పైబడిన బండ ఊడిపడటంతో సంఘటన స్థలంలోనే ఆరుగురు మృతి చెందారు. సంఘటన స్థలంలోని ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు ఉదయం 10గంటల ప్రాంతంలో ఆరు జాకీలతో 18 మంది రిల్లింగ్ పనులలో నిమగ్నమై ఉన్నారు. 10.20 గంటల ప్రాంతంలో ఒక్క సారిగా వీరు పని చేస్తున్న ఎగువుభాగాన రాయి ఊడి కార్మికులపై పడిపోయింది. దీంతో సంఘటన స్థలంలోనే ఆరుగురు మృతి చెందారు. మృతి చెందిన వారిలో దండా బడిత్య(48), టక్కున దళాయి (37), పనకుల చెహారా(30), భాస్కర్ బిషోయ్(40), సంతోష్ గౌడ్(37), మూస జన(37) అనే కార్మికులు ఉన్నారు. మరొక కార్మికుడికి కాలు పూర్తిగా తెగిపోయింది. నరసరావుపేట గజ్జల బ్రహ్మారెడ్డి హాస్పిటల్‌లో ముగ్గురు కార్మికులు చావు బ్రతుకుల మధ్య వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. మరో ఎనిమిది మంది తీవ్ర గాయాలతో నరసరావుపేట వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్నారు. హృదయ విచారకంగా చనిపోయిన వారి బాడీలను గ్రానైట్ టిప్పర్లతో అనాధలలాగా పడవేశారు. పత్రికల వారికి సమాచారం అందకుండా చేసేందుకు తమ వంతు ప్రయత్నం విజయవంతంగా పూర్తి చేశారు. ప్రమాద విషయం తెలుసుకొని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా న్యాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా కలెక్టర్ వెంకట మురళి ప్రమాద తీరు పట్ల విస్మయం వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద ఘటనపై విచారణకు ఆదే శించారు. తహశీల్దార్ ఎం.రవినాయక్, ఎంపిడిఒ పాండురంగ స్వామి సంఘ టన స్థలానికి చేరుకున్నారు. తహశీల్దార్ రవి నాయక్ ఎప్పటికప్పుడు ప్రమాద ఘటనపై ప్రభుత్వానికి నివేదిక, అందజేస్తూ ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.మైనింగ్ డిడి రాజశేఖర్, ఎడి రామచంద్ర, సంతమాగులూరు సిఐ వెంకటరావు, బల్లికురవ ఎస్సై నాగరాజు,సంతమాగులూరు ఎస్సై పట్టాభి ప్రమాద స్థలంలో వివరాలను ఆరా తీస్తున్నారు. ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మీడియాను సైతం నియంత్రించారు:**
గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రమాద స్థలానికి వెళ్లేందుకు మీడియా ప్రతినిధులను సైతం వారి యాజమాన్యం అంగీకరించలేదు. పోలీసులు సైతం యాజమాన్యానికి వంతపడారు. దీంతో మీడియా ప్రతినిధులు అధికారుల తీరుపట్ల నిరసన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగిన సందర్భంలో గతంలో ఎన్నడు ఇలాంటి మీడియా నియంత్రణ కార్యక్రమాలు చూడలేదని జర్నలిస్టులు ఖండించారు.

**కోటి నష్టపరిహారం చెల్లించాలి: సిఐటియు డిమాండ్**
ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ముసుందార్ డిమాండ్ చేశారు. గ్రానైట్ క్వారీలలో కార్మికుల భద్రతను గాలికి వదిలేసిన కారణంగానే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

**బల్లికుర్వ క్వారీ ఘటనపై గవర్నరు అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు దిగ్బాంతి**
బాపట్ల జిల్లా, బల్లికురవ క్వారీలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడంతోపాటు మరికొందరు గాయపడిన సంఘటనపై గవర్నరు అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈమేరకు వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. సంఘటనపై విచారణ చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. ప్రమాదంలో ఇంతమంది ప్రాణాలు కోల్పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంపై అధికారులతో మాట్లాడిన సిఎం.. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఇదే ఘటనకు సంబంధించి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారధి.. జిల్లా కలెక్టరు, ఎస్‌పిలతో ఫోన్‌లో మాట్లాడి రెస్క్యూ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. క్వారీ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగాకోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశించారు. క్వారీప్రమాదంలో ఆరుగురు మరణించడం అత్యంత బాధాకర మని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ తరహా ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు రవాణాశాఖ మంత్రి మండపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి సూచించారు.



మీడియాతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

## మహారాష్ట్రలో రెచ్చిపోయిన ఎంఎన్ఎస్ సేన

**ముంబయి, ఆగస్టు 3:** మహారాష్ట్రలో రాజ్‌థాకరే మద్దతుదారులు మరోమారు రెచ్చిపోయారు. ముంబై సమీపంలోని పన్వేల్‌లో గత రాత్రి డ్యాన్స్‌బార్‌పై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. రాయ్‌గడ్ జిల్లాలో డ్యాన్స్‌బార్లపై మహారాష్ట్ర నవ నిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్‌థాకరే చేసిన వ్యాఖ్యల అనంతరం ఈ ఘటన చోటుచేసుకుంది. డజను మందికిపైగా వ్యక్తులు కర్రలతో నైట్ రైడర్స్ బార్‌పై దాడిచేసి, ధ్వంసం చేశారు. లోపలికి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించారు. ఫర్నిచర్‌తోపాటు మద్యం బాటిళ్లపై ప్రతాపం చూపించారు. బార్‌లోని టేబుళ్లు, అద్దాలు పగిలిపోయినట్టు ఉన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరాఠీ ఆత్మగౌరవం పేరుతో పదేపదే హింసకు మద్దతిస్తున్న రాజ్‌థాకరే నిన్న పన్వేల్‌లో జరిగిన కిసాన్ మజ్దూర్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ శివాజీ మహారాజ్ రాజధాని అయిన రాయ్‌గడ్‌లో డ్యాన్స్ బార్లు ఉండటానికి వీల్లేదని అన్నారు.



ఆయన వ్యాఖ్యలతో ఎంఎన్ఎస్ కార్యకర్తలు చెలరేగిపోయారు. అర్ధరాత్రి డ్యాన్స్‌బార్‌కు చేరుకుని విధ్వంసం సృష్టించారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించామని, తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. అయితే, ఈ ఘటనను ఎంఎన్ఎస్ నేత సందీప్ దేశ్‌పాండే సమర్థించుకున్నారు. దీనిని ఆయన 'ప్రతీకాత్మక నిరసన' గా అభివర్ణించారు. బార్లు ఉండటం చట్ట విరుద్ధమని, అందుకనే వారు ఆ పని చేశారని చెప్పారు. ప్రభుత్వం వీటిపై దృష్టిసారించాలని సూచించారు. కాగా, రాజ్‌థాకరే మద్దతుదారులు ఇటీవల మరాఠీయేతరులపైనా దాడికి పాల్పడ్డారు.

# 'మహావతార్ నరసింహ' సినిమా రిలీజ్ చేయడం అదృష్టం

## సక్సెస్ మీట్‌లో నిర్మాత అల్లు అరవింద్




**హోంబాలే ఫిల్మ్స్** సమర్పణలో క్లీమ్ ప్రొడక్షన్స్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ మహావతార్ నరసింహ. ఈ చిత్రానికి అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు. క్లీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్ చైతన్య దేశాయ్ నిర్మించారు. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా జూలై 25న ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గ్రాండ్‌గా రిలీజ్ అయిన ఈ చిత్రం అద్భుతమైన విజయాన్ని అందుకొని, భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన యానిమేటెడ్ సినిమాగా రికార్డ్ క్రియేట్ చేసి, సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతుంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు.

సక్సెస్ మీట్ లో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ, ఈ సినిమాని నేను రిలీజ్ చేసేలా అనుగ్రహించిన నరసింహ స్వామివారికి నమస్కారం. హోంబలే ఫిల్మ్స్ సంస్థతో నాకు మంచి అనుబంధం ఉంది. నిర్మాత విజయ్ ఫోన్ చేసి, ఈ సినిమాని తెలుగులో మీరు విడుదల చేయాలని అని అడిగారు. అంతకుమించి ఏం మాట్లాడుకోలేదు. వెంటనే ఓకే అన్నాను. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు. సినిమా విడుదలైన రోజు మార్నింగ్ షోకి వచ్చిన రెస్పాన్స్‌ని దృష్టిలో పెట్టుకుని ఈవెనింగ్ కొన్ని షోస్ పెంచాం. మరుసటి రోజు నుంచి మరిన్ని స్క్రీన్స్ పెంచుకుంటూ వెళుతున్నాం. 2021లో సినిమాని మొదలుపెట్టి ఎన్నోఒడిదొడుకులు ఎదుర్కొని, పట్టుదలతో సినిమాని మన ముందుకు తీసుకొచ్చారు. ఆ నరసింహ స్వామి వారే వారికి ఈ అద్భుతమైన విజయాన్ని అందించారు. హైదరాబాద్‌లోని ఎఎంబిలో 200 మంది స్వాములు ఈ చిత్రాన్ని చూడటం నాకు చాలా ఆనందంగా అనిపించింది. ఎప్పుడూ థియేటర్స్ రాని ప్రేక్షకులు ఈ సినిమాని వీక్షిస్తున్నారు. మా కుటుంబంలో, సన్నిహితులు, పరిచయం ఉన్నవారందరిలో సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్‌కి తెలిసినంతగా మరెవరికీ తెలియదు. పవన్ సనాతన ధర్మం గురించి ప్రసంగిస్తే అందరూ ముగ్ధులవుతాం. 'మహావతార్ నరసింహ'చిత్రాన్ని ఆయన చూడాలని, దాని గురించి మాట్లాడాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాని ప్రేక్షకులకు తీసుకెళ్లిన మీడియా వారికి, సహకరించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాల్లు అన్నారు. రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు మాట్లాడుతూ, సినిమాలు చూసే ప్రేక్షకులు తప్పకుండా ఈ సినిమా చూడండి. మీ పిల్లల్ని మొట్టమొదట ఈ సినిమాని చూపించండి. దర్శకుడు ఈ కథని మహాద్భుతంగా నడిపించాడు. ప్రస్తుత సమాజానికి ఏం కావాలో అది ఈ సినిమాలో ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద విలన్ తన కుమారుడున్నే చంపడం ఈ సినిమా కథ. ఇంతకంటే గొప్ప స్టోరీ ఎక్కడైనా ఉంటుందా? కేవలం మన పురాణాల్లోనే వుంటుంది. ఆ కథాంశాన్ని పట్టుకుని దర్శకుడు పరమ అద్భుతంగా చిత్రీకరించాడు. విజువల్స్ ఫైట్స్ సంగీతం ఇవన్నీ పరమ అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమా ఒక డివైన్ వండర్. అల్లు అరవింద్ గీత ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్స్ ద్వారా ఈ దివ్య అద్భుతమైన సినిమా విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉంది. వారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను అన్నారు. రచయిత, నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ, అల్లు అరవింద్‌తో ఎప్పుడు కలిసిన ఒక అద్భుతమైన అనుభూతి. ఈ సినిమా గురించి వారు చెప్పటం, ఫ్యామిలీతో కలిసి వెళ్లి చూడటం జరిగింది. మాకు ఒక సినిమా మొదలైన మూడో నిమిషం నుంచే మేము ఒక గుడిలో ఉన్నామని భావన కలిగించిన సినిమా ఇది. దర్శకుడు అశ్విన్ ఈ సినిమాతో యావత్ ప్రపంచానికి విష్ణుమూర్తిని నరసింహ స్వామిని దర్శనం చేయించేశారు. ఈ సినిమా చూడటం పూర్వజన్మల పుణ్యం. ఒక్కసారి కాదు ఎన్నిసార్లు చూసినా ఒక కొత్త అనుభూతి. పరిపూర్ణమైన సినిమా ఇది. అంత పెద్ద నరసింహున్ని నా జీవితంలో చూసి ఎరగను. స్క్రీన్ అంతా నిండిపోయింది. ఒక ఉద్వేగానికి లోనైపోయాం. ఇది రసాత్మకం కళాత్మకం. ఇది తీసిన వారు రాసినవారు చేసిన వారు చూసినవారు అందరూ ధన్యులే అన్నారు. డైరెక్టర్ అశ్విన్ కుమార్ మాట్లాడుతూ, జై నరసింహ స్వామి. జై జై సనాతన ధర్మం. ఇది సినిమా కాదు ఒక మహాదర్శనమని ప్రేక్షకులే చెబుతున్నారు. ఈ సినిమాకు వచ్చిన ప్రతిప్రశంస నరసింహ స్వామికే చెందుతుంది. గీతా ఆర్ట్స్ కి హృదయ పూ ర్వక కృతజ్ఞతలు. వారి సపోర్ట్ ని మర్చిపోలేను. వారి సపోర్ట్ తోనే సినిమా పబ్లిక్‌లోకి వెళ్ళింది. ఈ సినిమా ఒక రెవల్యూషన్ కానుంది. అందరికీ థాంక్యూ అన్నారు. ప్రొడ్యూసర్ శిల్పా ధావన్ మాట్లాడుతూ, ఇది యావత్ భారత్ సినిమా. ఈ సినిమా చేయడం నరసింహస్వామి కృపగానే భావిస్తున్నాం. ఈ సినిమాని ఇంత గొప్పగా ఆదరించిన ప్రేక్షకులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. నరసింహస్వామి కృపతోనే ఈ మ్యాజిక్ సాధ్యమైంది. ఈ సినిమాని సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అన్నారు.

**సంతోషం** సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్, సంతోషం ఓటీటీ అవార్డ్స్ 2025 కర్టెన్ రైజర్ ఈవెంట్ శనివారం సాయంత్రం హైదరాబాద్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. సీనియర్ నటులు మురళీ మోహన్, నిర్మాత కేఎస్ రామారావు, ఫిల్మ్ నగర్ హౌసింగ్ సొసైటీ సెక్రటరీ కాజా సూర్యనారాయణ, నిర్మాత ఏడిద రాజా, రామసత్యనారాయణ స్పాన్సర్స్ సూర్య సెమ్ డైరెక్టర్స్ అనిల్ మరియు డా. సురేష్ బాబు, వివికె హౌసింగ్ ఇండియా ప్రై వెట్ లిమిట్ అధినేత వల్లూరు విజయకుమార్ తదితరుల ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమానికి విజయ వారాహి మూవీస్ సంస్థ ఈ కార్యక్రమానికి కో స్పాన్సర్‌గా వ్యవహస్తున్నారు. అలాగే మ్యూజిక్ పాట్నర్‌గా ఆదిత్య మ్యూజిక్ వ్యవహరిసున్నారు. ఈ సందర్భంగా అతిథులు చేతుల మీదుగా సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్, సంతోషం ఒటిటి అవార్డ్స్ 2025 ఫంక్షన్ డేట్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ నగర్ హౌసింగ్ సొసైటీ సెక్రటరీ కాజా సూర్యనారాయణ మాట్లాడుతూ సురేష్ కొండేటితో నాకు సుదీర్ఘ కాల స్నేహం ఉంది. ఆయన మా ఇంటిని అద్దెకు తీసుకుని తన ఫ్యామిలీతో ఒక ఫ్లోర్‌లో ఉంటూ మరో ఫ్లోర్‌లో సంతోషం మేగజైన్ ఆఫీస్ పెట్టుకున్నారు. ఇప్పటికి 24 ఏళ్లుగా సక్సెస్ ఫుల్‌గా ఫిలిం మేగజైన్ నడుపుతున్నారు. ఆయన అందరికీ మిత్రులు. నవ్వుతూ మాట్లాడుతూ ఉంటారు. హైదరాబాద్‌లో ఏదైనా ఈవెంట్ ఘనంగా చేయాలంటే సురేష్ చేయాలి అనేంతగా పేరు తెచ్చుకున్నారు. 24 ఏళ్లుగా సంతోషం ఈవెంట్ చేస్తున్నాం, ఆయనకు ఏం మిగులుతుందో ఏంటో తెలియదు. కష్టపడతాడు. నవ్వుతూ పలకరిస్తాడు. ఆయన సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్, సంతోషం ఒటిటి అవార్డ్స్ 2025 కర్టెన్ రైజర్ ఈవెంట్ కూడా సక్సెస్ ఫుల్‌గా చేయాలని కోరుకుంటున్నా. అన్నారు. నిర్మాత ఏడిద రాజా మాట్లాడుతూ ఆయన సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్, సంతోషం

## సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్ 2025



ఒటిటి అవార్డ్స్ 2025 ఈవెంట్ ఎంతబాగా చేయబోతున్నాడు అనేది నాకూ చూడాలని ఉంది. సురేష్‌కు ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. అన్నారు. నిర్మాత కేఎస్ రామారావు మాట్లాడుతూ సురేష్ కొండేటి 24 ఏళ్లుగా దిగ్విజయంగా సంతోషం అవార్డ్స్ ఫంక్షన్ చేస్తుండటం మామూలు విషయం కాదు. ఆయనకు సినిమా పరిశ్రమలో ఒక ఇబ్బంది వచ్చినప్పుడు మీడియా మిత్రులు మరింతగా అతనికి అండగా నిలబడాల్సి ంది. నేను ఆ టైమ్ లో సురేష్ కు ఏదో ఒకటి చేయాలని ఎఫ్ఎన్ సీసీ కల్చరల్ కమిటీ అడిషనల్ ఛైర్మన్ గా నియమించాను. కానీ ఏ రోజు సురేష్ బాధపడటం నేను చూడలేదు. నవ్వుతూనే ఉన్నాడు. ఈ 24వ అవార్డ్స్ ఈవెంట్ కూడా సక్సెస్ ఫుల్‌గా చేయాలని కోరుకుంటున్నా. అన్నారు. సీనియర్ నటులు మురళీ మోహన్ మాట్లాడుతూ 24 ఏళ్లుగా అవార్డ్స్ ఈవెంట్ చేస్తున్న ఏకైక మేగజైన్ సంతోషం. తెలంగాణలో పదేళ్ల తర్వాత గద్దర్ అవార్డ్స్ ఇచ్చారు. ఎపిలో త్వరలో ఫిలిం అవార్డ్స్ ఇవ్వబోతున్నారు. ఈసారి ఈవెంట్‌కు స్పాన్సర్స్‌ను ఇస్తున్న మా విజయ్ కుమార్ గారికి మిగతా వారందరికీ థ్యాంక్స్. ఈ సారి ఈవెంట్ ఘనంగా చేయడానికి సపోర్ట్ చేస్తాం. అన్నారు. సంతోషం మేగజైన్ అధినేత సురేష్ కొండేటి మాట్లాడుతూ 35 యేళ్లుగా నేను జర్నలిస్ట్‌గా ఉన్నాను. నాకు చిరంజీవి గారు, నాగార్జున గారు రెండు కళ్లలాంటి వారు. అవార్డ్స్ ఫంక్షన్ అంటే ముళ్ల కిరీటం లాంటిది. నేను ఇబ్బందుల్లో ఉన్న టైమ్‌లో కేఎస్ రామారావు గారు పిలిచి ఎఫ్ఎన్ సిసి అడిషనల్ కల్చరల్ కమిటీ ఛైర్మన్‌గా నన్ను నియమించి ప్రోచహించారు. ఆ మధ్య తిరుపతి దర్శనానికి వెళ్లినప్పుడు అనిల్ గారు వారి పాట్నర్‌తో కలిసి నెక్స్ట్ ఈవెంట్ కోసం పది లక్షల రూపాయల అక్కౌంట్‌లో వేశారు. నా స్పాన్సర్స్ అందిరికీ కృతజ్ఞతలు చెబుతున్నా. మీ అందరి సపోర్ట్‌తో ఈసారి ఈవెంట్ కూడా ఘనంగా చేయబోతున్నాం" అన్నారు.

## 'కూలీ' పవర్ ప్యాక్డ్ ట్రైలర్ రిలీజ్



**సూపర్ స్టార్** రజనీకాంత్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'కూలీ'కి లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన లోకేష్ సినిమాటిక్ యూనివర్స్‌తో తన విజయాలని కొనసాగిస్తున్నారు. ప్రతిష్టాత్మక సన్ పిక్చర్స్ బ్యానర్ నిర్మించిన కూలీలో రీసెంట్ కుబేరతో బ్లాక్ బస్టర్ అందుకున్న కింగ్ నాగార్జున పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్‌ఖాన్ మరో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్లు, టీజర్లు, సాంగ్స్ సినిమాపై భారీ క్రేజ్‌ను నెలకొల్పాయి. చికిటు, మోనికా సాంగ్, పవర్ హౌస్ పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. ఎంతగానో ఎదురుచూస్తున్న కూలీ ట్రైలర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఒకడు పుట్టగానే వాడు 'ఎవడి చేతిలో చావాలో తలమీద రాసిపెట్టి ఉంటుంది' అనే నాగార్జున పవర్ ఫుల్ డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ పవర్ ప్యాక్డ్ మూమెంట్స్‌తో గూస్ బంప్స్ తెప్పించింది. 'అడుగు పెడితే విజలు మోగుల్లే' అనే పవర్ ఫుల్ బిజిఎంతో దేవా పాత్రలో రజనీకాంత్ ఎంట్రీ అదిరిపోయింది. రజనీకాంత్ స్వాగ్ ఆడియన్స్ మెస్మరైజ్ చేసింది. డైలాగులు, యాక్షన్ సీక్వెన్స్‌లు అదిరిపోయాయి. నాగార్జున లుక్ ఆడియన్స్‌ని చాలా సర్ ప్రైజ్ చేసింది, నెవర్ బిఫోర్ అవతార్‌లో కనిపించారు నాగార్జున. ఆయన క్యారెక్టర్ సినిమాలో ఎంత పవర్ ఫుల్‌గా వుంటుందో ట్రైలర్ తెలియజేసింది. సూపర్ స్టార్ అమీర్‌ఖాన్, సూపర్ స్టార్ ఉపేంద్ర ఎంట్రీలు అదిరిపోయాయి. సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతీ హాసన్ పాత్రలు చాలా ఆసక్తికరంగా వున్నాయి. డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కూలీ కోసం చేసిన వరల్డ్ బిల్డింగ్ అద్భుతంగా వుంది. ఆయన టేకింగ్ నెక్స్ట్ లెవెల్ ఎక్స్పీరియన్స్ ఇచ్చింది. అనిరుధ్ బ్యాగ్రౌండ్ నెక్స్ట్ లెవల్‌లో చేశారు. గూస్ బంప్స్ బీజీఎం ఇచ్చారు. గిరీష్ గంగాధరన్ సినిమాటోగ్రఫీ ఎక్స్ ట్రార్డినరీ వుంది. విజువల్స్ చాలా గ్రాండియర్‌గా వున్నాయి. కలానిధి మారన్ సన్ పిక్చర్స్ ప్రొడక్షన్ వ్యాల్యూస్ ఇంటర్నేషనల్ స్టాండర్డ్‌లో ఉన్నాయి. ట్రైలర్‌లో ప్రతి ఫ్రేమ్ నెక్స్ట్ లెవల్‌లో వుంది. ట్రైలర్ చాలా పవర్ ప్యాక్డ్‌గా వుంది. మొత్తానికి ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలని డబుల్ చేసింది. డి. సురేష్ బాబు, దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ప్రముఖ డిస్ట్రిబ్యూ షన్ సంస్థ ఏషియన్ మల్టీప్లెక్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కూలీ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ గ్రాండ్‌గా విడుదల చేయనుంది. ఈ చిత్రం 2025 ఆగస్టు 14న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది.

## 'కింగ్‌డమ్' సినిమాకి వచ్చినంత పేరు నాకు ఎప్పుడూ రాలేదు : ప్రముఖ నటుడు సత్యదేవ్



**విజయ్ దేవరకొండ** కథానాయకుడిగా నటించిన చిత్రం కింగ్‌డమ్. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే, వెంకటేష్ ముఖ్య పాత్రలు పోషించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. భారీ అంచనాల నడుమ జూలై 31వ తేదీన విడుదలైన 'కింగ్‌డమ్' చిత్రం.. ప్రేక్షకులను మెప్పు పొందుతూ భారీ వసూళ్లను రాబడుతోంది. కింగ్‌డమ్ చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందన నేపథ్యంలో.. తాజాగా పాత్రికేయులతో ముచ్చటించిన సత్యదేవ్, పలు ఆసక్తికర విషయాలను పంచు కున్నారు.

**కింగ్‌డమ్ లాంటి భారీ సినిమాలో శివ అనే పవర్ ఫుల్ రోల్ చేశారు.. స్పందన ఎలా ఉంది?** ఇప్పటిదాకా ఈ సినిమాకి వచ్చినన్ని ఫోన్ కాల్స్ నాకు ఎప్పుడూ రాలేదు. మొదటి షో నుంచి అందరూ ఫోన్లు చేసి అభినంది స్తూనే ఉన్నారు. గౌతమ్ నాకు కింగ్‌డమ్ కథ చెప్పగానే ఎలాంటి లెక్కలు వేసుకోకుండా వెంటనే ఈ సినిమా చేస్తున్నానని చెప్పాను. అంత నచ్చింది నాకు ఈ కథ. నా నమ్మకం నిజమై, ఇప్పుడు సినిమాకి ఇంతటి ఆదరణ లభిస్తుండటం సంతోషంగా ఉంది. బ్లఫ్ మాస్టర్ సినిమాకి నాకు పేరొచ్చింది కానీ, అది జనాల్లోకి వెళ్ళడానికి సమయం తీసుకుంది. భారీతనం, విజయ్ ఫ్యాన్ ఫాలోయింగ్ వంటి అంశాలు తోడై.. 'కింగ్‌డమ్' సినిమా తక్కువ సమయంలోనే ఎక్కువ మందికి చేరువైంది. **శివ పాత్ర మీ దగ్గరకు ఎలా వచ్చింది?** శివ పాత్ర కోసం మొదట గౌతమ్ నా పేరే రాసుకున్నారట. కానీ, ఏవో కారణాల వల్ల నన్ను సంప్రదించలేదు. మధ్యలో వేరే నటులతో కూడా చేద్దామనుకున్నారు. సరిగ్గా షూటింగ్‌కి వెళ్లడానికి కొద్దిరోజుల ముందు గౌతమ్ నన్ను కలిసి ఈ కథ చెప్పారు. కథ నాకు విపరీతంగా నచ్చి, వెంటనే సినిమా చేస్తున్నాని చెప్పాను. అప్పుడు గౌతమ్ శివ పాత్ర కోసం నేను మొదట ఎవరి పేరు రాసుకున్నానో.. వాళ్లతోనే చేస్తుండటం సంతోషంగా ఉంది. అని చెప్పారు. 'మనం తినే ప్రతి మెతుకు మీద మన పేరు రాసి ఉంటుంది' అంటారు కదా.. అలాగే ఏ పాత్ర ఎవరు చేయాలనేది కూడా రాసి పెట్టి ఉంటుందేమో అనిపించింది. **ఈ సినిమాలో మీ యాక్షన్ సీన్స్‌కి అద్భుతమైన స్పందన రావడం ఎలా అనిపించింది?** ఎప్పుడైనా యాక్షన్ సీన్ ప్రేక్షకులకు కనెక్ట్ అవ్వాలంటే దాని వెనుక బలమైన ఎమోషన్ ఉండాలని నేను నమ్ముతాను. ఇందులో అలాంటి ఎమోషన్ ఉంది కాబట్టే.. నా యాక్షన్ సీన్స్ కి అంత మంచి స్పందన వస్తోంది. **ఈ చిత్రంలో మీకు ఛాలెంజింగ్ గా అనిపించిన సీన్ ఏంటి?** విజయ్ నా తమ్ముడు అని తెలిసిన తర్వాత జైల్లో మా ఇద్దరి మధ్య సంభాషణ జరుగుతుంది. తమ్ముడంటే మనసులో ఎంతో ప్రేమ ఉన్నా.. పైకి మాత్రం అది పూర్తిగా చూపించకూడదు. ఎందుకంటే తమ్ముడు 'నాతో ఉండిపోతాన్న' అంటాడనే భయం నాలో ఉంటుంది. అసలు గౌతమ్ నా పాత్రను రాసిన తీరే అద్భుతంగా ఉంది. ఓ వైపు తమ్ముడు, మరోవైపు దివి ప్రజలు, ఇంకో వైపు ఒక నిజం తెలుసు కానీ ఎవరికీ చెప్పలేదు. ఇలా ఆ పాత్ర చుట్టూ ఎంతో ఎమోషన్ ఉంది. అందుకే డ్రామా అంతలా పండింది. సినిమాలో ఫిజికల్‌గా ఛాలెంజింగ్ అనిపించిన సీన్ మాత్రం ప్రీ క్లయిమాక్స్ ఎపిసోడ్. ఇప్పుడు ప్రేక్షకుల నుంచి వస్తున్న రెస్పాన్స్ చూశాక.. ఆ కష్టమంతా మరిచిపోయాను. **విజయ్ దేవరకొండ గురించి?** విజయ్‌తో నాకు అంతకముందు పరిచయం లేదు. కలిసిన తర్వాత తెలిసింది విజయ్ చాలా మంచి వ్యక్తి అని. తక్కువ సమయంలోనే మా ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఏర్పడింది. విజయ్‌ని నేను నిజంగానే ఒక బ్రదర్ లా ఫీల్ అయ్యాను. విజయ్ అంత మంచి వ్యక్తి కావడం, నాతో అంత మంచిగా ఉండటం వల్లే ఇది సాధ్యమైంది. అలాగే, విజయ్ గొప్ప నటుడు. సన్నివేశాన్ని కానీ, సంభాషణలను కానీ అతను అర్థం చేసుకొని నటించే తీరు నన్ను ఆశ్చర్యపరిచింది. **నిర్మాత నాగవంశీ గురించి?** నాగవంశీ గట్స్ ఉన్న ప్రొడ్యూసర్. ఒక కథను నమ్మి సినిమా చేద్దాం అనుకున్నారంటే.. ఎక్కడా వెనకడుగు వేయరు, ఏ విషయంలోనూ రాజీపడరు. పరిశ్రమలో వంశీ తనకంటూ ప్రత్యేక పంథాను సృష్టించుకున్నారు కాబట్టే.. సితార ఎంటర్‌టైన్మెంట్స్ ఇంత పెద్ద నిర్మాణ సంస్థగా ఎదిగింది. **ఈ సినిమాకి మీకు వచ్చిన బెస్ట్ కాంప్లిమెంట్ ఏంటి?** ఒక్కరిని కాదు. చాలామంది ప్రశంసించారు. ముఖ్యంగా పలువురు సినీ ప్రముఖులు ఫోన్లు చేసి నన్ను అభినందించడం చాలా సంతోషాన్ని ఇచ్చింది. **తదుపరి ప్రాజెక్ట్‌లు?** అరేబియన్ కడలి అనే సిరీస్ చేశాను. అమెజాన్ ప్రైమ్‌లో ఆగస్టు 8 నుంచి స్ట్రీమింగ్ కానుంది. 'ఫుల్ బాటిల్' అనే సినిమా కూడా విడుదలకు సిద్ధమవుతోంది. వెంకటేష్ మహా దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను. ఆరంభం ఫేమ్ అజయ్ నాగ్ తోనూ ఓ చిత్రం చేస్తున్నాను. వీటితో పాటు మరో రెండు సినిమాలు ఉన్నాయి.

### సిఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు

## 'డేంజర్' అంటూ డ్రగ్స్‌పై హీరో కృష్ణసాయి పోరాటం



**విద్యార్థులు** గంజాయి కోరల్లో చిక్కుతున్నారు. పుస్తకాలు ఉండాల్సి న వారి బ్యాగుల్లో మాదక ద్రవ్యాలు దర్శనమిస్తున్నాయి. డిగ్రీలు పూర్తి చేయక ముందే డ్రగ్స్‌కి బానిసై భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు. ఉద్యోగాలు చేయాల్సి న వయసులో మత్తు అనే ఊబిలో కూరుకు పోతున్నారు. ఇదేంటని అడిగిన తల్లిదండ్రులపై దాడులు చేసే పశు ప్రవర్తనలకు దిగజారి పోతున్నారు. అదే మత్తులో హత్యలు, అత్యాచారాల వంటి ఆరాచకాలు ఎన్నో. అలాంటి డ్రగ్స్‌ను అరికట్టేందుకు తనవంతు బాధ్యతగా హీరో కృష్ణసాయి ప్రచార చిత్రాలను తీస్తున్నారు. డ్రగ్స్‌పై యువతకు అవగాహన కల్పించాలని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుకు స్పందించిన హీరో కృష్ణసాయి పలు ప్రచార చిత్రాలను రూపొందిస్తున్నారు. కృష్ణ సాయి చారిటబుల్ ట్రస్ట్ నిర్మాణంలో 'ఓ యువతా నీ గమ్యం ఎటు వైపు?' అనే సందేశంతో రూపొందించిన ప్రచార వీడియోకు మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా తెలుగు ఫిలిం ఛాంబర్ ఆవరణలో హీరో కృష్ణసాయి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. హీరో కృష్ణసాయి మాట్లాడుతూ, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి గారి పిలుపు మేరకు, మా బాధ్యతగా డ్రగ్స్‌పై ఓ చైతన్యపూరిత గీతాన్ని రూపొందించాం. ప్రతి సినిమాకి ముందు 'స్మోకింగ్ డేంజర్' అని హెచ్చరికలు చేసే మెసేజ్ వలన యువతలో అవగాహన కలిగడంతో సిగరెట్, తంబాకు, గుట్కా వినియోగం బాగా తగ్గిపోయింది, సినిమా మాధ్యమం వల్ల ప్రజలు ప్రభావితం అవుతారు. అందుకే ఇప్పుడు డ్రగ్స్‌పై అవగాహన పెంచేందుకు మేం రూపొందించిన పాటను 'డేంజర్' అనే సినిమాలోనిది. ఈ సినిమా యువతను మార్పు దిశగా నడిపిస్తుందని నమ్మకం ఉంది," అని అన్నారు. ఇటీవల డ్రగ్స్‌పై పాట రూపొందించిన హీరో కృష్ణసాయి అందులో నటించారు. ఈ ప్రచార చిత్రానికి ప్రముఖుల నుంచి ప్రశంసలు వచ్చాయి. అప్పటి గవర్నర్లు తమిళిసై, దత్తాత్రేయ, కేంద్ర క్యాబినెట్ మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ డీజీపీ జితేందర్, హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఇతర ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు ఈ డ్రగ్స్ పాటను వీక్షించి హీరో కృష్ణసాయిని అభినందించారు.

## సెప్టెంబర్ 12న రానున్న 'లిటిల్ హార్ట్స్'



"90 మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ మౌళి తనుజ్, "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మూవీ "లిటిల్ హార్ట్స్". ఈ చిత్రాన్ని ఇటివి విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ్ రూపొందించారు. "90 మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ "లిటిల్ హార్ట్స్" మూవీకి నిర్మాతగా వ్యవహరించారు.

ఈ రోజు ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. 'లిటిల్ హార్ట్స్' చిత్రాన్ని సెప్టెంబర్ 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ సందర్భంగా విడుదల చేసిన ప్రోమోలో తండ్రీ కొడుకులుగా మౌళి తనూజ్, రాజీవ్ కనకాల నటించిన సరదా సన్నివేశం ఆకట్టుకుంటోంది. ఫ్యామిలీ ఎమోషన్స్, ఎంటర్ టైన్ మెంట్‌తో రూపొందించిన ఈ సినిమా కంటెంట్ నచ్చి ప్రముఖ నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి 'లిటిల్ హార్ట్స్' చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. నటీనటులు మౌళి తనూజ్, శివానీ నాగరం, రాజీవ్ కనకాల, ఎస్ ఎస్ కాంచి, అనిత చౌదరి, సత్య కృష్ణన్, తదితరులు. టెక్నికల్ టీమ్: రచన, దర్శకత్వం సాయి మార్తండ్, ప్రొడ్యూసర్: ఆదిత్యహాసన్ పిఆర్ఓ జిఎస్‌కె మీడియా (సురేష్ శ్రీనివాస్), మ్యూజిక్: సింజిత్ యెర్రమల్లి, సినిమాటోగ్రఫీ: సూర్య బాలాజీ, ఎడిటర్ : శ్రీధర్ సొంపల్లి, ఆర్ట్ డైరెక్టర్: దివ్యపవన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: వినోద్ నాగుల, మురళీ పున్న.

## 'సు ఫ్రమ్ సో' ఆగస్ట్ 8న విడుదల



**కన్నడలో లేటెస్ట్** సెన్సేషనల్ హిట్ 'సు ఫ్రమ్ సో' ఇప్పుడు తెలుగులో సందడి చేయడానికి సిద్ధంగా ఉంది. ఇది తెలుగు ప్రేక్షకులకు పర్ఫెక్ట్ ఎంటర్‌టైనర్ కావడంతో మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను ఆగస్ట్ 8న గ్రాండ్‌గా రిలీజ్ చేయనుంది. ఈ హిలేరియస్ కామెడీ ఎంటర్‌టైనర్ కు జెపి తుమినాడ్ దర్శకత్వం వహించారు. ప్రధాన పాత్రల్లో షనీల్ గౌతమ్, జెపి తుమినాడ్, సంధ్య అరకెరె, ప్రకాష్ కె తుమినాడు, దీపక్ రాయ్ పనాజే, మైమ్ రాందాస్ అద్భుతమైన నటనతో అలరించారు. శశిధర్ శెట్టి బరోడా, రవి రాయ్ కలసా, రాజ్ బి శెట్టి నిర్మించిన ఈ చిత్రం కన్నడలో క్రిటిక్స్ అప్రిసియేషన్‌తో పాటు బాక్సాఫీస్ వద్ద మంచి ఘన విజయం సాధించింది. ఎస్. చంద్రశేఖరన్ సినిమాటోగ్రఫీ, సుమేధ్ కె సాంగ్స్, సందీప్ తులసీదాస్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాయి. ఈ బ్లాక్ బస్టర్ ఎంటర్‌టైనర్‌ని రెండు తెలుగు రాష్ట్రాలలో మైత్రీ మూవీ మేకర్స్ గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నారు. పర్ఫెక్ట్ హ్యూమర్, రిఫ్రెషింగ్ నరేషన్, ఆసక్తికరమైన పాత్రలు కలగలిపిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు నవ్వుల పండుగ అందించబోతోంది.

## లక్ కలిసి రాని సిద్ధిక




**2019లో సిద్ధిక** 'ప్రేమ పరిచయం' అనే తెలుగు చిత్రంలో నటించింది. 2012 నుంచి చిత్రసీమలో కెరీర్ పోరాటం సాగిస్తోంది సిద్ధికా శర్మ. ఈ పంజాబీ బ్యూటీ అందచందాలు, ప్రతిభకు యువతరంలో ఫాలోయింగ్ ఏర్పడింది. అయినా లక్ కలిసి రాక, ఆశించిన హిట్లు దక్కక కెరీర్ పరంగా రేసులో వెనకబడింది. 2012లో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఈ బ్యూటీ ఆల్ ది బెస్ట్, గల్లీ కుర్రోళ్లు చిత్రాల్లో నటించింది. ఆ తర్వాత క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ తెరకెక్కించిన పైసాలో నటించింది. ఈ చిత్రంలో నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించారు. 'పైసా' ఫ్లాప్ షోగా మిగలడం సిద్ధిక టాలీవుడ్ బిగ్ డ్రీమ్స్‌కి గండి కొట్టింది. ప్రతిభావంతుడైన కథానాయకుడు, పెద్ద దర్శకుడు కూడా సిద్ధిక ఫేట్‌ని మార్చ లేకపోయారు. జయా పజయాలతో సంబంధం లేకుండా తెలుగు చిత్రసీమ అవకాశాలు కల్పించింది. మాతృపరిశ్రమ పంజాబీలో ఓయ్ మక్నా అనే చిత్రంలోను సిద్ధిక ఆడిపాడింది. కానీ ఆ తర్వాత అక్కడ నటించలేదు. 2024లో ఆపరేషన్ లైలా అనే చిత్రంతో తమిళంలో కూడా అడుగుపెట్టింది. కానీ అక్కడా పాప్పులుడకలేదు. హిట్టు మాత్రమే కోరుకునే పరిశ్రమలో ఒడిదుడుకుల ప్రయాణానికి సిద్ధిక అలవాటు పడిపోయింది. సిద్ధిక కూడా చాలా పోరాటాల తర్వాత బాలీవుడ్ లోను ప్రయత్నాలు ప్రారంభించింది.



# ఆర్థిక ప్రణాళికతో అందలం

మన జీవితంలో చాలా అంశాలు డబ్బుతోనే ముడిపడి ఉంటాయి. కాబట్టి ప్రతి ఒక్కరూ చిన్న వయసు నుంచే ఆర్థిక క్రమశిక్షణను అలవరచుకుంటే చాలా సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చంటున్నారు నిపుణులు. ముఖ్యంగా 20ల్లోనే కెరీర్ ప్రారంభించే వారు ముందు నుంచే ఆర్థిక విషయాల్లో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అవేంటో తెలుసుకుందాం..



బడ్జెట్ ఆర్థిక క్రమశిక్షణలో మొదటి, ముఖ్యమైన అంశం బడ్జెట్ ప్రణాళిక వేసుకోవడం! ఈ విధంగా మీ ఆదాయ వ్యయాలను దృష్టిలో పెట్టుకోవాలి. అధిక ఖర్చులకు కళ్లెం వేసుకోవాలి. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కొంత డబ్బును పొదుపు చేసుకోవడం, లాభాలొచ్చే పథకాల్లో పెట్టుబడులు పెట్టడం.. వంటివీ ముఖ్యమే! ఇలా మీరు వేసుకున్న ప్రణాళికకు కట్టుబడి ఉండటం తప్పనిసరి! ఇక ఈ విషయాల్లో అవగాహన కోసం, సందేహాల నివృత్తి కోసం నిపుణులను సంప్రదించొచ్చు.. లేదంటే విశ్వసనీయమైన మొబైల్ యాప్స్‌ని ఆశ్రయించచ్చు.

**సిబిల్ స్కోర్ బాగుంటేనే.. ........**
కొన్ని లక్ష్యాలను సాధించడానికి అధిక మొత్తంలో డబ్బు అవసరమవుతుంది. అలాంటి సందర్భాలలో బ్యాంకులను ఆశ్రయించాల్సిన అవసరం రావచ్చు. అలాంటప్పుడు బ్యాంకులు సిబిల్ స్కోర్‌ను తనిఖీ చేస్తాయి. ఈ స్కోర్ మీ ఆర్థిక క్రమశిక్షణను నిర్ణయిస్తుంది. కాబట్టి ఇరవైల్లో ఉన్నప్పటి నుంచే మీ సిబిల్ స్కోర్ పడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. క్రెడిట్ కార్డుకి సంబంధించిన లావాదేవీలను కొంత అదుపులో పెట్టుకోవాలి. ఆ బిల్లులను కూడా గడువు లోపు చెల్లించాలి. ఇలా చేయడం వల్ల భవిష్యత్తులో ఇల్లు కొనుక్కోవడం, సొంతంగా బిజినెస్ పెట్టుకోవడం వంటి లక్ష్యాల కోసం కావాల్సిన డబ్బును బ్యాంక్ లోన్ల ద్వారా సులభంగా పొందవచ్చు. రెండో ఆదాయం కూడా!. ఖిఎప్పుడూ ఒకేపై ఆధారపడద్దు. పెట్టుబడులతో ఇతర ఆదాయ మార్గాలను అన్వేషించాలిఖి ప్రముఖ వ్యాపారవేత్త వారెన్ బఫెట్ చెప్పిన మాట ఇది! ఈ పద్ధతిని ఇరవైల్లో ఉన్నప్పట్నుంచే పాటిస్తే భవిష్యత్తులో ఆర్థికంగా దృఢంగా మారచ్చు. చాలామంది కష్టపడి ఉద్యోగం తెచ్చుకున్న తర్వాత కేవలం ఆ సంపాదన పైనే ఆధారపడుతుంటారు. ఈ మిగిలిన సమయాన్ని వృథా చేస్తారు. అయితే దీనికి బదులుగా నిపుణుల సలహాతో సరైన పెట్టుబడుల ద్వారా రెండో ఆదాయ మార్గాన్ని సృష్టించుకోవడం ద్వారా స్థిరత్వాన్ని సంపాదించుకోవచ్చు.

**అత్యవసర నిధి !** అత్యవసర పరిస్థితుల్లో అప్పులు చేయకుండా అత్యవసర నిధి కాపాడుతుంది. నెలా మీ వేతనంలో కొంత కేటాయించాలి. ఆ డబ్బుని ఎప్పుడు పడితే అప్పుడా తీయడానికి వీలు లేకుండా ప్రత్యేక ఏర్పాటు చేసుకోవాలి. ఇలా చిన్న వయసులో ఇలాంటి పద్ధతిని పాటించడం వల్ల.. భవిష్యత్తులో ఆర్థిక అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు సులభంగా బయటపడగలుగుతారు.

**లాభాలొచ్చేలా...** వృథా ఖర్చులు చేయదన్నారు. ఇలా చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదంటున్నారు నిపుణులు. నెల ఖర్చులు పోగా మిగిలిన డబ్బును ఆర్థిక నిపుణుల సలహాతో మ్యూచు వల్ ఫండ్స్ వంటి పెట్టుబడులు పెట్టడం వల్ల లాభాల్ని ఆర్జించచ్చంటున్నారు.



# ఆవిష్కరణలు-ఆత్మ విశ్వాసం !



**పిల్లలకు పాఠాలు సరిగ్గా బోధించేలా చూస్తే చాలు అనుకోలేదామె. వాళ్లలోని నైపుణ్యాలకు సానబెట్టాలనుకున్నారు. చదివింది నిత్య జీవితంలో ఉపయోగించుకునేలా చూశారు. కాబట్టి, ఆ విద్యార్థులు చదువుల్లో రాణిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల నుంచి ఇలా మెరికలను తయారు చేసిన ఆ టీచరమ్మ యలమంచిలి దుర్గాభవాని తన కృషితో షైనింగ్ టీచర్ ప్రభుత్వ గుర్తింపు సాధించారు.**

మంచి చేయాలన్న సంకల్పం ఉంటే ఏది అసాధ్యం కాదని నమ్ముతారు దుర్గా భవాని, అయిదేళ్లు పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేశారు. ఇప్పుడు ప్రైవేటు స్కూళ్లలోనే ఉత్తమ విద్య దొరుకుతుందన్న నమ్మకం అందరిదీ. ఆ అభిప్రాయాన్ని మార్చడానికి తల్లిదండ్రులు, విద్యార్థులకు నిరంతరం కౌన్సెలింగ్ నిర్వహించే వారమే. అలా వారి నమ్మకాన్ని సాధించారు. కేవలం పాఠాలకే పరిమితం కాలేదు. ఆటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు వారే పరిష్కారాలు కనుక్కునేలా ప్రోత్సహించారు. ఫలితమే తడిచిన ధాన్యం ఆరబోసే యంత్రం, పాఠశాలలో చెత్తను శుభ్రం చేయడానికి పాత వస్తువుల నుండి బ్లోయర్, ఆల్కహాల్ సెన్సింగ్ హెల్మెట్... ఇలా ఎన్నో ఆవిష్కరణలు ఇక్కడ రూపొందించబడ్డాయి. దీనికోసం రోజూ సాయంత్రం రెండు గంటల సమయాన్ని కేటాయించారు. విద్యార్థులకు సాయం చేయడానికి స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేశారు దుర్గా భవాని, కమ్యూనిటీ మొబిలైజేషన్ ద్వారా వాల్ ఆర్ట్, డ్యాన్స్, మ్యూజిక్ తరగతులు, కంప్యూటర్ శిక్షణ వంటి వాటిని అందించారు. దుస్తులు కుట్టడంలోనూ శిక్షణివ్వడంతో విద్యార్థులే వాళ్ల యూనిఫామ్‌లు కుట్టుకుంటున్నారు. విద్యార్థులు తయారు చేసిన వస్తువులను పేరెంట్-టీచర్ మీటింగ్ సమయంలో అమ్మకానికి ఉంచే వారు. వాటిని మెచ్చి తల్లిదండ్రులలే కొనడానికి ఆసక్తి చూపించే వారు. సదుపాయాల కొరతకు దాతల సాయం కోరారు. అలా ఆ కొరతనీ తీర్చారు. ఇవన్నీ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచాయి ఫలితమే... ఈ ఏడాది పదో తరగతిలో 54 మంది విద్యార్థులు.. 500కు పైగా మార్కులు సాధించారు. ఏడుగురు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు పొందారు. రాష్ట్రంలోనే తొలిసారిగా తమ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేనీ నిర్వహించడం. 'పేదవాళ్లే ప్రభుత్వ పాఠశాలలకు వస్తారన్న భావన మారాలి. విద్యార్థులు నేర్చుకున్నది పూర్తి స్థాయిలో అవగాహన చేసుకోగలగాలి. ఆచరణలో పెట్టాలి. అప్పుడే ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఈ విధానాన్నే అనుసరించాం. ఫలితాలూ రాబట్టగలిగాం అంటారు దుర్గాభవాని, తాజాగా ఈమెని పమిడిముక్కలకి బదిలీ చేశారు. అయినా ఈమె చర్యలు విద్యార్థుల్లో ప్రభుత్వ విద్యాలయాలపై నమ్మకాన్ని పెంచుతాయి. ఈ పాఠశాలలోనే ఇంటర్ చదివే అవకాశం ఉండటంతో 96 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. దుర్గాభవాని సేవలు, తన సాధించిన ఫలితాలను గుర్తించిన అందరూ అభినందించారు. 'షైనింగ్ టీచర్' అంటూ సన్మానించారు.

## ఇలా చేయరాదు



తగ్గాలని రాత్రిపూట భోజనానికి బదులు ఆయిల్ లేని చపాతీలు, రోటీలు తింటుంటారు. అయితే అవి మెత్తగా రావాలని పెనంమీద కాసేపు వేడి చేసి తరవాత నేరుగా స్టవ్ మంటపై కాలుస్తుంటారు. దీని గురించి తాజా పరిశోధన ఏమంటోందంటే. ఇలా నేరుగా పెద్ద మంటపై కాలచ్చడంవల్ల రోటీలోని కర్బన పదార్థాలు విచ్ఛిన్నమై కొద్దిస్థాయిలో హానికర అమైన్లూ హైడ్రోకార్బన్లూ ఉత్పత్తవుతాయి. వీటివల్ల శ్వాసకోశ సమస్యలు, గుండె జబ్బులు, క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది అంటున్నాయి. తాజా పరిశోధనలు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఈ విషయమై హెచ్చరిక చేస్తోంది. మీరూ ఇలా చేస్తున్నారా.. కాబట్టి జాగ్రత్త.

# తియ్యటి రాఖీలు




అన్నయ్య మీద మాటలకందని మమకారం.
చిట్టి తమ్ముడి మీద చెప్పలేనంత అనురాగం.
ఆ ప్రేమకి సాక్ష్యమే రక్షాబంధనం. రాఖీలు తియ్యటి పండ్లు, మిఠాయిల రూపం దాలిస్తే ఇక చెప్పాల్సిందేముంది.
మాధుర్యానికి మచ్చుతునకలు. నచ్చితే మీరూ ఇలాంటివి ప్రయత్నించండి.









# హాస్యాన్నే కెరియర్‌గా..

వేయి సూక్తులు విన్నా చలించని వాళ్లు ఉంటారేమో కానీ, హాస్యాన్ని ఆస్వాదించని వారుండరంటే అతిశయోక్తి కాదు! అందుకే 'నవ్వని రోజు వృథా అయినట్టే' అని చార్లీ చాప్లిన్ అంటే, జీవితమంటే అలా బతికేయడమే కాదు, అందులో కొంత హాస్యం కూడా ఉండాలంటారు అమెరికా రచయిత్రి మయా ఏంజెలో. అమ్మాయంటే ఇలానే నవ్వాలి. అనే రోజుల నుంచి హాస్యాన్నే తమ కెరియర్‌గా మలుచుకుంటోన్న అమ్మాయంటే ఇలానే నవ్వాలి. అనే రోజుల నుంచి హాస్యాన్నే తమ కెరియర్‌గా మలుచుకుంటోన్న అమ్మాయిలూ పెరిగారు. ఫటాఫట్ పంచులు వేసినా, స్టాండప్ కామెడీ చేసినా.. వారి అంతిమ లక్ష్యం ఎదుటివారి ముఖంలో నవ్వులు పూయించడమే. సాధారణంగా మనమెవరైనా తప్పులు చేశామనుకోండి అందులో ఫన్‌కి పెద్దగా ఆస్కారం ఉండదు. కానీ యూట్యూబర్లు, నటీనటులు, న్యూస్ రీడర్లు..లాంటి వాళ్ల వీడియో రికార్డింగ్ చేసేటప్పుడు దొర్లే తప్పులు అవేనండీ బ్లూపర్స్.. అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. సైకాజికల్‌గా చెప్పాలంటే.. ఇలా సరదా తప్పులకు నవ్వే పద్ధతిని బినైన్‌వయొలేషన్ థియరీ అంటారు. నిజానికి వాళ్లు చేసే ఆ కార్యక్రమాన్ని ఎంతమంది చూస్తారో తెలియదు కానీ, ఆ బ్లూపర్ వీడియోలు మాత్రం తెగ వైరల్ అవుతుంటాయి. మిలియన్ల కొద్దీ వీక్షణలు సొంతం చేసుకుంటుంటాయి. ఉదాహరణకు ఓ న్యూస్ రీడర్ సీరియస్‌గా వార్తలు చదువుతున్నప్పుడు మధ్యలోవాళ్ల బాబు లేదా పాప వచ్చి డిస్టర్బ్ చేస్తే ఏమవుతుందో ఒకసారి ఉహించుకోండి. లైవ్ ఆగిపోయిందనుకుని యాంకర్ మరేదో విషయం మాట్లాడుతుంటే నవ్వులే నవ్వులు.



## ఆ నాలుగు..



**కూరగాయలు కోసుకోవడానికి** చాకూ, చాపింగ్ బోర్డూ అందరి ఇళ్లలోనూ ఉంటాయి. సాధారణంగా పండ్లూ, కూరగాయలు, మాంసాహారం అన్నింటికీ దాన్నే ఉపయోగించేస్తుంటారు చాలామంది. అలాంటప్పుడు పండ్ల ముక్కలు నీచు వాసన వచ్చాయనుకోండి. అసలు నోట్లోనే పెట్టుకోలేం కదా. అలాంటి ఇబ్బందులేమీ లేకుండా ఉండాలంటే హాయిగా ఈ సెట్టును వాడుకోవచ్చు. చికెన్, మాంసం, కూరగాయలూ, పండ్లూ.. ఇలా వేటిక గా ప్రత్యేకంగా కొనుకు నేలా వీటిని తయారు చేశారు. నాలుగు వేర్వేరు రంగుల్లో ఉంటాయి. కాబట్టి.. ఏ పనికి వాడాల్సిన దాన్ని దానికే వాడొచ్చు. పైగా దీనికి ఉండే కరెంటు కనెక్షన్‌తో అరగంటలో ఆరబెట్టు కోవచ్చు కూడా.

# దేవుడెక్కడున్నాడు ?



**మనశ్శాంతి కోసం** మనం గుడికి వెళ్తాం. అందువల్ల ఆలయంలో ప్రవేశించగానే ఆవేశం లేకుండా అందరి పట్లా అభిమానం, ఆదరణ, వినమ్రత, సేవాభావాలతో మెలగాలి. రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించాలి. కానీ నేడు మందిరంలో కూడా అలాంటి సద్భావన, ప్రశాంత వాతావరణం కనిపించటం లేదు. వేగంగా తిరిగెళ్లిపోవాలంటే తొందరపాటు, ఏవేవో విషయాల గురించిన అలజడి, ఆందోళన వంటివన్నీ మనసులో ముసురుకుంటే ఇక దేవుడెక్కడ కనిపిస్తాడు? దైవం ఎక్కడ అనే ప్రశ్నకు గీతాచార్యుడు చెప్పిన సమాధానం అర్జునా! ఈశ్వరుడు సర్వప్రాణుల హృదయాల్లో ఉంటాడు. తన మాయాశక్తితో సకల జీవులను యంత్రంలా నడిపిస్తున్నాడు. అతడు మనలో కూడా ఉన్నాడనే కదా అర్థం. ఈశ్వరుడు అనగానే సర్పభూషణుడు, చంద్రశేఖరుడు, ఫాలనేత్రుడు, గజచర్మాంబరధారి అంటూ ఆయా రూపాల్లోనే ఉంటాడని భావించాల్సిన అవసరం లేదు. దేవుడు 'సర్వాంతర్యామి' అన్నది తెలుసుకోవాలి. ఇందుగలడందు లేడను సందేహం వలదని భక్తప్రహ్లాదుడు తన తండ్రి హిరణ్యకశిపుడు వివరించినది మనకు తెలుసు కదా! కనుక సర్వేశ్వరుడు అందరిలోనూ ఉన్నాడు. మన మనసులోనూ కొలువై ఉన్నాడు. మరి దైవాన్ని సాక్షాత్కరింపచేసుకోవాలంటే. మన హృదయాలను పరిశుద్ధంగా ఉంచుకోవాలి.

ఆధ్యాత్మికం

# డైట్‌లో ఇవి తప్పకుండా ..

**అధిక బరువుతో బాధపడుతున్న మహిళలు, యువతుల డైట్‌లో ఓట్స్ తప్పకుండా ఉండాల్సిందే.. కాలక్రమేణా ఈ జాబితాలోకి వచ్చి చేరింది. చిరుతిండిగానూ దీన్ని తింటున్నారు. అయితే బరువు తగ్గాలంటే ఈ రెండింటిలో ఏదీ తింటే మంచిది అంటే..**

ప్రొటీన్, ఫైబర్, కార్బోహైడ్రేట్లు వంటి పోషకాలను అందించడంలో ఓట్స్, మ్యూజ్లీ రెండే దేనికవే సాటి కానీ బరువుతగ్గాలనుకునేవాళ్లు మాత్రం ఓట్స్‌ను అల్పాహారంలో తీసుకుంటే ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయంటున్నారు నిపుణులు. తృణ ధాన్యాల్లో గ్లూటెన్ లేనివి ఓట్స్ మాత్రమే. విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు దీనిలో పుష్కలంగా ఉన్నాయి. మ్యూజ్లీలో పాల, పండ్లు, డ్రైఫ్రూట్స్, గింజలు అధికంగా ఉంటాయి. అందువల్ల దీనిలో కెలోరీలు ఎక్కువ. ఓట్ మీల్క్ ఎక్కువసేపు కడుపు ను నిండుగా ఉంచుతుంది. అల్పా హారంలో దీన్ని తినడం వల్ల ఆకలినీ నియంత్రిస్తుంది. దీనిలో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడు తుంది. మ్యూజ్లీ జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. రోజూ ఒకే రకమైన అల్పాహారం తిని విసుగనిపించే వాళ్లు మిల్క్, వెజిటబుల్ ఓట్స్ మాత్రమే కాకుండా ఇడ్లీ, దోవ, వడ లాంటివీ దీంతో చేసుకుని తినొచ్చు. మ్యూజ్లీతో అది సాధ్యం కాదు. పైగా చాలామంది దీన్ని చక్కెరతో కలిపి తినడానికి ఇష్టపడతారు. ఓట్స్ రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. గుండె సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. కాబట్టి బరువు తగ్గాలంటే రెండింటిలో ఓట్స్ బెటరన్నమాట.



# సరదాగా చదివిద్దాం!

**ప్రతి తల్లిదండ్రులు** తమ పిల్లలతో పోటీపడాలని ఆరాటపడుతుంటారు. పరీక్షల్లో మంచి మార్కులు, ర్యాంకులు వస్తే బాగుంటుందని వారిపై ఒత్తిడి తెస్తారు. ఎవరిని టీవీలు చూడొద్దు. ఫోన్కి దూరంగా ఉండు అంటూ చాలానే శరతులు పెడుతుంటారు కదా! నిజానికి పిల్లల్ని ఎంత ఎక్కువ ఒత్తిడి చేస్తే అంత చదువుకి దూరంగా ఉంటారు. చదవమని బలవంతం చేయడం కంటే సరదాగా చదివేలా ప్రోత్సహించండి. అలాకాకుండా ఖినీ ఫ్రెండ్‌కి మార్కులు ఎక్కువ వచ్చాయి. నువ్వు ఇంకా బాగా చదవాలిఖి అన్న ప్రతిసారి అది వారికి టాస్క్ లా అనిపిస్తుంది. అందుకే ఎప్పుడూ వారితో పాఠ్య పుస్తకాలు కాకుండా అప్పుడప్పుడు కామిక్ బుక్స్ చదివించండి. ఉదాహరణకు కొంతమంది పిల్లలకి జంతువులంటే ఇష్టం. ఇంకొంతమందికి సూపర్ హీరోలు నచ్చుతారు. మరికొంతమందికి ఇంకో రకమైన ఆసక్తి ఉండొచ్చు. మీకి ఏవి ఇష్టమో వాటికి సంబంధించిన పుస్తకాలు చదివితే సరదాగా అనిపించడమే కాదు, పాఠ్యపుస్తకాలనూ ఇష్టంగా చదువుతారు.



# తెలుసుకుందాం. .

**శిశువుల చర్మం** పెద్దవారితో పోలిస్తే ఐదురెట్లు ఎక్కువ పలుచగా ఉంటుందని పరిశోదనలు చెబుతున్నాయి. దీనివల్లే వారి చర్మం పొడిబారటం, ఇరిటేషన్‌తో పాటు సుకుమారంగానూ ఉంటుందట. అందుకే, ఆ సమయంలో వారి స్కిన్‌కి తగినంత తేమను అందించాలట.



# వరల్డ్‌కప్ చెస్ ఛాంపియన్‌గా కార్ల్‌సన్

## భారత్ గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఓటమి



**న్యూఢిల్లీ:** తొలిసారిగా నిర్వహించిన ఈ స్పోర్ట్స్ వరల్డ్ కప్ చెస్ టోర్నమెంట్‌లో నార్వే దిగ్గజం, ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ గార్ల్‌సన్ ఛాంపియన్‌గా అవతరించాడు. అయితే భారత్ గ్రాండ్ మాస్టర్, తెలంగాణ స్టార్ ఇరిగేసి అర్జున్ ఓటమిపాలయ్యాడు. ఆదివారం ఫ్రాన్స్‌కు చెందిన అలీరెజా ఫిరూజాతో జరిగిన ఫైనల్ పోరులో కార్ల్‌సన్ 3-1, 3-1తో విజయం సాధించాడు. సెట్ 1లో భాగంగా జరిగిన నాలుగు గేముల్లో కార్ల్‌సన్ రెండు గేముల్లో గెలిచి, మరో రెండింటిని డ్రా చేసుకున్నాడు. సెట్ 2లో భాగంగా జరిగిన నాలుగు గేముల్లో అతడు మూడు గేముల్లో నెగ్గి, ఒక గేమ్‌లో ఓడిపోయాడు. అమెరికాకు చెందిన హికారు నకముర మూడో స్థానం పొందగా, భారత్ గ్రాండ్ మాస్టర్, తెలంగాణ స్టార్ ఇరిగేసి అర్జున్ నాలుగో స్థానానికి పరిమితమయ్యాడు. నకమురతో జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో అర్జున్ 2.5-3.5తో ఓటమి చెందాడు. ఐదు గేముల్లో అర్జున్ రెండింటిలో గెలిచి, ఒక గేమును డ్రా చేసుకున్నాడు. విజేతగా నిలిచిన కార్ల్‌సన్‌కు 2,50,000 డాలర్లు (భారత్ కరెన్సీలో 2.18 కోట్ల రూపాయలు) లభిస్తాయి. రెండో స్థానం పొందిన అలీరెజాకు 1,90,000 డాలర్లు (1.65 కోట్ల రూపాయలు), మూడో స్థానంలో నిలిచిన నకమురకు 1,45,000 డాలర్లు (1.26 కోట్ల రూపాయలు), నాలుగో స్థానంలో నిలిచిన ఇరిగేసి అర్జున్‌కు 1,15,000 డాలర్లు (1.33 కోట్ల రూపాయలు ప్రైజ్‌మనీగా లభిస్తాయి.

# వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్‌లో స్వర్ణంతో మెరిసిన మురళీ




**న్యూఢిల్లీ:** ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్‌లో భారత్‌లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. కజికిస్తాన్‌లో ఆదివారం 2025 కోసనోవ్ మెమోరియల్ ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ కాంస్య ఈవెంట్ పురుషుల లాంగ్ జంప్‌లో భారతదేశానికి చెందిన మురళీ స్వర్ణం సాధించాడు. గాయం నుంచి ఇటీవలే తిరిగి వచ్చిన శంకర్, పోడియంపై అగ్రస్థానంలో నిలిచేందుకు 7.94 మీటర్ల ఉత్తమ ప్రయత్నాన్ని నమోదు చేశాడు. 26 ఏళ్ల శ్రీశంకర్ తన మొదటి ప్రయత్నంతోనే తన అత్యుత్తమ జంప్‌ను నమోదు చేశాడు. అతని తదుపరి మూడు జంప్‌లు 7.73 మీటర్లు, 7.58 మీటర్లు, 7.57 మీటర్లు అన్నింటిని అధికమించేలా పోటీ సవాలుగా మార్చింది. తన మొదటి ప్రయత్నాన్ని మెరుగుపరుచుకోవడానికి కష్టపడి, శంకర్ చివరికి 7.80 మీటర్లు మరియు 7.79 మీటర్లతో స్వర్ణం సాధించి తన ప్రచారాన్ని ముగించాడు. ఫిలిప్పీన్స్‌కు చెందిన జాన్రీ ఉబాస్ (7.53 మీటర్లు) మరియు అజర్‌బైజాన్‌కు చెందిన నజీమ్ బాబీవ్ (7.48 మీటర్లు) వరుసగా రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. శంకర్ ప్రస్తుతం 2025 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ అర్హత సాధించే ప్రయత్నంలో ఉన్నాడు. పురుషుల లాంగ్ జంప్‌లో ప్రపంచ ఈవెంట్‌కు ప్రత్యక్ష అర్హత మార్కు 8.27 మీటర్లుగా ఉంది.

# వరల్డ్ రెజ్లింగ్‌లో లాకీకి రజతం

## గోల్డ్ పోరుకు సిటెండర్, పునియా ఓటమి

### భారత్ ఖాతాలో 8 పతకాలు



**న్యూఢిల్లీ:** అండర్ 17, ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ రెజ్లర్ లాకీ రజత పతకాన్ని గెలుచుకున్నాడు. దీంతో ఇప్పటివరకు, భారత్ ఖాతాలో 8 పతకాలు జమ కాగా, వీటిలో 3 స్వర్ణాలు, 4 రజతాలు మరియు ఒక కాంస్య పతకం ఉన్నాయి. ఇక బంగారు పతక పోరుకు భారత్‌కు చెందిన సిటెండర్ అర్హత సంపాదించాడు. అయితే కాంస్య పతక పోరులో భారత్‌కు చెందిన మరో రెజ్లర్ గౌరవ్ పునియా ఓటమి చెందాడు. గ్రీస్‌లోని ఏథెన్స్‌లో ఆదివారం జరిగిన జరిగిన ఈ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశానికి చెందిన లాకీ 110 కిలోల పురుషుల ఫ్రీస్టైల్ విభాగంలో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. తటస్థ యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ జెండా కింద పోటీ పడుతున్న మాగోమెడ్రాసుల్ ఒమరోవ్‌తో జరిగిన ఈ పోటీలో, లాకీ బంగారు పతక పోరులో 4-6 తేడాతో ఓడిపోయాడు. అంతకుముందు, లాకీ సెమీఫైనల్లో ఇరాన్‌కు చెందిన అమిర్‌హోస్సేన్ నాగ్దలిపూర్‌ను 15-7తో ఓడించి, ఆ తర్వాత ఫైనల్స్‌లో 15-7తో ఆధిక్యంలో ఉన్నాడు. అలాగే పురుషుల 65 కిలోల ఫ్రీస్టైల్ కాంస్య పతక పోరులో భారత్‌కు చెందిన గౌరవ్ పునియా ఓడిపోయాడు. ఇరాన్‌కు చెందిన మోర్టెజా మొల్లమోహామ్మదితో పోరాడుతున్న పునియా, నిర్ణీత సమయంలో 8-8తో ముగిసిన తర్వాత కాంస్య పతకాన్ని కోల్పోయింది. ముందుగా పునియా రెపిచేజ్ రౌండ్‌ను అధిగమించాడు. సాంకేతిక ఆధిపత్యంతో పోలాండ్‌కు చెందిన మిచల్ మిచ్నీవిచ్‌పై 10-0 తేడాతో విజయం సాధించాడు. ఇక పురుషుల 60 కిలోల ఫ్రీస్టైల్ రెజ్లింగ్‌లో భారత క్రీడాకారుడు సిటెండర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సెమీ ఫైనల్లో కజకిస్తాన్‌కు చెందిన బెకాసిల్ అస్సాంబెక్‌పై 5-1 తేడాతో విజయం సాధించి సిటెండర్ బంగారు పతక పోరులో తన స్థానాన్ని సంపాదించుకున్నాడు.

# ఉత్కంఠ పోరులో పాకిస్థాన్ ఓటమి




## 2 పరుగుల తేడాతో వెస్టిండీస్ విక్టరీ

**న్యూఢిల్లీ:** నరాలు తెగే ఉత్కంఠ పోరులో చివరి బంతికి పాకిస్థాన్ ఓటమి పాలైంది. ఫ్లోరిడా వేదికగా పాకిస్థాన్‌తో ఆదివారం ఆద్యాంతం ఆసక్తి భరితంగా సాగిన రెండో టీ20లో వెస్టిండీస్ 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. విండీస్ ఆల్‌రౌండర్ జాసన్ హోల్డర్ ఆఖరి బంతికి ఫోర్ కొట్టి తన జట్టును గెలిపించాడు. పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేయగా, వెస్లిండీస్ 8 వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. పాకిస్థాన్ బ్యాటర్లలో హసన్ నవాజ్ (40) టాప్ స్కోరర్‌గా నిలువగా, సల్మాన్ అఘా (38) పరుగులతో రాణించాడు. మిగిలిన బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. విండీస్ బౌలర్లలో జాసెన్ హోల్డర్ 4 వికెట్లు పడగొట్టగా, మోటీ 2 వికెట్లు, అకిల్ హోస్సేన్, చేజ్, జోషఫ్ తలా ఒక వికెట్ సాధించారు. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనలో వెస్టిండీస్ తడబడింది. వరుస క్రమంలో వికెట్లు కోల్పోయి ఓటమి దిశగా పయనించింది. అయితే జాన్సన్ హోల్డర్ (16), షెఫర్డ్ (15) కాస్త దూకుడుగా ఆడటంతో వెస్టిండీస్ తిరిగి గేమ్‌లోకి వచ్చింది. ఈ క్రమంలో ఆఖరి ఓవర్‌లో కరేబియన్ జట్టు విజయానికి 8 పరుగులు అవసరమయ్యాయి. షాహీన్ అఫ్రిది వేసిన తొలి బంతికి హోల్డర్ సింగిల్ తీయగా, రెండో బంతికి షెఫర్డ్ ఔటయ్యాడు. తర్వాతి మూడు బంతుల్లో మూడు పరుగులు వచ్చాయి. దీంతో ఆఖరి బంతికి వెస్టిండీస్ గెలుపునకు 4 పరుగులు అవసరం అయ్యాయి. ఆ బంతిని అఫ్రిది వైడ్‌గా సంధించడంతో వెస్టిండీస్ విజయ సమీకరణంగా మూడు పరుగులుగా మారింది. ఈ క్రమంలో హోల్డర్ ఆఖరి బంతిని బౌండరీకి తరలించాడు. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో వెస్టిండీస్ 135 పరుగులు చేసి కేవలం రెండు పరుగుల ఆధిక్యంలో సంచలన విజయాన్ని హోప్ సేన తన ఖాతాలో వేసుకుంది. ఈ విజయంతో సిరీస్‌ను 1-1తో ఆతిథ్య వెస్టిండీస్ సమం చేసింది. పాకిస్థాన్ బౌలర్లలో మహ్మద్ నవాజ్ 3 వికెట్లు పడగొట్టగా, సైమ్ ఆయుబ్ 2 వికెట్లు సాధించాడు.

# ప్రజల వద్దనే రూ.6,017 కోట్ల 2వేల నోట్లు

**ముంబై, ఆగస్టు 3:** రూ.2వేల నోట్లను ఇప్పటికే ఆర్బీఐ రద్దు చేసింది. చెలామణిలో ఉన్న నోట్లను వెనక్కి తీసుకుంది. దానికి కొంత సమయం కూడా ఇచ్చింది. అయినా కొంతమంది వద్ద రూ.2వేల నోట్లు ఇంకా ఉన్నాయి. దీనికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. చెలామణి నుండి తొలగించిన రెండేళ్ల తర్వాత కూడా రూ.6,017 కోట్ల విలువైన నోట్లు ఇప్పటికీ ప్రజల వద్దే ఉన్నాయని తెలిపింది. రెండు వేల రూపాయల బ్యాంక్ నోట్లు ఇప్పటికీ చట్టబద్ధంగా చెల్లుబాటులో ఉన్నాయి. ఆర్‌బిఐ మే 19, 2023న చెలామణి నుండి రూ.2,000 బ్యాంక్ నోట్లను ఉపసంహ రించుకుంటున్నట్లు ప్రకటించింది. 2023 మే 19 నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 బ్యాంక్ నోట్ల మొత్తం విలువ రూ.3.56 లక్షల కోట్లు అని ఆర్బీఐ తెలిపింది. ఇది జూలై 31, 2025 నాటికి రూ.6,017 కోట్లకు తగ్గిందని వెల్లడించింది.




2023 మే 19 నాటికి చెలా మణిలో ఉన్న రూ.2వేల బ్యాంక్ నోట్లలో 98.31 శాతం తిరిగి వచ్చాయి. రెండు వేల రూపాయల బ్యాంకు నోట్లను మార్చుకునే సౌకర్యం రిజర్వ్ బ్యాంక్ యొక్క 19 ఇష్యూ కార్యాలయాలలో 2023 మే 19 నుండి అందుబాటులో ఉంది.

రూ.2వేల నోట్లను ఈ విధంగా జమ చేయవచ్చు. 9 అక్టోబర్ 2023 నుండి రిజర్వ్ బ్యాంక్.. వ్యక్తులు - సంస్థల నుండి వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయడానికి రూ. 2,000 బ్యాంకు నోట్లను అంగీకరిస్తున్నాయి. ప్రజలు దేశంలోని ఏ పోస్టాఫీసు నుంచైనా ఇండియన్ పోస్ట్ ద్వారా రూ. 2వేల నోట్లను ఆర్బీఐ యొక్క ఏదైనా ఇష్యూ కార్యాలయానికి పంపి తమ బ్యాంకు ఖాతాలలో జమ చేసుకోవచ్చు. ఈ కార్యాలయాలు అహ్మదాబాద్, బెంగళూరు, బేలాపూర్, భోపాల్, భువనేశ్వర్, చండీగఢ్, చెన్నై, గౌహతి, హైదరాబాద్, జైపూర్, జమ్మూ, కాన్పూర్, కోల్‌కతా, లక్నో, ముంబై, నాగ్‌పూర్, న్యూఢిల్లీ, పాట్నా, తిరువనంతపురంలలో ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2వేల నోటును నవంబర్ 2016లో ప్రవేశపెట్టింది. పాత రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేసినప్పుడు దేశ కరెన్సీ అవసరాలను త్వరగా తీర్చడానికి ఈ నోటును తీసుకిచ్చింది. ఇది సక్సెస్ కావడంతో పాటు ఇతర నోట్లు తగినంత సంఖ్యలో అందు బాటులోకి వచ్చిన వెంటనే 2018-19లో రూ.2,000 నోట్ల ప్రింటింగ్‌ను నిలిపివేసింది. రూ.2వేల నోట్లలో ఎక్కువ భాగం మార్చి 2017కి ముందు జారీ చేయబడ్డాయి. ఇప్పుడు వాటి జీవితకాలం ముగిసిపోయాయి. లావాదేవీలలో రూ.2,000 నోట్లను ఉపయోగించరు.

# 'ఎఐకి అంత సీన్ లేదు': నీలేకని

**ముంబై, ఆగస్టు 3:** ఆధార్, యుపిఐ ఆవిష్కరణల్లో కీలక పాత్ర పోషించిన నందన్ నీలేకని భారత్ లో కృత్రిమ మేధ (ఎఐ) ప్రభావం ఉద్యోగాలపై ఎలా ఉండబోతుందో తన అభిప్రాయా న్ని పంచుకున్నారు. ఎఐ భారతదేశ జాబ్ మార్కెట్‌పై పెద్దగా ప్రభావం చూపదని చెప్పారు. అందుకు బదులుగా భారీగా సంపదను, అవకాశాలను సృష్టిస్తుందని తెలిపారు. సాంకేతిక నిపుణులు ఎఐలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడంతో పాటు వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడంపై దృష్టిపెట్టాలని కోరారు.

'ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ అధికారం కొంత మంది చేతుల్లో కేంద్రీకృతం అవుతుంది. ఈ ధోరణి ఇప్పటికే ప్రపంచ సాంకేతిక పర్యా వరణ వ్యవస్థల్లో కనిపిస్తుంది. కానీ భారతదేశం అందుకు భిన్నమైన దృక్పథాన్ని నిర్మించాలి. ప్రపంచ శక్తులతో మనం పోరాడలేం. కానీ మన ప్రభావిత ప్రాంతంలో కోట్ల మంది ప్రజలు సమస్యలను పరిష్కరించ డానికి నూతన ఆవిష్కరణలు చేయాలి. ఉద్యోగం పోతుందని భయపడే బదులు నైపుణ్యాల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి కృత్రిమ మేధను ఉపయోగించాలి' అని నీలేకని అన్నారు.


सत्यमेव जयते

భారత ప్రభుత్వం

NSO INDIA Data for Development

75 National Sample Survey

Celebrating 75 years of NSS



ప్రయాణం మరియు పర్యాటక రంగంపై సమాచార విధాన నిర్ణయం కోసం డేటా

జాతీయ గణాంక వ్యవస్థను బలోపేతం చేద్దాం

జాతీయ గణాంకాల కార్యాలయం (NSO), గణాంకాలు మరియు కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (MOSPI), జూలై 2025 నుండి జూన్ 2026 వరకు దేశీయ పర్యాటక వ్యయ సర్వే (DTES) మరియు జాతీయ గృహ ప్రయాణ సర్వే (NHTS) లను నిర్వహిస్తోంది.

దేశీయ పర్యాటక వ్యయ సర్వే (DTES):

సమాచార సేకరణ :

యాత్ర ఉద్దేశ్యం - సెలవు, ఆరోగ్యం, తీర్థయాత్ర, షాపింగ్, సామాజిక, మొదలైనవి.

ట్రిప్ రకం - ప్యాకేజీ, నాన్-ప్యాకేజీ

ప్రయాణ విధానం - వాయు, రైలు, జల, రోడ్డు రవాణా

బస రకం - వాణిజ్య, వాణిజ్యేతర

గమ్యస్థానం - రాష్ట్రం లోపల, రాష్ట్రం వెలుపల

బుక్ చేసుకున్న ట్రిప్ సేవలు - ఆన్‌లైన్, ఆఫ్‌లైన్

పర్యటన ఖర్చు





జాతీయ గృహ ప్రయాణ సర్వే (NHTS):

సమాచార సేకరణ :

యాత్ర ఉద్దేశ్యం - ఉద్యోగం/విద్య కోసం

ప్రయాణాల ఖర్చు

ప్రయాణ విధానం

ఒకే రోజు పర్యటనలు (పని/విద్య మినహాయించి)

ప్రయాణాల మూలం మరియు గమ్యస్థానం, దూరం, ప్రయాణ సమయం

జాతి నిర్మాణానికి తోడ్పడండి, సర్వేలో పాల్గొనండి

CBC 39101/13/0002/2526

కుటుంబాలు NSO యొక్క ఎన్యూమరేటర్లతో సహకరించి ఖచ్చితమైన డేటాను అందించాలని అభ్యర్థించబడింది.
సర్వేలో పాల్గొనే కుటుంబాల గుర్తింపు MoSPI యొక్క అన్ని నివేదికలు/మైక్రోడేటాలో గోప్యంగా ఉంచబడుతుంది.

www.mospi.gov.in @GoIStats /GoIStats GoIStats Ministry of Statistics & PI


Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.